# కథామంజరి

## పది కథల సమాహారం



**సంక్రాంతి ప్రత్యేక సంచిక**

**జనవరి 2026**

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**

**జనవరి 2026**

సంపుటి : 7 ♦ సంచిక : 1

# అందరికీ
# నూతన వత్సర
# మరియు
# సంక్రాంతి
# శుభాకాంక్షలు



శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ

స్మారక సంక్రాంతి కథల పోటీకి

ఆర్థిక సహాయం అందించిన

శ్రీ పి.వి.ఎస్.ఎల్.ఎన్. మూర్తి గారికి

మా హృదయపూర్వక కృతజ్ఞతలు.



# కథామంజరి

## శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక సంక్రాంతి కథల పోటీ 2026 – ఫలితాలు

| ప్రథమ బహుమతి రూ. 5000/- | ద్వితీయ బహుమతి రూ. 3000/- | తృతీయ బహుమతి రూ. 2000/- |
|---|---|---|
| **ఎగిలివారంగా సుక్క** | **పులి న్యాయం** | **ఋషి** |
| చొప్పదండి సుధాకర్ | వెంకటమణి | సింహప్రసాద్ |

### ప్రత్యేక బహుమతులు

1. **దొంగ వర్సెస్ దేవుడు** ... విజయార్కె
2. **వక్కరోలు** ... డా. దారల విజయ కుమారి
3. **అశ్రుపరిమళం** ... శ్రీ పి. ఎస్. నారాయణ
4. **జీవుగంజి** ... శ్రీ బోయిన భాస్కర్
5. **అమృతహస్తం** ... శ్రీమతి వాడపల్లి పూర్ణ కామేశ్వరి
6. **నాంది** ... డా. చెళ్ళపిళ్ళ సూర్య లక్ష్మి
7. **ఊరవతలి మేఘం** ... శ్రీ గౌతమ్ లింగా
8. **లేమిని మించని పాపం** ... శ్రీ పి. వి. ఆర్. శివకుమార్
9. **నిరసన** ... శ్రీ తులసి బాలకృష్ణ
10. **నెలగంట నవ్వింది** ... శ్రీమతి వేలూరి ప్రమీలా శర్మ

### జ్యూరీ బహుమతి

**అతడో మార్గదర్శి** - శ్రీ కొత్తపల్లి ఉదయబాబు

ఈసారి పోటీకి కూడా అసంఖ్యాకంగా కథలు వచ్చాయి. కానీ పోటీకి నిలబడినవి పది శాతం కూడా లేవనే అభిప్రాయం న్యాయనిర్ణేతలు వెలిబుచ్చారు. అయితే.. పాత రచయితలతో బాటు కొత్తవారు కూడా ఉత్సాహంగా పోటీలో పాల్గొనడం తెలుగు కథకు శుభ పరిణామం అని చెప్పాలి.

పోటీలో పాల్గొన్న కథకులందరికీ ధన్యవాదాలు. అలాగే.. ఎప్పటికప్పుడు కథలు చదివి వారి వారి నిర్ణయాలను, నిర్ణయించిన తేదీలోగా ఫలితాలుగా ప్రకటించడానికి సహకరించిన న్యాయ నిర్ణేతలందరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం!

సాధారణ ప్రచురణకు స్వీకరించబోయే కథల గురించి, ఆయా రచయితలకు నేరుగా త్వరలో తెలియచేయడం జరుగుతుంది.

**కథామంజరి బృందం**



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నండూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు

# కథామంజరి శ్రావ్యసంచిక



## ఈ నెల శ్రావ్యసంచికకి
## సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

**శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి**




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన .. | ix |
| కథాపుస్తక పరిచయం | x |


## కథలు


| | | |
|---|---|---|
| ఎగిలివారంగా సుక్క | చొప్పదండి సుధాకర్ | 1 |
| పులిన్యాయం! | వెంకటమణి | 6 |
| ఋషి | సింహప్రసాద్ | 12 |
| దొంగ వర్సెస్ దేవుడు | విజయార్కె | 20 |
| వక్కరోలు | డా. దారాల విజయకుమారి | 25 |
| అశ్రుపరిమళం | పి.ఎస్. నారాయణ | 35 |
| పొగడ్తల పులి | సాయి కమల్ | 42 |
| సోమశేఖరుని సాయం | వాధూలస | 45 |
| పాత్రలకి ప్రాణంవస్తే? | ద్విభాష్యం సూరీడు | 47 |
| పతితుని హృదయం | వట్టికోట ఆళ్వారుస్వామి | 56 |


ముఖచిత్ర రచన : శ్రీ బ్నిం



# కథాకీయం

ఒక్కొక్కసారి పోటీలు నిర్వహించడం వలన కథా సాహిత్యానికి మంచి జరుగుతుందా.. చెడు జరుగుతుందా అనే ఆలోచనలు వస్తున్నాయి! “రచయిత అన్నవాడు తను రాస్తున్నవి ఏ మంచికి హాని కలిగిస్తూందో, ఏ చెడ్డకి ఉపకారం చేస్తోందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హానీ, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను.” రావిశాస్త్రి గారు చెప్పిన ఈ మాట.. పోటీల విషయంలో వర్తిస్తుందేమో అని అప్పుడప్పుడు అనిపిస్తుంది. కారణం.. పోటీలకు వచ్చే కథల నాణ్యత ఒక ఎత్తు అయితే.. నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, అనుభవాలు మరో ఎత్తు! పోటీలకి వచ్చే కథల నాణ్యత చూస్తే.. పదిశాతం కథల్లో కూడా ఉండటం లేదు. సంఖ్యాపరంగా ఎక్కువ వస్తున్నాయి గాని.. ఆ కథలని చదివి ఎంపిక చేయటానికి.. సీనియర్ కథకులు, విశ్లేషకులు.. కథలు చదివి మంచి కథలను ఎంపిక చేయగల వారెవరూ.. న్యాయనిర్ణేతలుగా ముందుకు రావడంలేదు. వారిలో కొద్దిమందితో ఉండే స్నేహం వలన వారిని ఒప్పించడం, వచ్చిన కథలను వడపోతలు చేసి, ఫైనల్‌గా ఉండే ఓ ముప్పై, నలభై కథలనే పంపి ఫలితాలు తీసుకోవడం జరుగుతోంది. ఇక పత్రికలు నడిపేవారి అనుభవం చూస్తే.. కథలు కేవలం పోటీలకే మాత్రమే పంపే పోకడలు సర్వత్రా కనబడుతున్నాయి! పోటీలకు పంపుతున్న కథలకు సంబంధించి పంపుతున్న హామీపత్రాలు కూడా చాలా సాధారణ విషయంగా తీసుకుంటున్నారే గాని, అందులో పొందుపరిచే విషయాల మీద ఉండవలసిన గంభీరత కనబడటం లేదు. తద్వారా రచయితల మీద ఉన్న విలువైన నమ్మకం కరిగిపోయే ప్రమాదం పొంచి ఉంది.

హామీపత్రాలలో పొందు పరిచే అంశాలకు విరుద్ధంగా ఒకే కథను రెండు, మూడు పోటీలకు ఒకేసారి పంపడం జరుగుతోంది. ఈ విషయం మీద నిఘా వేసి, నియంత్రణ చేయగలగడం.. నిర్వాహకుల పరిధిలో ఉండదు. తీరా ఫలితాలు ప్రకటించిన తర్వాత.. పాఠకుల ద్వారానే ఆ విషయం వెలుగులోకి వస్తున్నాయి! ఇక ఆ తర్వాత పోటీలలో ఎంపిక కాని కథలను సాధారణ ప్రచురణ తీసుకోకుండా, మాకు తిరిగి పంపమని హుకుంలు కూడా కొందరి రచయితల దగ్గర నుండి వస్తున్నాయి. ఫలితాల ప్రకటనలు వచ్చిన నెల రోజుల తర్వాత ‘ఫలనా కథ పంపాం. పోటీలో బహుమతి వచ్చిందా?’ అనే మెయిల్స్ వస్తున్నాయి! వచ్చిన కథల్లో సాధారణ ప్రచురణకు తీసుకునే కథలను ఎంపిక చేయడానికి సమయం పడుతుందని ప్రకటనలో పొందుపరిచినా, అది చూడకుండా కథ ఎంపిక చేసారా, లేదా అనే మెయిల్స్ వస్తున్నాయి. ఇది కేవలం కథామంజరికి ఎదురయే సమస్యేనా.. లేదా మిగతా పత్రికల వారికి కూడా ఈ అనుభవాలు, సమస్యలు ఉంటున్నాయా.. అన్న విషయం తెలియదు గాని.. ఈ వాస్తవ పరిస్థితిని అటు రచయితల దృష్టికి, ఇటు పాఠకుల ముందు కూడా ఉంచాలనే ఆలోచనతోనే ఈ వివరణ ఇవ్వడం జరిగింది.

తెలుగు కథను పది కాలాల పాటు నిలుపుకోవాలన్నా, మంచి కథలే కాదు, మంచి కథకులను కూడా తీసుకురావాలన్నా, రచయితలకి ఉండే గౌరవాన్ని నిలుపుకోవాలన్నా.. అందరం సమిష్టిగా బాధ్యత తీసుకుని.. ఏం చెయ్యాలో ఆలోచించాలి!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**శ్రీ ద్విభాష్యం సూర్యనారాయణ మూర్తి**

ఆయననో బ్యాంకు జనరల్ మేనేజరుగా, చాలా కాలం విదేశాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన ఓ మేధావిగా, చాలా భాషల మీద పట్టుతో పాటు.. ఆయా భాషల్లో చాలా పుస్తకాలు చదివిన భాషావేత్తగా గుర్తింపు ఉంది గాని, తెలుగులో మంచి కథకుడుగా పరిచయం ఉన్నది అతి కొద్దిమందికే! ఓ విధంగా ఓ పేద కుటుంబంలో పుట్టి, కష్టపడి ఎదిగి ఉన్నత స్థానాలకి ఎదగాలనే ఓ తపన.. అతనిలోని ఓ మంచి కథకుడ్ని కొంత మేర వెనక్కి నెట్టిందనే సత్యం.. ఆయన రాసిన అతి కొద్ది కథల ద్వారా అర్థమవుతుంది. అలా వెనుక బెంచిల్లో కనబడే మంచి కథకుల్లో మొదటి వరుసలో చెప్పుకోదగ్గ కథారచయిత శ్రీ ద్విభాష్యం సూర్యనారాయణ మూర్తిగారు!

తాత తండ్రులనుంచి సంక్రమించిన భాషాభిమానం, అవగాహన సూర్యనారాయణ మూర్తిగారికి ఓ వరం అనే చెప్పాలి. వీరి తండ్రి గారు తెల్లవారుజామునే లేచి భాగవతంలో పద్యాలు చదివేవారుట.. అవి విని మూర్తి గారికి చిన్నతనంలోనే ఆ పద్యాలు వచ్చేసాయి. గ్రామానికి సంబంధించిన అర్జీలు గాని, ఆ గ్రామంలో పనిచేసే ఉద్యోగులకు సంబంధించిన అర్జీలు గాని, పై అధికారులకు పంపడానికి.. మూర్తిగారి తండ్రిగారే ఆయా విషయాలను పద్య రూపంలో వ్రాసి ఇచ్చేవారుట! అలాంటి తండ్రి పెంపకంలో పెరిగిన మూర్తి గారికి ప్రేరణ ఆయన తండ్రే! ఆ ప్రేరణతో మూర్తి గారు కూడా చిన్నప్పటి నుంచే పద్యాలు వ్రాయడం మొదలెట్టారు. అలా మొట్టమొదటి రచన శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం సంస్కృతం నుండి తెలుగులోకి అనువాదం. తర్వాత కాలంలో ప్రముఖ కథారచయిత శ్రీ భూపతిరాజుగారి ప్రోత్సాహంతో కథలు వ్రాయడం మొదలెట్టి, జానకి డైరీ అనే కథను మొట్టమొదటగా వ్రాస్తే, అది ఆంధ్రపత్రికలో ప్రచురింపబడింది. ఆ తర్వాత తరచుగా కథలు వ్రాయడం.. అవి వివిధ పత్రికలలో ప్రచురించబడటం జరిగాయి. అదే సమయంలో.. బ్యాంకులో చేస్తున్న ఉద్యోగంలో ప్రమోషనులు తీసుకుని, పైకి ఎదగాలనే ఓ తపనతో అటు వైపు దృష్టి పూర్తిగా మరలి, సహజంగా సమయం చిక్కక పోవడంతో, కథా రచనలు మూతపడ్డాయి. వారికి సమకాలికులైన శ్రీయుతులు యండమూరి, మల్లాది వెంకటకృష్ణమూర్తి, యద్దనపూడి సులోచనారాణి, ద్విభాష్యం రాజేశ్వరరావు వంటి రచయితలు.. తమ రచనలతో రాణిస్తుంటే.. ఆ ప్రేరణతో మరో రెండో మూడు కథలు మాత్రం రాయగలిగారుట! వీరు వ్రాసినవి సంఖ్యాపరంగా తక్కువే కాని, ఆ కథలన్నీ అతి సహజమైన కథావస్తువులతో పాఠకుల్ని కట్టి పడేస్తాయి. కోళ్ల ఆగ్రహం, మంచితనం, మొట్టమొదటి చిట్టచివరి ప్రేమలేఖ, సిరిమల్లె పువ్వు, పాత్రలకి ప్రాణం వస్తే, పాఠం నేర్పిన పాఠం, జానకి డైరీ, చాక్‌బోర్డ్ వంటి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి.

సూర్యనారాయణమూర్తిగారు 1941 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లాలో దుర్గాడ గ్రామంలో జన్మించారు. బి.కామ్ చదివి.. పద్దెనిమిదో ఏట బ్యాంకు ఆఫ్ బరోడాలో అప్రెంటిస్‌గా చేరారు. అంచెలంచెలుగా ఎదిగి, జనరల్ మేనేజర్‌గా పదవీవిరమణ చేసారు. దేశంలో మొట్టమొదటి "కార్పొరేట్ బ్యాంకింగ్ బ్రాంచి" ని బెంగుళూరులో మూర్తిగారే ప్రారంభించడం, తర్వాత కాలంలో, దక్షిణాఫ్రికాలో మొట్టమొదటి బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖని కూడా మూర్తిగారి ద్వారా

ప్రారంభించడం జరిగింది. ఆ శాఖని మహాత్మాగాంధీ మనుమడు శ్రీ గోపాలకృష్ణ గాంధీ గారు ప్రారంభించడం ఓ విశేషం. తర్వాత కాలంలో మూర్తిగారిని యూరోపియన్ ఆపరేషన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా లండన్‌లో నియమించారు. ఆ రోజుల్లోనే భారత ప్రధానులు శ్రీ పి.వి. నరసింహారావు, శ్రీ ఏ.బీ. వాజపేయి, శ్రీ ఐ.కె. గుజ్రాల్ ప్రభృతుల పరిచయం భాగ్యం మూర్తిగారికి కలిగింది. 1996లో నమీబియాలో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో భారతదేశం తరపున పాల్గొనే అవకాశం కూడా మూర్తిగారికి దక్కింది. బ్యాంకులో 2001లో పదవీవిరమణ తర్వాత.. కొన్ని సంస్థల్లో పనిచేసి, 2013 నుంచి రాజమండ్రిలో వానప్రస్థాశ్రమంలో జీవనం గడిపి, ఇప్పుడు హైదరాబాదులో స్థిరనివాసంలో ఉన్నారు. పుస్తక పఠనం, భగవదారాధనలో జీవనం గడుపుతున్నారు. అయితే.. దేశవిదేశాల్లో ఎన్నో జీవితానుభవాలు కలిగాయి; ఎన్నో జీవితాలు, సంఘటనలు ప్రేరణ కలిగించాయి. వాటిలో ఎన్నో కథావస్తువులున్నాయి. అవి వ్రాయలనే ఆలోచనతో.. ఎనభై ఐదో ఏట అడుగుపెట్టిన శ్రీ ద్విభాష్యం సూర్యనారాయణ మూర్తిగారు తప్పకుండా మళ్ళీ తన కలంతో కథాప్రియులను అలరిస్తారని ఆశిస్తూ, వారికి ఆయురారోగ్యాలు మెండుగా ఉండాలనీ కోరుకుంటూ, ఈ సంచికకి విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. వట్టికోట ఆళ్వారుస్వామి

జనం నుంచి.. జనంలోకి సాహిత్యం అని నమ్మి, తనకున్న ఆర్థిక ఇబ్బందులు, మానసిక బాధలు, రోగాలు ఎన్ని ఉన్నా, చిరునవ్వుతో నిర్మలమైన మనసుతో అందరికి ఆప్తుడుగానే కాకుండా.. ఓ సాహితీవేత్తగా కీర్తి గడించిన మహామనిషి కీ.శే. వట్టికోట ఆళ్వారుస్వామి. "ఆళ్వారు ఏదో ఒక మనిషి పేరు కాదు, అదో విధానం! అతను చరిత్రకారుడు కాదు, అతనే స్వయంగా చరిత్ర" అని ప్రముఖ సాహితీవేత్త కాళోజీ నారాయణరావు గారు అన్నారంటే.. ఆళ్వారుస్వామి గారి గొప్పతనం గురించి ప్రత్యేకించి చెప్పవలసిన అవసరం లేదు.

నిజాం పరిపాలన కాలంలో ప్రజా పోరాటాల నడుమ, కలం పట్టి కదనరంగంలోకి అడుగు పెట్టారు ఆళ్వారుస్వామి గారు! నిజాం పాలనలో.. తెలంగాణ ప్రజా జీవితాలని అద్భుతంగా ఆవిష్కరిస్తూ.. ఆళ్వారుస్వామి గారు తన మొదటి నవల "ప్రజల మనిషి" ను 1938లో వ్రాసారు. నిజానికి ఈ నవల తెలంగాణ తొలి నవలగా గుర్తింపు పొందింది. తర్వాత కాలంలో ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రస్ఫుటిస్తూ "గంగు" అనే నవల వ్రాసారు. ఆయన జైలు అనుభవాలతో "జైలు లోపల" కథల సంపుటి వ్రాసారు. ఆయన రచనలలో ఉద్యమాలు కనబడతాయి. ప్రేమలు, ఆప్యాయతలు, వేదనలు.. ఆర్థిక, సామాజిక అంశాలు అతి సున్నితంగా, పాఠకులను ఆకట్టుకునే కథనంతో, శైలితో మనసుకు హత్తుకునేలా వ్రాసారు. ఆయన రచనలు రాసిలో తక్కువే.. కాని వాసిలో అజరామరంగా నిలిచిపోయేవే!

నిజాయితీగా నిబద్ధతతో రచనలు చేసిన ఆళ్వారుస్వామి గారి జీవితమే ఓ ఆదర్శవంతమైన కథనంలా సాగింది. 1914 సంవత్సరంలో నల్గొండ జిల్లా మాధారం అనే గ్రామంలో అతి పేద కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే తండ్రి పోయారు. ఓ ఉపాధ్యాయుని దగ్గర వంట చేస్తూ, ఆయన దగ్గరే విద్యాభ్యాసం చేసారు. తర్వాత విజయవాడ చేరి, అక్కడ కొద్దికాలం హోటల్లో సర్వర్‌గా పనిచేసారు. తర్వాత కాలంలో సురవరం ప్రతాపరెడ్డిగారి "గోల్కొండ" పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేసేవారు. అక్కడే సమాజాన్ని, జీవితాన్ని, సాహిత్యాన్ని అధ్యయనం చేసే అవకాశం వచ్చింది. దానికి తోడు.. బాల్యం నుంచే సాహిత్యం అంటే మక్కువ ఏర్పడి రచనా రంగం వైపు అడుగులు పడటంతో, పాతికేళ్ల వయసుకే పది పుస్తకాలను ప్రచురించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో ఒకవైపు, మరోవైపు గ్రంథాలయ ఉద్యమం, ఆంధ్ర మహాసభ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న సమయంలో ఆళ్వారుస్వామి గారిని అరెస్టు చేసి, నిజామాబాదు జైలులో పెట్టారు. అక్కడ దాశరథి గారు ఆయనకు సహ ఖైదీ. ఆళ్వారుస్వామి గారు.. దాశరథి గారు రచించిన పద్యాలను అక్కడ గోడల మీద వ్రాసేవారు. ఆ స్నేహ ప్రేరణతో దాశరథి గారు తను రచించిన "అగ్నిధార" సంకలనాన్ని ఆళ్వారుస్వామి గారికి అంకితం ఇచ్చారు.

ఎంతో ప్రజాదరణ పొందిన .. గాలిపటం, అంతా ఏకమైతే, పతితుని హృదయం, ఆలుకూలి, పరిగె... వంటి కథలు, కొన్ని నాటికలు, వందకు పైగా అభ్యుదయ వ్యాసాలు.. వ్రాసిన వట్టికోట ఆళ్వారుస్వామి గారు.. హైదరాబాదు ట్రేడ్ యూనియన్

కాంగ్రెస్, గుమస్తాల సంఘం, రిక్షా కార్మికుల సంఘం, రైల్వే ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం కూడా వహించారు. ఎప్పుడూ ప్రజా ఉద్యమాల ముందే నడిచిన ఆయన.. అతి పిన్న వయసులో 1962 ఫిబ్రవరి 5న మరణించారు. అటు ప్రజా పోరాటాలతో, ఇటు సాహితీరంగంలో చైతన్యవంతమైన జీవనం గడిపి, అందరికి మార్గదర్శకులుగా గుర్తింపబడిన కీ.శే. వట్టికోట ఆళ్వారుస్వామి గారు ఇటు కథకులకు కూడా మార్గదర్శి! అలాంటి మహనీయుని తలుచుకునే అవకాశం ఈ సంచిక ద్వారా వచ్చి, ఆయనకు నివాళులు అర్పిస్తున్నాం.

**కథామంజరి బృందం**



# కథా పరిచయం

## ఆర్. వసుంధరాదేవి గారి కథ : పెంజీకటి కవ్వల...

ఆర్. వసుంధరాదేవి (రాటకొండ వసుంధరాదేవి) గారు తెలుగు సాహిత్యంలో తమదంటూ ఒక స్థానాన్ని ఆక్రమించుకున్నారనడంలో సందేహం లేదు. అయితే ఆవిడకు రావలసినంత గుర్తింపు రాలేదన్నది నిజాయితీతో కూడిన అభిప్రాయం! ఆవిడ కథలు హిందీ, ఒరియా, కన్నడ, ఆంగ్ల భాషలలోకి అనువదించబడి, ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడెమీ అవార్డు, ఉత్తమ మహిళా రచయిత్రి – తెలుగు 1992 ప్రతిభా పురస్కారం ఆమెకు లభించిన అధికారపూర్వకమైన గుర్తింపులు.

మధురాంతకం నరేంద్రగారు వసుంధరాదేవిగారు తెలుగు కథకు గర్వకారణం అంటూ, ఆంతరంగిక, బయటి ప్రపంచాలు రెండింటినీ ప్రతిభావంతంగా చిత్రించిన చాలా కొద్దిమంది తెలుగు కథకుల్లో ఆమె ఒకరంటారు. జీవిత అస్తిత్వపు ప్రధాన సమస్యలైన మరణమూ, ఒంటరితనమూ వసుంధరాదేవి అందించిన అనేక కథలకు వస్తువులు! ముఖ్యంగా మరణం వస్తూందన్న తలపే భరించరానిది చాలామందికి! మరణానికి కొంచెం ఈవలగా.. ఒక మనిషి ఆలోచనల్లోని లోతును చెప్పడం అంత సులభతరం కాదు. అలాంటి కథావస్తువును ఎన్నో కథల ద్వారా పాఠకుల ముందుంచారు వసుంధరాదేవి గారు. కాని 'ఆమె కథలన్నీ జీవితాన్ని ప్రేమించడం నేర్పినవే! ఆమె కథలన్నీ వ్యక్తిలోని జీవితేచ్ఛను పెంచడంలో విజయం సాధించినవే" అని.. అలాంటి భావాలు, చావు బతుకుల అంతరార్థం ఏమిటో చర్చిస్తూ, పదిమంది చదివే కథలు చెప్పడానికి ధైర్యం, నిజాయితీ కావాలి. రచయిత(త్రి)కి తన ఆలోచనల్లో నమ్మకం (conviction) కావాలి. ఆ భావాలనర్థం చేసుకోవడానికి కావలసిన పరిశీలన, ఆలోచనల్లో లోతు కావాలి. అన్ని లక్షణాలతో మంచి కథలనందించిన వసుంధరాదేవి గారికి జోహార్లు.

అలాంటి కోవకు చెందిందే 'పెంజీకటి కవ్వల...' కథ. పెంజీకటి అంటే పోతనగారు వ్రాసిన 'లోకంబులు లోకేశులు...' పద్యం గుర్తుకొస్తుంది. మృత్యువు గురించి ఆలోచనలు తరుముతున్నప్పుడు మనసంతా పెంజీకటేగా! దానిని దాటే శక్తి మనకుందా?

జయలక్ష్మికి తాను చేసే ఏ పనికిగాని ఖచ్చితమైన కారణం చెప్పగల మనస్థిమితం లేదు. ఒక్కోసారి సంతోషం, ఉత్సాహం, అందరి మీద, ప్రేమ, ఇంకోసారి జీవితం అంతా నిస్సారంగా, నిరర్థకంగా కనిపిస్తుంది. స్పష్టత లేని భావాలు. దేన్నో పట్టుకోవాలనే నిరంతర యత్నం. అది మృత్యువా?

భర్త సీతారామారావు డాక్టరు. ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు రాధికకు పదహారేళ్ళు – బీఎస్సీ చదువుతోంది. చిన్నకూతురు చంద్రికకు ఆరేళ్లు. ఆ పిల్ల మెదడులో ఏర్పడిన లోపం వల్ల తెలివి పెరగలేదు. పెద్దకూతుర్ని చూస్తే ఎంత పొంగో, చిన్న

## కథా పరిచయం

కూతుర్ని తల్చుకుంటేనే గుండె చెరువైపోతుంది. దేవుడెందుకు ఆపిల్లను శిక్షించాలో అర్థం కాదు.

ఏడాది క్రితం కొట్టిన కరెంట్ షాక్ తల్చుకుంటేనే భయం. అందులోంచి బయట పడింది. అయితే ఆ చావు బతుకులకి తనెంత దగ్గరలో ఉందో! 'చావు, రోగం, బాధ, కష్టం.. ఇటువంటివన్నీ ఎందుకున్నాయి? వాటి బారి నుండి తప్పించుకునే మార్గమే లేదా?' ఒకప్పుడు తాత మరణం అర్థం కాలేదు. ఇప్పుడు మరణమంటే భయం! సర్కస్‌కి వెళితే, అక్కడ పిల్లలు ఫీట్లు చేస్తూ ఎక్కడ పడి ఆ పిల్లలకు ఏమవుతుందో అర్థం కాదు.

జయలక్ష్మికి ఎక్కడికి వెళ్ళినా దుఃఖపడటానికి ఒక కారణం కనబడుతుందన్నది రాధిక అనుకునే మాట. అది నిజం కూడా. ఇంటికి దగ్గరలో ఉన్న శ్మశానం నుంచి శవం కాలుతున్న వాసన భరించలేదు (తనే పట్టుబట్టి ఆ ఇంటికి మారింది). విపరీతమైన భయాన్ని కలిగిస్తుంది. ఆవేశం వస్తే ఎంతో ప్రేమ చూపించబడే చిన్నపిల్లను చావబాదుతుంది. ఎందుకిలా చేస్తోందో అర్థం కాదు. ప్రపంచమంతా దుఃఖసముద్రంలా కనబడుతుంది.

సీతారామారావు చిన్నాయన వెంకటప్ప.. పల్లెటూరు నుండి వచ్చాడు ఒంట్లో బాగాలేక. ఆయనకు ఊపిరితిత్తుల కేన్సరు అని నిర్ధారించారు. ట్రీట్మెంట్ కోసం బెంగళూర్ తీసికెళ్లడానికి నిర్ణయమయింది. సీతారామారావుతో బాటు జయలక్ష్మి కూడా బయల్దేరింది. అక్కడ పేషెంట్ల కళ్ళల్లో.. వాళ్ళందరూ చావుకు ఎదురుచూస్తున్నట్లుగా కనబడింది జయలక్ష్మికి. ఒళ్ళంతా భయం. అసహ్యంతో ముడుచుకుపోతోంది. తక్షణం అక్కడ నుంచి వెళ్ళిపోవాలి. కానీ ఏదో శక్తి ఆమెను కదలనీయదు. డిశ్చార్జ్ అవుతున్న పేషెంట్ల బంధువులు పంచుతున్న ప్రసాదం ముక్కలు.. కేన్సరు ముక్కలు పంచుతున్నట్లు అనిపించిందామెకు!

వెంకటయ్య పోయి ఇంటికి వచ్చినప్పటి నుంచి జయలక్ష్మికి తన శరీరమే భయంకరంగా కనిపించేది. తన శరీరంలో ఏ చిన్న తేడా ఉన్నా, అది కేన్సర్‌కి సంబంధించిందేమోనని అనుమానం, విపరీతమైన భయం. తన అనుమానాలను బలపరుస్తూ, గుండెనెప్పి వచ్చింది. గుండె బాగా దెబ్బతిందని ధ్రువపరిచారు. ఇంకా భయం. చూపుమేరంతా అంధకారం. మృత్యువు తనకెంతో దూరంలేదిప్పుడు!

ఒక రోజు అకస్మాత్తుగా ఆమె ఆలోచనలు స్తంభించిపోయినై! ఏ భావానికీ అంటని నిశ్శబ్దం ఆమెలో ఏర్పడింది. నవ్వుతూ, ఆడుతూన్న చంద్రిక, రాధిక కనబడ్డారు. ఎన్నో జీవాలు, ఎన్నెన్నో ఆనందాలు. అస్పష్టమైన భావాలు, భయాలు చెదిరిపోతున్నాయామెకు! అంత స్పష్టంగా, నిశ్చితంగా, స్వత్వాన్నంతా ఆవరించిన ఆ మహత్తరానుభూతి నిత్యమూ సత్యమూ అనిపించిందామెకు! అలాంటి అనుభూతి ఉన్నదన్న జ్ఞాపకం మిగిలింది. ఆ జ్ఞాపకంలో భయం ఎరుగని నిబ్బరం ఏర్పడ్డది. తాను లేకపోయినా ఈ ప్రపంచం, ఈ ప్రకృతి, ఈ మనుషులు ఆనందంగానే, ఎప్పటికీ ఉంటాయి, అనుకుంది జయలక్ష్మి ఆనందంగా పెంజీకటిని దాటేస్తూ!

ఇక్కడ కథ ఏమిటీ ప్రధానం కాదు. జయలక్ష్మి మనసులో జరిగే సంఘర్షణ ప్రధానం. అదీ తనకేమవుతుందో అన్న భయం వల్ల కలిగిన సంక్షోభం. రచయిత్రి ఆ మానసిక స్థితిని ఒక శాస్త్రజ్ఞురాలిగా పాఠకుల ముందుంచారు! కేవలం భయాందోళనలు చూపెట్టడం ఆమె లక్ష్యం కాదు. ఎందుకు జీవించాలో కూడా ఆమె ఈ కథలో చర్చించడం జరిగింది.

## కథా పరిచయం

జీవితం గురించిన చర్చలు ఈ చిన్న పరిచయంలో చెప్పడం కష్టం. రచయిత్రి చేసిన వాదాలు ఎవరైనా తర్కించవచ్చు కూడా. అయితే కథ చదవాలి. జయలక్ష్మి ఆలోచనలతో పాఠకుడు కలిసిపోయినప్పుడు కథకు న్యాయం చేకూరుతుంది. కథలో దొర్లిన కొన్ని ఆలోచనలు చూడండి.

"గాలికి కొట్టుకువచ్చిన మేఘాలు, ఆకాశంలో ఒకచోట ఒక ఆకారంగా ఏర్పడతాయి. అదొక నిశ్చలమైన ఆకారమనీ, దానికేదో అర్థముందనీ భ్రమ కలుగుతుంది. మరో గాలితో అవి చెదిరిపోతాయి. మనిషి కూడా అంతేనా?" అలాగే జీవితమంటే పిచ్చి గీతలేనా? అని ప్రశ్నిస్తారు రచయిత్రి ఇంకో కథలో.

"కాలం అనేది ఊహ. అనేకమైన క్షణాలు వున్నాయి. ఒక క్షణానికి మరో క్షణానికీ మధ్యన సంబంధం నిజం కాదు. ఆ సంబంధాన్ని కలిపేది మనస్సే."

ఇలాంటి ప్రశ్నలూ, పరిశీలనలూ, కథలో కొల్లలు. పాఠకుల్ని ఆలోచింపచేస్తాయి. కథ చదివి వదిలేయలేము. ఇంతకుముందు చదివితే మళ్ళీ చదవండి.

***పరిచయకర్త: శాయి రాచకొండ, హ్యూస్టన్***



# కథాపుస్తక పరిచయం




## కిష్టప్ప కథలు

కథా రచయిత శ్రీ భాగవతుల కృష్ణారావు గారి వివిధ సాహితీ ప్రక్రియలను కలగలిపి, ఈ సంపుటి వెలువడింది. వెల రు.150/-. 18 కథలు, 33 మినీకథలు, మరో ఇన్ని ముచ్చట్లు, కవితలతో సుందరంగా రూపుదిద్దుకున్న ఈ సంపుటి కోసం రచయితనే సంప్రదించాలి.

భాగవతుల కృష్ణారావు
✆ 7702552305


## ధీర

126 మంది నేటి తెలుగు ధీర వనితల పరిచయాలు, వారి కథలు.. వీటితో సంకలనం తీసుకురావాలనే ఆలోచనే అద్భుతమైనది. ఇటువంటి పుస్తకం ఇప్పటివరకు రాలేదనే కితాబు భువనచంద్ర గారి నుంచే వచ్చింది. ఈ అసామాన్య పుస్తకం వెల రు.400/-.

ప్రతులకు

జ్యోతి వలబోజు (ఫోన్: 8096310140),
అచ్చంగా తెలుగు (ఫోన్ : 8558899478),
నవోదయ బుక్ హౌస్ (ఫోన్: 09000413413)






## నిశ్శబ్ద ఖడ్గం

ప్రముఖ కథా రచయిత, కోనసీమ కథల సృష్టికర్త చాప్ర గారి మరో ఆణిముత్యాల సంపుటి. డిసెంబర్ 2025 లోనే విడుదలైన ఈ పుస్తకం రు. 150/– లకు లభ్యమవుతుంది.

ప్రతులకు

విశాలాంధ్ర బుక్ హౌస్

నవోదయ బుక్ హౌస్

## కలర్‌ఫుల్ కదంబం

ఒక రకంగా వ్యాస విన్యాసాలే.. కానీ కొన్ని చిన్న కథల్లా అల్లుకుపోయారు రచయిత్రి, అల్లూరి (పెన్మెత్స) గౌరీలక్ష్మి. డిసెంబర్ 2025 లో విడుదలైన ఈ పుస్తకం వెల రు.120/–

ప్రతులకు

శ్రీ పి. ఎస్. గోపాలరాజు,
జి–4, సి–బ్లాక్, వర్టెక్స్ ప్రిస్టేన్,
నిజాంపేట రోడ్డు, హైదర్ నగర్,
**హైదరాబాద్ – 500090**
✆ 9948392357






## అద్దాల భరిణ

నండూరి సుందరీ నాగమణి గారి పదిహేను కథలతో వెలువడిన నాలుగో కథల సంపుటి. సెప్టెంబర్ 2025 లో విడుదలైన ఈ కథల సంపుటి వెల రు.150/-.


ప్రతులకు

అచ్చంగా తెలుగు (ఫోన్: 8558866478),
నవోదయ బుక్ హౌస్(ఫోన్: 9000413413)
రచయిత్రి (ఫోన్: 9849989201)

## ఈ ప్రేమలింతే..

శ్రీమతి గరిమెళ్ళ సుబ్బలక్ష్మి గారి మరో కథల సంపుటి. 23 కథలతో జనవరి 2024 లో విడుదల అయిన ఈ సంపుటి వెల రు.180/-.

అన్నీ ప్రముఖ బుక్ షాపుల్లో ఈ ప్రతులు లభ్యమవుతాయి.






# ఎగిలివారంగా సుక్క

చొప్పదండి సుధాకర్

✆ 9177348349



*"అగ్గి ఎవళ్ళు పెడతారు?" గుంపులోంచి ఓ పెద్దాయన మరొకనితో అంటుండు.*

*"ఎవలు ఉన్నారు దానికి? అందుకే ఆలస్యం అవుతుంది!"*

*"వారసులు ఎవళ్ల లేరా?" ఎవరో అడిగారు.*

*"పెళ్లయిన వారం రోజులకే మొగుడు చస్తే... అప్పుడు దాని ఈడు పదేళ్లయినాయే..." నవ్వాడు మరొకడు. ఆ నవ్వులో గీ మాత్రం తెలియదా అన్నట్టు ఎక్కిరింత వినిపించింది.*

మల్లవ్వ పానం ఏమీ బాగాలేదు. ఈయాల రేపో అన్నటుంది. దినం గడిస్తే అదే సాలన్నట్టు మంచంలో పడిపోయి మూలుగుతుంది. ఆమెను ఎవరు దవాఖానకు తీసుకుపోయేటట్టు లేరు. ఎందుకంటే పోయినా బతికేటట్టు లేదు. అదికాక... ఆమెను దగ్గరుండి తీసుకుపోయేటోళ్లు ఎవరూ లేరు. అంతా దూరంనుండి చూసి ముక్కిరిసేటోళ్లే! ఊళ్ళో మల్లవ్వలు, ఎల్లవ్వలు ఇంకా రాజవ్వలు శానామందే ఉన్నారు. కానీ మనం మాట్లాడుకునే మల్లవ్వ వేరు! రేపోమాపో, ప్రాణంపోయే మల్లవ్వ ఆ ఊర్లో సగంకన్నా ఎక్కువమందికే ప్రాణం పోసింది. అదే... మల్లవ్వ అంటే మంత్రసాని! ఆ ఊరికి ఆమె గింత ఎక్కువ తక్కువ 70 ఏళ్ల నుండి కాన్పులు చేస్తుంది. ఆమెకి ఇప్పుడు అటు ఇటు లెక్క తీస్తే 90 ఏండ్లు ఉండొచ్చు. అంటే ఆమెకు బుద్ధి తెలిసినప్పటినుండి గదే పని చేసింది. ఊరును కాపాడింది. గీ నడుమ అందరూ దవాఖాన అంటుండ్రుగని, ఆ ఊర్లో గడిచిన 50 ఏళ్లు మల్లవ్వ తప్ప మరో మంత్రసాని లేనేలేదు. కొసరుకు చుట్టుపక్కల ఇంకో నాలుగు ఊళ్లకు కూడా ఆమె కాన్పులు చేసేది.

గింతమందికి ప్రాణం పోసిన మల్లవ్వకు దేవుడు సంతానం ఇయ్యలేదు. ఇది మరీ ఇమరశ లేని ముచ్చట. దేవుడు మనసులో ఏముందో ఏమో? మల్లవ్వకు పిల్లలు పుడితే ఊరును సక్కగా చూడదనుకున్నాడేమో... అందుకే గట్ల పిల్లలులేని గొడ్రాలు చేసిండు. అయినా గందుకు మల్లవ్వ ఎప్పుడు బాధపడలేదు!

ఊరంతా తన పిల్లలే అనుకొని కాలం ఎల్లదీసింది. మల్లవ్వ వయసులో ఎంత అందంగా ఉందో చెప్పడానికి ఆ చిన్న గదువ సాలు. ఆమె అందాన్ని సక్కదనాన్ని చూసి కొందరు... 'అది ఏ దొరకు పుట్టిందో లేకపోతే గా కులంల గంత సొంపు, సోకు ఎట్లుంటది?' అని ఎక్కిరిచ్చిన, మల్లవ్వ పట్టించుకోలేదు. 'నా రాత ఇంతే' అని నోరు మూసుకుంది.



మల్లవ్వకు పదేళ్లకే పెండ్లి అయింది. అప్పట్ల అదే అసలు పెండ్లి వయసు! ఇంకా గట్టిగా మాట్లాడితే ముదురు వయసు కూడా! ఎందుకంటే... ఆమె కన్నా రెండు మూడేళ్లు చిన్న పోరీలకు అప్పటికే పెండ్లిల్లు అయిపోయినాయి. ఆ సంగతి ఎట్లా ఉన్నా, ఆమె పెళ్లయిన పద్దినాలకే మొగుడు గండి చెర్ల చాపలు పట్టవోయి, తామర పూల ఏర్లు చుట్టుకొని పానమిడిసిండు! వాని పీనుగు వారందాకా చెర్ల తేలలేదంటే.. ఆ కథ ఎసొంటి దుఃఖమో చెప్ప వశంగాదు. గప్పటినుండి మల్లవ్వ ముండమోసే ఉన్నది. మల్ల పెండ్లి లేదు, పెటాకులు లేవు. అత్త బంగారమసొంటి మనిషి. తనకు కొడుకైనా, కోడలైన మల్లవ్వే అని

కడుపులో పెట్టుకొని సాదుకుంది. కొన్నేండ్లకు ఆమె కాలం చేసింది. మల్లవ్వ అత్తనుండి ఆ విద్య ఎట్లనో నేర్సింది. ఆమెను మించిపోయింది. మొత్తానికి ఊరు ఊరంతా మల్లవ్వ అంటే తెల్వని మనిషే లేదు. గది అసలు ముచ్చట!

పొద్దు నడినెత్తి మీదికి వచ్చింది. ఎండ కరకరలాడుతుంది.

అట్లా వచ్చి ఇట్లా చూసేవాళ్లే, గోడల పొంటా... చెట్ల పొంటా ఎండ తలగకుండా నిలబడి ముచ్చట్లు పెట్టేటోళ్లే కానీ అసలు ముచ్చట ముందటికి జరిపేటోళ్లు కనిపిస్త లేరు.

“అగ్గి ఎవళ్ళు పెడతారు?” గుంపులోంచి ఓ పెద్దాయన మరొకనితో అంటుండు.

“ఎవలు ఉన్నారు దానికి? అందుకే ఆలస్యం అవుతుంది!”

“వారసులు ఎవళ్లు లేరా?” ఎవరో అడిగారు.

“పెళ్లయిన వారంరోజులకే మొగుడు చస్తే... అప్పుడు దాని ఈడు పదేళ్లయినాయే...” నవ్వాడు మరొకడు. ఆ నవ్వులో గీ మాత్రం తెలియదా అన్నట్టు ఎక్కిరింత వినిపించింది.

“మరెట్ల?”

“ఎట్లయితే... నీకేంది, నాకేంది! సూసుకుంట ఉండు అంతే” మర్మం చెప్పినట్టు అన్నడు.

“అరే గిది అన్యాలం. ఊరందరికీ జన్మనిచ్చిన తల్లికి సస్తే కొరివి పెట్టే దిక్కేలేదా?”

“మరి నువ్ పెడతవా? దాని గాశారం గట్లుంది ఏం చేస్తావ్!”

“అంటే... చిన్నమ్మ, పెద్దమ్మ, పిల్లలు, పెద్దయ్య, పాలోళ్ళు... ఎవళ్ళూ లేరా?” ఇంకో గొంతు అడిగింది.

“ఏ... నీది ఇచ్చంత్రం కాకపోతే ఏందయ్యా? ముసల్ది 90 ఏళ్లు ఉంది. దాని తోటోళ్లు చుట్టాలల్ల ఒక్కళ్ళు కూడా బతికిలేరు. వాళ్ల పిల్లలు, వాళ్ల పిల్లలు కూడా శానామంది సచ్చిపోయింద్రు. ఇగ మన పిల్లలు మనకే వినరు. మనుమలు, మనుమరాళ్ల సంగతి ఏం చెప్తాం! మల్లవ చుట్టాలు యాడ యాడ ఉన్నారో దానికే తెలవదు. అయినా మరీ నాలుగైదేండ్లనుంచి అది పిచ్చిది అయిపోయింది. ఏం మాట్లాడుతుందో దానికే తెలవదు. ఇగ మనమేం చేస్తం!”

మరో గుంపులో ఇంకో రకం మాటలు నడుస్తున్నాయి.

“మరి... గిన్ని ఏండ్లు వేల కాన్పులు చేసింది గదా... గా పైసలన్నీ ఏం చేసింది?”

“దానికి ఎవడు పైసలిత్తరయ్యా... అంతా ఉత్త పుణ్యానికి పనిచేయించుకున్నరు.”

“ఇది మరీ బాగుంది... ఎంతో కొంత, ఎవరో ఒకరు ఇస్తరు కదా! 50 ఏళ్ల నుంచి చేసిందాయె... పెయినిండా బంగారమైతే ఉండేటివి కదా?”

"మొన్న పిస్స లేచినప్పటినుంచి కనిపిస్తలేవు. ఎవడు పీక్కపోయిండో ఏమో!" ఇంకెవడో పెద్దగా నవ్వి అన్నాడు.

"ఏ... అది కాదు. తీరా... మొన్న నాలుగేళ్ల కింద తనదగ్గర ఉన్నకాడికి ఐదారు లక్షలు... పై మీది బంగారం అంత కలిపి గదేదో గుడికి దానమిచ్చిందట!"

"అర్రే గట్లనా... గందుకే వాళ్లకు కోపం వచ్చి ఏ సుట్టపోడు రాలేదు."

"అయినంత మాత్రాన గా పైసల కోసం ఇంత అన్యాయమా?"

"ఔ మల్ల! పైసతోనే ప్రపంచం.. పైసల్లేకుంటే పీనుక్కూడా కాలదు!"

"అంతే... అంతే..." చుట్టుపక్కలోళ్లు వంత పాడారు.

సమయం గడిచిపోతుంది. సూర్యుడు ఇదంతా గమనిస్తూ పడమటి వైపు జారిపోతున్నాడు. చాలా సేపు అక్కడ ఏ విశేషం జరగలేదు

"ఏం జరుగుతోంది ఇక్కడ?" ఆ ఊళ్లో ఎన్నడూ చూడని మనిషి ఒక్కడు అక్కడికి వచ్చి ప్రశ్నించాడు.

"ఎవరు నువ్వు?" అందరూ ఆ మనిషి వంక కొత్తగా చూస్తుండిపోయారు.

"ఊరికి కొత్తగా వచ్చిన గ్రామపంచాయతీ కార్యదర్శి" అంటూ గ్రామసేవకుడు రాజమల్లు అందరికీ పరిచయం చేసాడు.

"ఏం పేరు?" కాస్త చదువుకున్నట్టు ఉన్న ఒకడు అడిగాడు.

"నా పేరు సత్తిబాబు. నాన్ లోకల్ కోటా కింద ఖమ్మంనుంచి కొత్తగా ఇవ్వాళే, ఈ ఊర్లో ఉద్యోగంలో జాయిన్ అయ్యాను." రెండు ముక్కల్లో తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"గట్లనా... సర్లే. అయినా నీకు ఇక్కడేం పని?" ఇందాకటి మనిషే మల్లి అడిగాడు.

"అదేంమాట? గ్రామంలో ఏం జరిగినా నాకు తెలియాలి. రికార్డుచేసి నేను పైకి పంపాలి కదా! నా డ్యూటీయే అది కదా!"

"అంతే... కదా!" రాజమల్లు అన్నాడు.

ఐదు నిమిషాల్లో... మల్లవ్వ సావు, ఆ తర్వాతి కథంతా సత్తిబాబుకు అర్థమయిపోయింది.

అతడి మనసు ఏదోలా అయిపోయింది.

"మరి పీనుగు ఎత్తకుండా ఏమిటి ఆలస్యం?"

మళ్లీ వాళ్ళు చెప్పిందంతా విని, నిట్టూర్చాడు.

"డబ్బులు లేవా?"

"డబ్బులు మేమే పోగుచేసాము కానీ... అగ్గి పెట్టేవాళ్లే లేరు!"

"అది అసలు ప్రాబ్లమ్." ఇంకెవరో అన్నారు.

అక్కడ చాలాసేపు నిశ్శబ్దం.

"ఇదేమైనా సామాన్యమైన విషయమా? పిల్లకాకి ఏదో అనుకున్నాడు!" గుంపులోంచి ఒక పిరికిగొంతు కిసుక్కుమంది. తోడుగా అందరూ నవ్వారు.

అయినా సత్తిబాబు ఏమీ జవాబు ఇవ్వలేదు.

"నేను పెట్టొచ్చా అగ్గి?" సత్తిబాబు గొంతు ఖంగుమంది.

"ఆ... నువ్వెవరు?"

"నేనెవర్ని అనేది తరువాత విషయం. అసలు మీరెవరు, మనుషులేనా? రెండురోజులుగా ఆ శవాన్ని అలా వదిలేసి వినోదం చూస్తున్నారా?" కోపంగా అన్నాడు సత్తిబాబు.

"ఏర్పాట్లన్నీ చేయండి, నేను అగ్గిపెడతాను. అంతేకాదు, కేశఖండనం కూడా చేయించుకుంటాను. కొడుకు లాగానో... మనవడి లాగానో... అన్ని నియమాలూ పాటిస్తాను!" స్థిరంగా అన్నాడు సత్తిబాబు.

ఎవరిదగ్గరా జవాబు లేదు!

"మరీ... ఇవాళ్లే ఉద్యోగంలో చేరి, ఇప్పుడే సావు కార్యక్రమంలో పాల్గొంటావా? కొంచెం శకునం అదీ చూసుకో అబ్బాయి!" పెద్ద తలకాయ ఒకటి సలహా ఇచ్చింది.

"ఏ శకునమూ లేదు, నా డ్యూటీ గ్రామప్రజల బాగోగులు చూడడం! నాకు ఎవరూ ఏమీ చెప్పాల్సిన అవసరం లేదు."

ఇక ఎవరు నోరిప్పే ధైర్యం చేయలేదు.

గంటలో మల్లవ్వ భౌతికకాయం పంచభూతాల్లో కలిసిపోయింది.

ఊరంతా సిగ్గుతో తలదించుకోగా, సత్తిబాబు తన రిపోర్టులో మల్లవ్వ దహనసంస్కారాల గురించి రాసి, మనవడిగా తన పేరు నమోదు చేసుకున్నాడు.



# పులిన్యాయం!

**వెంకటమణి**

✆ 94922 44586

కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ద్వితీయ బహుమతి పొందిన కథ
శ్రీ విశ్వావసు నామ సంవత్సర సంక్రాంతి - 2026

*చిట్టెమ్మకు విషయం అర్థమైపోయింది. గతుక్కుమనిపోయింది! ఏదో తోడేళ్ళ దగ్గర తప్పించుకున్నాది అనుకుంటే... పులి నోటికి చిక్కిపోయింది. పోయే ముందు గింజుకున్నట్టు ప్రాణం గింజుకుంది.*

*"అది కాదు బావూ... అమ్మాయీ..." అనుకుంటా అడ్డు తగలబోయింది.*

*"ఏం, చెప్తే నీక్కాదా? ఈరోజుకి ఇక్కడుంటే దానికే మంచిది!" అని కన్నెర్రజేశాడు ఎర్రిబాబు.*

బయటికి చెప్పుకుతిరిగే సంగతి కాదు ఇది!

పెద్దోళ్ళ ప్రపంచంలో, నాదారోడు బతకాలంటే పెద్దపులి దయ కావాల్సిందే. ఆరోజున మరోదారి లేక నాటకాల చిట్టెమ్మ దానిగుహలోకి వెళ్ళి శరణు కోరింది. దాని న్యాయం అది చెప్పింది! అదీ నాడిమైన న్యాయం కాదు, కానీ ఏం చేస్తుంది? ఆ న్యాయానికి తలొగ్గింది. నలుగురిలో పడితే బతుకు కుక్కలుచింపిన విస్తరి అయిపోద్ది. మొత్తంగా కన్ను పోగొట్టుకోవడం కన్నా, మెల్ల చేసుకోవడం నయం కదా! అలాగని చెప్పే, ఆ రోజున ఆమె తన కూతురు విషయంలో అలా చేయవలసి వచ్చింది.

చిట్టెమ్మది అనకాపల్లి జిల్లాలోని వెంకటాపురం. అదో చిన్న పల్లెటూరు. ఆ పక్కూరే మునగపాక. అది మండల కేంద్రం. అమ్మోరు జాతరకి అక్కడ 'మనిషికో నీతి' అన్న వీధినాటకం పెట్టారు. నాటకం పెట్టారనగానే చిట్టెమ్మ సంబరపడిపోయింది. ఇప్పుడు నాటకాలు పెద్దగా ఎక్కడ వేస్తున్నారు! వేస్తే మట్టుకు చూసేవాళ్ళేరి? కొద్దో గొప్పో చూస్తే మట్టుకు వాళ్ళకోసం పెట్టుబడి పెట్టి నాటకాలు ఆడించే వాళ్ళెవరు? ఏదో నాటకం మీద మక్కువ కొద్దీ, ఎవరైనా పెడితే పెట్టాలి. ఆ పనికి... ఆ ఊరి బట్టల వ్యాపారి సన్యాసిపాత్రుడు పూనుకున్నాడు. పని మానుకుని, నలుగురి దగ్గరకీ తిరిగి చందాలు పోగేసి, ఆ పుణ్యం కట్టుకున్నాడు. హీరోయిన్ వేషం కట్టమని చిట్టెమ్మ కూతురు కన్యాకుమారినే అడిగాడు. చిట్టెమ్మ మొదట కుదరదంది.

"నా కూతురు నాటకాలు, గీటకాలు ఆడదు!'' అని అతని ముఖం మీదే తెగేసి చెప్పేసింది.

"మరి కిందటేడాది కశింకోట నాటకాల పోటీల్లో వేషం కట్టింది కదా... ఊరికినే ఎయ్యొద్దులే... డబ్బిస్తాను!" అని బలవంతపెట్టాడు.

చిట్టెమ్మ లొంగింది. ఆమె చెయ్యందుకుని రెండువేలు అడ్వాన్సు కింద చేతిలో కుక్కేశాడు. చేతిలో పడిన డబ్బును చూసుకుని ఒప్పుకుందామె.




నిజానికి కన్యాకుమారి చేత నాటకాలు ఆడించాలన్న ఉద్దేశం తనకు లేదు. కానీ తనరోజులు బాగులేవు. తండ్రొకటి లేదు, సోములే బతికుంటే ఆ పిల్లకి ఇన్నిపాట్లు వుండేవి కావేమో? ఏనాడో కాలం చేసాడతడు. తల్లీ, తండ్రీ తనే అయ్యి పెంచింది చిట్టెమ్మ. తన కూతురికి తనలాంటి బతుకు వద్దని చెప్పి, పదో తరగతి దాకా చదివించింది. ఆ మాత్రం చదువుకి అవకాశాలేం వచ్చి పడిపోతాయి? మేనరికం ఉంటే, అన్న కొడుక్కి ఇచ్చి పెళ్ళిచేసి పంపించేసింది. ఆ సచ్చినోడు తాగితాగి శరీరం కుళ్ళబెట్టుకుని చచ్చాడు. పిల్ల రోడ్డున పడిపోయింది. ఇంకేం చెయ్యడం? కన్యాకుమారిని తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుంది. తిని ఊరకనే కూర్చుంటే రోజులెలా వెళ్తాయి? తనతో కూలిపన్లకీ, నాలిపన్లకీ తీసుకుపోతోంది. మంచి ప్రోగ్రాములుంటే ఎప్పుడైనా పోతోంది.

జాతర రోజున తల్లీకూతుళ్ళు తెల్లారుగట్లే మునగపాక వెళ్ళిపోయారు. అక్కడ వాళ్ళకి ఏర్పాట్లయ్యా ఘనంగానే చేశారు. సాయంత్రం దాకా రిహార్సల్సు సాగాయి. రాత్రి తొమ్మిదింటికి తెర లేచింది. చిట్టెమ్మ స్టేజీ ముందరే కూర్చుంది. కన్యాకుమారిది కోడలు పాత్ర! అత్తగారి వేషం సావిత్రమ్మ కట్టింది. ఆవిడది ఎస్. కోట. దాసరోళ్ళ ఆడపడుచు. చిట్టెమ్మమీద చిన్నదే. తాను నాటకాలెయ్యడం మానేసింది గానీ, ఆవిడ ఇంకా మానలేదు.

పూలపూల నైలాను పోలిస్టరు చీర కట్టుకుని, పోనీటైలు జడేసుకుని, హైహీల్సు చెప్పులు తొడుక్కొని.. కన్యాకుమారి వయ్యారంగా స్టేజీ మీదకి నడిచొచ్చేసరికి కుర్రకారు ఒకటే గోల! నాటకం మొదలైంది. సీనియర్ నటి సావిత్రమ్మకి

పోటాపోటీగా కన్యాకుమారి కూడా నప్పిస్తున్నాది. డైలాగులు పటాసుల్లా పేల్తున్నాయి. జనాలు గుడ్లప్పగించి చూస్తున్నారు. స్టేజీకి ఓ మూల కూర్చున్న తవుడుగాడు, తబలా ఒకటే వాయించేస్తున్నాడు. హార్మోనియం మోగిన కాడికి మోగుతోంది. అవి పెద్దగా వాడుకలో లేని పరికరాలు మరి! మ్యూజిక్కు వాయించే కీబోర్డు ప్లేయర్ పాడైపోతే, వడ్డాదిలో ఎత్తిపెట్టేసిన ఒక నాటక పరిషత్తు దగ్గర నుంచి ఆ తబలా, హార్మోనియం పెట్టి అడిగి పట్టుకొచ్చారంట. డ్రెస్సులు, నాటకాల సామగ్రి కిరాయికిచ్చేవాళ్ళు ఇప్పుడెక్కడున్నారు మరి? నాటకాలు ముమ్మరంగా సాగినరోజుల్లో విజయవాడనుంచి కూడా కిరాయికి తెచ్చేవాళ్ళు. ఆరోజులు పోయాయి. మొత్తానికి ఆ పాతడొక్కు వాయిద్య పరికరాలతోనే మహ గమ్మత్తుగా సాగుతోంది నాటకం.

ఓ రంగం అయింది. లైట్లు ఆర్పారు. జనాల గోల... అప్పటికి రాత్రి పదిగంటలు కావస్తోంది. తిరిగి లైట్లు వేసేసరికి, స్టేజీ మీద డ్యాన్సు వెయ్యడానికి హీరో అర్జున్, హీరోయిన్ కన్యాకుమారి రెడీగున్నారు. 'దంచవే మేనత్తా కూతురా' సినిమా సాంగు వేశారు. మొదట్లో స్టెప్పులు పద్ధతిగానే వేసింది. మధ్యలో కళ్ళు పెద్దవి చేసి కన్యాకుమారికేవో సైగలు చేశాడు సన్యాసిపాత్రుడు. ఆమె పైట తొలగిస్తూ, లంగా పైకి ఎత్తుతూ స్టెప్పులు వెయ్యడం మొదలెట్టింది. అంతే! కుర్రకారుకి కిర్రెక్కిపోయింది. స్టేజీ ఎక్కేసి హీరోని కిందికి తోసేసి, కన్యాకుమారిని పట్టుకుని తెగ దాటించేశారు. ''ఇదేం సొద...'' అనుకుంది చిట్టెమ్మ. సాంగు అయిపోయాక, ఓ గ్రంథసాంగుడు స్టేజీ ముందరకొచ్చి 'వన్సుమోరంటూ' ఓ ఐదొందల నోటుని కన్యాకుమారికి ఇవ్వజూపాడు. కన్యాకుమారి చెయ్యి చాపి ఆ పచ్చ కాగితం అందుకుంటాది అనగా... పోలీసోళ్ళు ఎక్కడ్నుంచి వచ్చారో వచ్చేసారు. అంతే! జనాలు, హీరోతో సహా నాటకం ట్రూపోళ్ళు తలో దిక్కుకు పారిపోయారు. దిక్కుతోచక కన్యాకుమారి ఒక్కతే స్టేజీమీద నిల్చుండిపోయింది. పోలీసులు ఆమెనూ, నాటకం పెట్టిన సన్యాసిపాత్రుడిని, అతని సావాసగాళ్ళనూ జీపు ఎక్కించుకుని తీసుకుపోయారు.

''అమ్మనా కూతురో...'' అని గుండెలు బాదుకుంటా జీపు వెనకాల పరిగెత్తుకుని స్టేషన్‌కు వెళ్ళింది చిట్టెమ్మ.

లోన ఒకమూల చెక్కబల్లమీద కన్యాకుమారి డీలాపడి కూర్చునుంది. ఎస్.ఐ. రమణారావు చిందులు తొక్కుతున్నాడు.

''ఏట్రా మీరు చేస్తన్న పని? ఆ నాటకవేటి, ఆ డ్యాన్సులేట్రా? ఒరే... టూ నాట్ టూ, ఆ రైటర్‌కి చెప్పి ఈళ్ళ మీద కేసు కట్టమను.'' అని ఆదేశించాడు.

అయితే అప్పటికింకా కేసు కట్టలేదని చెప్పి ఊపిరి పీల్చుకుంది చిట్టెమ్మ.

''మీరు దేనికని పర్మిషన్ తీసుకున్నార్రా? సాంఘిక నాటకమని చెప్పారు. మరి మధ్యలో ఆ రికార్డింగు డ్యాన్సులేంటీ!'' అని లాఠీ చేతబుచ్చుకున్నాడు.

చిట్టెమ్మ కాలుగాలిన పిల్లిలా ఎస్.ఐ. ముందుకు వెళ్ళి, "నన్నందరూ నాటకాల చిట్టెమ్మ అంటారు బావు!" అని పరిచయం చేసుకుని, తను వచ్చిన కారణం చెప్పబోతుంటే, ఎస్.ఐ. కింద నుంచి మీద్దాకా ఆమెని చూసి "నువ్వేంటిక్కడ?" అనడిగాడు.

"హీరోయిన్ వేషం కట్టిన కన్యాకుమారి నా కూతురే బావూ!" అని సన్నని గొంతుతో చెప్పిందామె.

"అయితే ఇదంతా, నీ ట్రెయినింగేనన్నమాట!" కొరకొరా చూశాడు ఎస్.ఐ.

“ట్రయినింగేటి బావూ!” అని చేతులు పిసుక్కుంటా “మావెెప్పుడూ ఈ రికార్డింగు డ్యాన్సులయ్యా ఎయ్యలేదు బావూ! ఒకప్పుడు నాటకాలే ఊపిరిగా బతికినోళ్లం! మా తాతలకాడినుంచీ నాటకాలు ఏసుకొస్తన్నాం. ఎన్నెన్ని గొప్పనాటకాలు ఆడేరో మావోళ్ళు... కురుచ్చేత్రం, శీకృష్ణ రాయబేరం, సత్తె హరిశ్చంద్రలాంటి ఎన్నో నాటకాల్లో నానూ నటించినాను బావూ! చిందు ఏసీదాన్ని, కోలాటం ఆడీదాన్ని బావూ నేను... అంతేగానీ రికార్డింగు డ్యాన్సులయ్యా ఎయ్యలేదు! ఈమధ్యన మరి ఇసుమంటి డ్యాన్సులయ్యా పెడతన్నారు. టీవీ, సినేమాలొచ్చీసి నాటకం దిగజారిపోనాది బావూ. కళలకి ఆదరువు నేదు. నాటకాల్లేక మాలాంటోళ్ళకి పనిలేదు మరి. ఏదో నాలుగు రూపాయిలొస్తాయని పిల్ల అలా డ్యాన్సు కట్టింది గానీ...” అని ఆమె చెప్పుకుపోతుంటే ఇక చాలించమని ఎస్.ఐ చెయ్యెత్తి, “నీ చరిత్ర ఘనంగానే వుంది. మరి నీ కూతురు ఏసిన వేషమేంటి, గుడ్డలిప్పి ఆ గంతులేంటి!” అనడిగాడు. “నాకూ తెల్దు బావూ! ఏదో నాటకమేత్తంది అనుకున్నాను గానీ, ఇలాగ ఒంటిమీద గుడ్డ యిడిసి గెంతుతాది అని నానూ అనుకోనేదు. తప్పయిపోనాది బావూ... దయతలిచి ఈపాలికి ఒదిలెయ్యండి!” అని వేడుకుంది.

“ఏటి తప్పయిపోయింది?” అని హుంకరించుకుంటా లేచి, కన్యాకుమారి దగ్గరికి వెళ్ళి, ఆమె జబ్బ పట్టుకుని లేపి, “ఏంటే, పైట తీసి, లంగా ఎత్తి... ఆ డ్యాన్సులేంటి?'' సమాధానం చెప్పమన్నట్టు మనిషిని కుదిపాడు.

కన్యాకుమారి బిక్కచచ్చిపోయింది.

ఆమె జబ్బ నొక్కుతా, “నీ కూతురికి కొవ్వు ఎక్కువైపోయిందే... అందుకే ఇలా తైతక్కలాడుతోంది. కొంచెం కొవ్వుకరిగిస్తే మనిషి దారిలో పడతాది. అంత ఈజీగా వొదిలీడానికి, ఇదేవన్న మామూలు కేసనుకున్నావా? అశ్లీలం కేసు! లైంగిక ప్రేరేపితచర్యకు పాల్పడ్డారు. అశ్లీలనృత్యాలు నిషేధం. తెలుసునా, ఇలాంటి డ్యాన్సులు చూసే కుర్రకారు చెడిపోతున్నది.” అనన్నాడు.

ఎస్.ఐ. మాట్లాడిన మాటల్లో సగానికి సగం మాటలు అర్థం కాలేదు చిట్టెమ్మకు.

ఇంతలో కన్యాకుమారి, ఉన్న విషయం చెప్పెయ్యడం మంచిదని చెప్పి, ‘‘సన్నాసిపాత్రుడే నాచేత ఆ డ్యాన్సులేయించడానికి ఒప్పించాడు. డబ్బు ఆశ చూపించాడు. ఏదో కక్కుర్తి పడి ఏసాను” అని ఏడుపు గొంతు పెట్టి చెప్పింది.

“ఆడెవుడో సన్నాసోడు వెయ్యమన్నాడని నువ్వు వేసేత్తావా?” అని చెయ్యెత్తి కొట్టబోయాడు ఎస్.ఐ.

ఆడపిల్లని చెప్పి వదిలేసాడో... మరెందుచేత వదిలేసాడో... కొట్టకుండా వదిలేసి, విసురుగా అవతలికి తోసేశాడు. కన్యాకుమారి వెళ్ళి మూలన పడిపోయింది. నుదురుకి గోడ తగిలిందో ఏమో, తల పట్టుకుని కూర్చుండిపోయింది.

చిట్టెమ్మకు మనసు చివుక్కుమనిపోయింది. చెడ్డ కోపమొచ్చేసింది. కానీ ఏమిచెయ్యగలదు? పోలీసోళ్ళతో వ్యవహారం! అయినా ఓర్పు పట్టలేక, “బావూ! కుసింత పైట తీసినందుకే ఇంత గొడవ సేసేస్తన్నారు గందా... మరి ఆ సినేమా హీరోయిన్లు ఒంటిమీద జాకెట్టు గుడ్డయినా వుంచడంనేదు. ఏసుకున్న పీలికల్లాంటి గుడ్డముక్కల్ని కూడా సిగ్గూశరం లేకండా విప్పి, అవతలకి పడేస్తన్నారు. మావు ముడుకులపైకి లంగా ఎత్తితే తప్పొచ్చేస్తంది తమరికి. ఆళ్ళు చెడ్డీలతో దాటినా తప్పు కాకుంటంది!” అని అడిగేసింది.

ఎస్.ఐ. కి కోపమొచ్చేసింది. "ఛప్... నోర్ముయ్. సినిమావోళ్ళకీ మీకూ సాటా!" అని ఎగిరాడు.

చిట్టెమ్మ కాస్త తగ్గి, "అదికాదు బావూ! మాది మాత్రమే ఒళ్లా? ఆళ్ళది కాదా? ఆళ్ళ మానాలకి మర్యాదలు అవుసరం నేదా? రాజు సేస్తే శృంగారవూనూ... సాకల్ది చేస్తే వ్యభిచారవూనా? ఇదేం న్యాయం బావూ? ఏం, సట్టం మాకే గానీ ఆళ్ళకి వర్తించదా బావూ? నేనిలగంతన్నానని కోపగించుకోకు బావూ! నువ్వే నాయం సెప్పు!" అనడిగింది.

"ఏంటి ఎకసెక్కాలుగా వుందా! నాకే నీతులు చెబుతున్నావ్! పో బయిటికి..." అని రంకెలేస్సాడు ఎస్.ఐ.

బయటికి పోయిందామె. పోయి అక్కడ ఓ చెట్టు కింద చతికిలబడింది. అప్పుడు ఓ కానిస్టేబులు సిగరెట్టు కాల్చుకోడానికి బయటకొచ్చాడు. చిట్టెమ్మను చూసి పక్కకి పిలిచి, "ఇదిగో, ఎందుకు సెప్తున్నానో ఇనుకో... కేసయితే బోల్డు బాధ. స్టేషనంట కోర్టులంట తిరగలేక సావాలి. నువ్వు పడలేవు. ఆళ్ళ చేతుల్లో, ఈళ్ళ చేతుల్లో పిల్ల నలిగిపోద్ది! పిల్ల చూస్తే వాటంగా వుంది. నా మాటిని ఓ పదివేలు ఇచ్చి సెటిల్‌మెంటు చేసీసుకో!" అని చెప్పాడు.

పదివేలనేసరికి "అమ్మబాబోరు!" అని గుండెల మీద చేతులేసుకుని "బావూ! అంత డబ్బు నాను ఎక్కడ్నుంచి తేను! ఏదో వెయ్యో పయ్యో అంటే ఇచ్చుకోగలనుగానీ..." అని అన్నది.

సిగరెట్టు ఎగబీల్చి, "ఎంత లేదన్నా... ఓ ఐదారు వేలన్నా వుంటే గాని పనికాదు!" అని చిట్టెమ్మ ముఖం మీదికి గుప్పున పొగ వదిలాడు ఆ కానిస్టేబుల్.

చిట్టెమ్మకా ఆ పొగ పడదు. చేత్తో పొగను విసిరికొట్టి, "కాస్త దయసూపండి బావూ!" అని బతిమాలుకుంది. "మరి దయసూపడానికే కదంటే ఇదంతా చెప్పేది. నాకేం పన్లేక చెప్తున్నానా!" అన్చెప్పి లోపలకి పోయాడు అతగాడు.

పిల్లని వదిలేలా లేరు. ఇక ఏంచెయ్యాలో బోధపడలేదు చిట్టెమ్మకు. ఎఱ్ఱిబాబు తలపుకొచ్చాడు. రాజకీయంగా పలుకుబడి గల మనిషి. ఏదో పదవి కూడా వెలగబెడుతున్నాడు ఆయనగారు. ఆ క్షణంలో ఆ మనిషి తన కూతుర్ని, ఆ కేసునుండి బయటపడేయగలడు. పరుగుపరుగున అతని ఇంటికి పోయింది. ఎఱ్ఱిబాబుని కలవనిచ్చారు కాదు అతగాని అనుచరులు. నెత్తి కొట్టుకుంటూ ఏడుపందుకుంది చిట్టెమ్మ. ఆ ఏడుపు ఎఱ్ఱిబాబు చెవిన పడిందో ఏమో, "ఎవరది..." అనడిగాడు. అనుచరుడొచ్చి ఆమెను లోపలికి పిలుచుకెళ్లాడు.

ఆ సమయంలో ఎఱ్ఱిబాబు మందుమీదున్నాడు. గ్లాసును ఎదరబల్లమీద పెట్టి "ఏటి చిట్టెమ్మా! యేళాపాళా లేకుండా సోకాలు తీస్తన్నావు!" అనడిగాడు.

"రికార్డింగు డ్యాన్సేసిందని, నా కూతుర్ని పోలీసోళ్ళు పట్టుకుపోనారు బావూ!" అని ఏడ్చుకుంటా చెప్పింది.

"ఏటి! డ్యాన్సేత్తేనే పట్టుకుపోయారా..." ఎకసెక్కంగా అడిగాడు ఎఱ్ఱిబాబు.

"అంటే, ఏదో కొద్దిగా పైట జారొదిలి, స్టెప్పులేసినాది బావూ..." దాచకుండా ఉన్న విషయం చెప్పేసింది.

"ఏటి! పైట జారొదిలినందుకే పోలీసోళ్ళకి తాపాలొచ్చీసినాయా?" అని నవ్వాడు ఆయన.

"బావూ! ఓ పదివేలిస్తేగానీ పిల్లని వొగ్గనంతన్నారు బావూ ఆళ్ళు! నానెక్కడ్నుంచి తెచ్చేది పదేలు! పొట్టకూటి కోసం చిన్నాచితకా పనులుచేసుకు బతికీదాన్ని. కళాకారులకిచ్చీ పింఛనైనా నాకు రాడంనేదు. ఏదో బుద్ధి గడ్డితిని, నా కూతురు ఈ ఏసం కట్టింది. తవరు కాస్త దయసూపించాలి బావూ!" అని ప్రాధేయపడిందామె.

"లోకంలో బొత్తిగా న్యాయం లేకండా పోతందిరా!" అని ఓ మనిషిని పిలిచాడు. పిలిచి "నేను పంపానని ఎస్.ఐ కి చెప్పి ఆ పిల్లను తీసుకొచ్చెయ్!" అని అతగాడిని స్టేషన్‌కి పంపాడు.

చిట్టెమ్మ బయటకెళ్ళి ఓ మూలగట్టుపై కూర్చుంది. అరగంటకల్లా కన్యాకుమారిని తీసుకొచ్చేసాడు ఆ మనిషి. కళ్ళల్లో కూతురు పడేసరికి చిట్టెమ్మ కళ్ళంతలేసి అయిపోయాయి. పోతురాజు బాబుకి దణ్ణం పెట్టుకుంది. కాసేపటికి లోనికి పిలిచారు. వెళ్ళింది. ఎర్రిబాబు ఏవేవో కుశలప్రశ్నలేశాడు. చెప్పింది చిట్టెమ్మ. ఆనక ధీమాగా లేచి, కన్యాకుమరి దగ్గరకు వచ్చి, "పేరుకి తగ్గట్టే వున్నాది నీ కూతురు!" అని ఆమె చెయ్యి పట్టుకున్నాడు. మాంచి వయసుమీదున్న పెద్దపులిలాంటి మనిషేమో కన్యాకుమారి జడిసిపోయింది.

మందువల్ల ఎక్కిందో, మరెందువల్ల ఎక్కిందో మత్తెక్కిన కళ్ళతో కన్యాకుమారి వంక కన్నార్పకుండా చూస్తూ "అప్పుడప్పుడు ఇంటికి పంపిస్తుండు. అమ్మగారికి పనిలో కాస్త సాయపడతాది!" అనన్నాడు.

"అలగే పంపిత్తాను బావూ! మరి ఎళ్లొత్తాం!" అని చెప్పి, సాయం చేసినందుకు ఆయనగారికి రెండు చేతులా దండం పెట్టి "రాయే, పోదాం..." అని తన కూతురిని పిలిచింది చిట్టెమ్మ.

"వస్తాను సారూ!" అనిచెప్పి కన్యాకుమారి అతని చేతిని సుతిమెత్తగా విడిపించుకోబోయింది.

పంజాలాంటి చెయ్యి! ఏంటి విడిపించుకుంటాది! అతగాడు మత్తుగా నవ్వుతూ "తెల్లారేక వస్తాదిలే, కుమారి భయపడినట్టుగున్నాది. కాస్త ధైర్నం చెప్పి పంపిస్తాను. నువ్వెళ్ళిరా!" అని అన్నాడు.

ఆ మాటతో వదలమన్నట్లుగా కన్యాకుమారి, వేటగాని చేతిలో గువ్వలా పెనుగులాడింది. మరింత పట్టు బిగించాడతడు.

చిట్టెమ్మకు విషయం అర్థమైపోయింది. గతుక్కుమని పోయింది! ఏదో తోడేళ్ళ దగ్గర తప్పించుకున్నాది అనుకుంటే... పులి నోటికి చిక్కిపోయింది. పోయేముందు గింజుకున్నట్టు ప్రాణం గింజుకుంది.

"అది కాదు బావూ! అమ్మాయీ..." అనుకుంటా అడ్డు తగలబోయింది.

"ఏం, చెప్తే నీక్కాదా? ఈరోజుకి ఇక్కడుంటే దానికే మంచిది!" అని కన్నెర్రజేశాడు ఎర్రిబాబు.

ఓ అనుచరుడు ఆమెను పక్కకి తీసుకెళ్ళి "ఏటి కొత్తగా లేని భయాలు నటిస్తన్నావు. ఎర్రిబాబు సంగతి తెలుసుకదా. ఎళ్ళు, అనవసరంగా గొడవచేసి, విషయం వీధిలో ఎట్టుకోకు!" అని చెప్పి బయటికి పొమ్మన్నాడు.

ఎర్రిబాబు మంచోడు కాదని తనకూ తెలుసును. కానీ ఆ క్షణంలో అతగాడిని ఆశ్రయించక తప్పలేదు. ఇప్పుడా మారాజుతో గొడవ తను పడగలుగుతుందా? గొడవ పెట్టుకుని ఊర్లో బతకగ్గలుగుతుందా? తన జాతి మనుషుల మానాలకి, ప్రాణాలకి పూచికపుల్ల విలువ ఇవ్వని సమాజాన్ని చీదరించుకుంటూ కళ్ళతోనే అమ్మాయికి జాగ్రత్త చెప్పి, చీకట్లోకి నడిచిందామె.

చీకటి తనకు కొత్తేం కాదు!



# ఋషి


సింహప్రసాద్

✆ 9849061668





***"చాలు చాల్లే పెద్ద చెప్పొచ్చావ్! సాగు చేయటం వృత్తి అని నీకు ఎవరు చెప్పార్రా. అది వృత్తి కాదు, మా జీవన విధానం. ఉద్యోగ వ్యాపారాల్లా ఇది బతుకు తెరువు కాదు, ఇదే మా బతుకు! భూమిని విడిచిన మొక్కలు బతకలేవని తెలుసుకోండి. కాలు సాగుతున్నంత కాలం, కాడి మీద చేయి బిగుస్తున్నంత కాలం ఇదిలా కొనసాగాల్సిందే!***

"రామూ, రేపు రిటైర్ అవుతున్నాను. మా ఆఫీసులో ఫంక్షన్ చేస్తున్నారు. నీకు తెలుసుగా. మా పిల్లలెవరూ దగ్గర్లో లేరు. కనీసం నువ్వైనా వస్తే సంతోషంగా ఉంటుంది!"

"అప్పుడే మీకు అరవై ఏళ్ళు వచ్చేసాయా అంకుల్?"

"అరవై కాదు, అరవై ఒకటి. వస్తావుగా! పొద్దుటే ఇంటికొచ్చెయ్. మా ఆఫీసర్ క్యాంపు కెళ్తున్నారు. అందుకని పదిన్నరకే ప్రోగ్రాం పెట్టేసారు!"

"మిమ్మల్ని కారులో స్వయంగా నేనే తీసుకెళ్తాను అంకుల్"

మర్నాడు తొమ్మిదింటికే వెళ్ళిపోయాను.

"ఆఖ్రరోజు కదా! నడిచొచ్చిన దార్లు గుర్తు చేసుకుంటూ ఆఫీసుకి నడిచి వెళదామనుకున్నాను. కాని ఎనిమిది కిలోమీటర్లు అంటే నా తరం కాదనిపించింది. హాయిగా రెస్ట్ తీసుకోవాల్సిన వయస్సులో, కుర్ర సాహసాలు వద్దన్నారు పిల్లలు!" సంతోషంగా, గమ్మత్తుగా నవ్వారు.

"ఎందుకలా?"

"నేను ఉద్యోగంలో చేరేందుకు నడిచే వెళ్ళానులే!"

"అప్పుడంటే నిరుద్యోగి. ఇప్పుడు సూపరిండెంటుగా రిటైర్ అవుతున్నారు. దర్జాగా కారులో వెళ్ళాలి అంకుల్! చంద్రం, సూర్యం ఇద్దరిలో ఒక్కరూ రాలేదా!" ఇంటిలోకి చూస్తూ అడిగాను.

“లిక్కూ లిక్కూమంటూ ఈయన చేసిన ఉద్యోగానికి, వేలు ఖర్చుపెట్టుకుని పిల్లలెందుకు వస్తారు! పోనీ ఏ హోటల్లోనో, ఫంక్షన్ హాల్లోనో చేస్తున్నారా అంటే.... అదీ లేదు!” నిరసనగా అంది ఆంటీ.

నొచ్చుకున్నారు అంకుల్. “అలా తీసిపారేస్తావేంటే? ఆ సంపాదనతోనే సంసారం నడుపుకొచ్చాను, పిల్లల్ని చదివించాను!”

“లోకంలో ఎవరూ చేయనిది మీరొక్కరే చేశారు మరి! లోకాన్ని ఉద్ధరించినట్లు మాట్లాడకండి, నా ఒళ్ళు మండుద్ది!”

పరిస్థితి ముదురుతోందనిపించి లేచాను.



ఆంటీనీ, అంకుల్నీ ఎక్కించుకుని అయన ఆఫీసుకెళ్ళాను.

పదకొండు గంటలకు ఫంక్షన్ మొదలైంది. అంకుల్ని పొగడ్తలతో ముంచెత్తారంతా! ‘ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తారనీ, సిన్సియర్ అనీ, చక్కని గైడెన్స్ ఇస్తారనీ’ చెప్పారు. అనంతరం అంకుల్‌నీ, ఆంటీనీ పెద్ద పూలదండతో సత్కరించారు.

అంకుల్ ‘పూర్వ, ప్రస్తుత అధికారులు తన మీద చూపించిన ఆదరాభిమానాల్ని’ తలచుకున్నారు. “రేపట్నుంచి ఈ ఆఫీసులో నాకు కుర్చీ ఉండదనే ఊహే భరించలేకపోతున్నాను!” అంటూ ఎమోషనల్ అయ్యారు.

“మీరెప్పుడైనా రావొచ్చు. అందర్నీ కలిసి కాస్సేపు స్పెండ్ చేయొచ్చు!” అన్నాడు అధికారి.

“తప్పకుండా వస్తుంటాను సార్. కాని అప్పుడు ఆఫీసుకొచ్చే జనంలో ఒకడినే అవుతాను!” మళ్ళీ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు.

సరిగ్గా అప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. ఆయనా ఉద్యోగం చేసి ఉంటే అంకుల్‌తోబాటు రిటైరయ్యేవారు!

తిరిగెళ్తూ, “మా నాన్నా, మీరూ సమవయస్కులే కదా అంకుల్?” అడిగాను.

“సంవత్సరం ఒకటే, నెలలు తేడా! నాకన్నా మీ నాన్న అయిదు నెలల పది రోజులు పెద్ద!”

“ఆ పల్లెలో మట్టి పిసుక్కుంటూ ఉంటారు గనుక, నా కళ్ళకు ఎనభై ఏళ్ళ వృద్ధుడిలా కనిపిస్తారు. చిన్నప్పుడు బడి ఎగ్గొట్టి ఉంటారు, చదువబ్బి ఉండదు!” ఆంటీ వ్యాఖ్యలు ములుకుల్లా గుచ్చుకున్నాయి.

“కాదు సరితా! వాడు మా అందరికన్నా బాగా చదివేవాడు. ఇంకోసంగతి.... మేం అయిదో క్లాసు చదవకుండా నాలుగు నుంచి ఆరుకి జంప్ చేశాం తెలుసా! అప్పట్లో ఎంట్రన్స్ టెస్ట్ పెట్టి, చేర్చుకునేవారులే! బాగా చదువుతాడని... మా సూర్యారావు మాస్టారు వాడిని ఆ పరీక్ష రాయమన్నారు. వాడిని చూచి నేనూ సూరిగాడూ తయారయ్యాం!”

“మరెందుకు చదువు మానేశారంకుల్?” ఎన్నడూ మా నాన్నని అడగని ప్రశ్న ఇది!

“మొదటి లిస్టులోనే మీ నాన్న పేరుంది. అయినా సరే, మత్స్యపురి హైస్కూల్లో ఆరో తరగతిలో చేరడానికి ఇంట్లో ఓ యుద్ధమే చేశాడు!”

“మూడు నాలుగు మైళ్ళు నడిచెళ్ళాలనా!”

“ఊహూ. మీ తాతకి... మీ మేనత్తా, మీ నాన్న ఇద్దరే సంతానం! అయిదారు ఎకరాల భూమి ఉండేది. ఇంకో అంత బ్రాహ్మల పొలం, కౌలుకి చేసేవారు మీ తాత. ‘చదువులంటూ వెళ్ళిపోతే, తర్వాత వ్యవసాయం ఎవరు చేస్తారంటూ’ మీ నానమ్మ దీర్ఘాలు తీసింది. చదువుకుని తెయ్‌మని ఉద్యోగాలంటూ, ఊళ్ళు పట్టుకుపోతే, రేపు కాలూ చెయ్యీ వంగేక... మిమ్మల్నెవరు చూస్తారంటూ మోకాలు అడ్డుపెట్టింది!”

“మా తాత ఏమన్నారు?”

“మీ నాన్నకే వత్తాసు పలికాడు. ‘రేపేం జరుగుద్దో జరగనీ, ముందెళ్ళి చదువుకోరా’ అన్నారు. ఏనుగెక్కినంత సంబరపడ్డాడు మీ నాన్న! ఇంట్లో చేసిన తినుబండారాలేవో తెచ్చి, మా అందరికీ పంచాడు తెలుసా!”

“మరెందుకు మానేశారు?” అని నేనడిగితే...,

“ఏదైనా క్లాసు తప్పేరేమో! సిగ్గుపడి మానేసుంటారు! ఆ రోజుల్లో అలాగే చేసేవారు!” అంది ఆంటీ వెటకారంగా.

“అదేం కాదు. వాడంతట వాడే మానేశాడు!”

"చదువుకోడానికి ఫైట్ చేసినవారు... తనంతట తనే మానేసారా! వినడానికే చిత్రంగా ఉంది!"

"మధ్యలో ఓ అద్భుతం జరిగిందిలే! మేం ఎనిమిదో క్లాసులో ఉండగా, వేసవి సెలవుల్లో మీ పెదనాన్నగారబ్బాయి పెళ్లి తిరుపతిలో చేశారు. మీ తాతా, నాన్నమ్మా వెళ్తూ, ఆకుమడి బాధ్యత మీ నాన్నకు అప్పగించారు. ఆకుమడి అంటే తెలుసుగా... వరి నారుమడి! మోన తిరిగేక వాటిని పెరికి చేలో ఊడుస్తారు!"

"ఆ గొడవ ఎందుగ్గాని, అసలేం జరిగిందో చెప్పండి!" అసహనంగా అంది ఆంటీ.

ఆవిడ టౌన్లో పుట్టి పెరిగింది. పల్లెటూళ్ళన్నా, పల్లెటూరి వాళ్ళన్నా చిన్న చూపు! అత్తమామలు బతికున్నంత కాలం, తప్పనిసరై అత్తింటికి వెళ్లాల్సొస్తే, పొద్దుట వెళ్ళి సాయంత్రం తిరిగి లాక్కొచ్చేసేది. కడవరకూ ఆ పంతమే నెగ్గించుకుంది!

"నారుమడి ప్రత్యేకత మీకు తెలీదు. అప్పట్లో నాకూ తెలీదు. పసిబిడ్డ కన్నా జాగ్రత్తగా చూసుకోవాలి. ఆ సంగతి మీ నాన్నకు తెలుసు. పొద్దుట లేస్తూనే పరుగెత్తేవాడు. 'అన్ని మొక్కలకూ నీరు సరిగ్గా అందుతోందా లేక ఎక్కువవుతోందా.... నీళ్ళు ఎక్కువ నిలువ ఉంటే వేళ్ళు కుళ్ళిపోతాయి. ఏ భాగమైనా ఎండకి మాడుతోందా, తెగుళ్ళు వచ్చాయా, ఎలుకలు కొడుతున్నాయా...' అని రోజూ రెండు పూటలా వేయి కళ్ళతో చూసేవాడు. ఆ ఏటి పంట దిగుబడి అంతా, ఆ మడిమొక్కల ఎదుగుదల మీదే ఆధారపడి ఉంటుంది!"

"దానివల్ల నాన్నకు వ్యవసాయం మీద ఆసక్తి పెరిగిందా?"

"నన్ను చెప్పనీరా! ఎలుకలకోసం బోనులు పెట్టేవాడు. కలుపుమొక్కలు తలెత్తితే చాలు... పీకేసేవాడు. తెగులొచ్చిందని చిన్నసందేహం కలిగినా, ఊళ్ళోని పెద్దరైతుల్ని తీసుకెళ్ళి, చూపించి సలహాలు తీసుకునేవాడు. ఎంతపిలిచినా మాతో ఆడుకోడానికి వచ్చేవాడు కాదు. మడీ మడీ అంటూ పరుగులు పెట్టేవాడు. వాడికదే లోకమైపోయింది!"

"మా తాత బాగా హ్యాపీ ఫీలయ్యారా!"

"ఆయనకు కొడుకు మీద నమ్మకం లేదు. ఎక్కడ ఎండగట్టేస్తున్నాడో, ఊడ్పుకు ఏం చేయాలో దేవుడా... అని బెంగపడేవారు. తిరుపతిలో పెళ్లయ్యాక కంచి, కాళహస్తి అన్నీ చూసి, పదిరవై రోజులకు వచ్చారు. మత్స్యపురి వంతెన దగ్గర బస్సు దిగీ దిగగానే, అట్నించటే పొలాలకడ్డం పడ్డారు. ఆకుమడి దగ్గరి కెళ్ళి పచ్చని పావడా ధరించినట్టుగా, మోన తిరుగుతున్న మడిని చూసి సంబరం పట్టలేక కూలబడ్డారు!"

"హార్ట్ ఎటేకా?" ఆంటీ అడిగింది.

ఆవిడ వంక చిరాగ్గా చూసి అన్నారు. "అలాంటి రోగాలు అప్పట్లో లేవులే!"

"ఎందుకు లేవూ, రోగాల పేర్లు తెలీదని చెప్పండి, నమ్ముతాను."

"నువ్వు కాసేపు ఆగవే.... ఆ తర్వాత ఊళ్ళోని ప్రతి ఒక్కరినీ రోడ్డు మీద ఆపి మరీ మీ నాన్న గురించి ఎంత గొప్పగా చెప్పారంటే, ఊళ్ళోకెళ్ళడానికే మీ నాన్న సిగ్గుపడిపోయేవాడు తెలుసా!"

“అందుకని అగ్రికల్చర్ బెటర్ అనుకుని ఉంటారు!” అన్నాను.

నావంక చూస్తూ తల అడ్డంగా వూపారు. “నైన్త్ క్లాసులో గ్రేడ్ ఒన్ తెలుగు పండితుడు కొవ్వూరు కేపీగారు తెలుగు చెప్పేవారు. పురాణపరిజ్ఞానం ఆయన కెక్కువలే... పెళ్ళిళ్ళకు పద్యరత్నాలు రాసిచ్చేవారు కూడానూ! ఆయనోరోజున పాఠం చెబుతూ, ‘నారు వేసేదీ నీరు పోసేదీ ఆ పరమాత్ముడే’ అన్నారు!”

“అదీ పాయింటే. మనం నిమిత్తమాత్రులం!”

“మీ నాన్న మాత్రం ఒప్పుకోలేదు. సర్రున లేచాడు. ‘మీరు తప్పు సార్. నారు వేసి, నీరు పోసి, పంట తీసేది రైతే!’ అన్నాడు ధాటీగా!”

ఆయనతో సహా అందరం బిత్తరపోయాం.

“నువ్వనేది ఏంటిరా? ‘రైతే దేవుడు, దేవుడే రైతు అంటావా?’ అనేసరికి తెల్లముఖం వేశాడు మీ నాన్న. క్లాసు ఘొల్లుమంది. ఎర్రబడిన ముఖంతో మీ నాన్న ఏమన్నాడో తెలుసా... “తిండిగింజలు పండించి, మన కడుపు నింపేవాడు దేవుడే కదా సార్?”

“ఆయన ఇందాక నువ్వన్నదే చెప్పాడు. ‘అంతా మనమే చేస్తున్నామనుకుంటాం గాని చేసేదీ, చేయించేది అంతా ఆ భగవంతుడే. మట్టి, మొలక, నీరు, రైతులు, కూలీలు, వ్యాపారులు అంతా నిమిత్తమాత్రులే’ అన్నారు. మీనాన్న ఒప్పుకోనన్నాడు. మేం వాడిని కూర్చోబెట్టడానికి ప్రయత్నించినా వినలేదు. ఇంతలో బెల్ మోగటంలో కేపీగారు వెళ్ళిపోయారు. మేము ఊపిరి పీల్చుకున్నాం! అలా గాలివాన వెలసిందన్నమాట!”

“ఏమైనా వీళ్ళ నాన్నకి కోపం జాస్తి అనుకుంటాను!'' ఆంటీ అంది.

“లేదాంటీ! చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతీదీ ఎంతో ఓపికగా వింటారు, వివరిస్తారు! తర్వాతేమైంది అంకుల్?'' అడిగాను.

“నాలుగైదు రోజులు స్కూలుకొచ్చాడు గాని, అన్యమనస్కంగా ఉండేవాడు. తర్వాత రావడం మానేశాడు. ఇంటికెళ్ళి నేను, సూరిగాడు నచ్చచెప్పాం. అయినా వినలేదు. మాతో, ‘మీరు బాగా చదువుకోండిరా’ అనేవారు!”

“నాన్న ఎందుకంత సడన్‌గా మారిపోయారు అంకుల్?”

“తెలీదురా. తర్వాత పొలాలు, పంటలు, పాడి, పశువులు అంటూ ఆ రంధిలో కూరుకుపోయాడు!”

“మమ్మల్ని మాత్రం బాగా చదువుకోమని ప్రోత్సహించారు!”

“స్కూలుమానేసి ఎంత పెద్ద తప్పు చేశారో తెలిసొచ్చుంటుంది!” ఆంటీ నవ్వింది.

వారిని ఇంటిదగ్గర డ్రాప్ చేసి, “హ్యాపీ రిటైర్మెంట్ అంకుల్'' అన్నాను.

“ఇక అంతా హ్యాపీయేరా! ఇక లైఫ్‌లో పరుగులూ, పాట్లూ, టెన్షన్లూ ఉండవు. పెన్షన్ తింటూ, తీర్థయాత్రలకు తిరుగుతూ, సోఫాలో కాళ్ళు ఆడిస్తూ, కూర్చుని టీవీ చూస్తూ విశ్రాంతిగా గడిపేయడమే!”

ఆ మాటలకు ఆంటీ, “ఇన్నేళ్ళూ చేసింది చాలదూ! నా చక్రాలకూ విశ్రాంతి కావొద్దూ! ఇన్నేళ్ళూ టైముకి ఆదరాబాదరాగా అన్నీ అమర్చడానికి ఉరుకులు పరుగులు పెట్టాను. ఇక నేనూ రెస్ట్ తీసుకుంటాను!” అంటూ ఆనందంగా నవ్వింది.

ఆ రాత్రంతా నా బుర్రనిండా నాన్నే గిర్రు గిర్రున తిరిగారు.

ఉదయమే ఫోన్ చేశాను. “కాలువ వదిలార్రా. నీళ్ళు చేలోకి మళ్ళించడానికి పొలానికి వెళ్ళారు!” అంది అమ్మ.

మధ్యాహ్నం చేశాను. “అన్నం తినడానికి కూడా రాలేదురా! అన్నంకట్టి పంపమని పాలేరుతో కబురంపారు!” అంది.

సాయంత్రం చేసాను. ‘‘కూలోళ్ళని మాట్లాట్టానికి వెళ్ళారు’’ అంది!

“సరిపోయింది. మరి నువ్వేం చేస్తున్నావమ్మా? గంటనుంచి ఫోన్ చేస్తున్నా తియ్యవేం!”

“మన కర్రావు మొన్న పున్నమికి ఈనిందిరా. కోడెదూడ. మీ నాన్నెంత పొంగి పోయారో చెప్పలేను. వాటి ఆలనాపాలనా చూడాలిగా. శాలలో ఉన్నాను!”

“ఎప్పుడు పని పని పని! అంతేనా!”

“మీకంటే ఆదివారాలనీ, పండగలనీ సెలవులుంటాయి. మాకెట్టా కుదుర్తాదిరా అబ్బాయ్!”

ముఖం మీద పిడికిలితో గుద్దినట్టు అదిరిపడ్డాను.

“మీరో పట్టాన అర్థం కారు. ఏం పుట్టుక పుట్టారో ఏమో!” విసుక్కుంటూ ఫోన్ పెట్టేశాను.

నాన్నవరస నాకే మాత్రం నచ్చలేదు. నాలుగుగింజల రాబడి కోసం రాత్రీ పగలూ అన్ని తిప్పలు పడాలా? మేం స్థిరపడ్డాక కూడా ఆ గొడ్డుచాకిరీ అవసరమా? అలాగని పొలం మీద బోలెడు సంపాదించేస్తున్నారా అంటే అదీ లేదు. అప్పుల కుప్ప అలాగే ఉంటోంది. నాన్న ఉద్యోగస్థుడై ఉంటే అంకుల్‌తో బాటు తనూ రిటైర్ అయ్యేవారు! హాయిగా అంకుల్ వాళ్ళలా అమ్మనాన్నలు తీర్థయాత్రలకు తిరుగుతూ, ‘కృష్ణా! రామా!’ అనుకుంటూ కాలక్షేపం చేద్దురు!

ఇప్పుడైతేనేం, అలా ఎందుకు చేయకూడదు?

ఆ ఊహకి ఉలిక్కిపడ్డాను.

ఉద్యోగం కాకపోతేనేం వృత్తి నుంచి హ్యాపీగా రిటైర్ కావొచ్చుగా!

మనస్సులో ఆనంద జలధార చివ్వున చిమ్మింది. తమ్ముడికి ఫోన్ చేసి, “వచ్చేవారం నాన్నకు రిటైర్మెంట్ ఫంక్షన్ చేద్దాం. సెలవు పెట్టు!” అన్నాను.

“ఆయన మానాన ఆయన్ని వదిలెయ్యకుండా, ఈ గొడవెందుకన్నయ్యా!”

“నాన్న... దగ్గరదగ్గర యాభయ్యేళ్ళ నుంచి వ్యవసాయం చేస్తున్నారు. ఈ వృద్ధాప్యంలో విశ్రాంతి తీసుకోవాల్సిందే. లేకపోతే ఆరోగ్యం పాడవుతుంది!”

“అది నిజమే కాని, నాన్న ఏమంటారో!”

“నాన్న సంగతి నీకు తెలుసుగా, ఆడంబరాలు వద్దంటారు. అయినా షష్టిపూర్తి అని చెప్పి ఒప్పిద్దాం. ఆ సందర్భంగా రిటైర్మెంట్ ప్రకటిద్దాం. పొలాన్ని కౌలుకి ఇచ్చేసి నాన్నని సిటీకి తీసుకొచ్చేద్దాం!”

“మనిళ్ళలో ఏ ఫంక్షన్‌కు వచ్చినా, ముళ్ళ మీద కూర్చున్నట్టు కూర్చుంటారుగా. అలాంటిది...”

“అది లీవు. ఇది రిటైర్మెంట్!”

ఊరుకెళ్ళి ఏర్పాట్లు చకచకా చేసేసాం.

బంధుమిత్రుల్ని పిలిచాం. భోజనాలు అరేంజ్ చేసాం.

ఇంటిముందే పందిరి వేసి, ఎత్తైన వేదిక నిర్మించాం. అమ్మానాన్నల్ని ప్రత్యేక ఆసనాల మీద కూర్చోబెట్టి, మేమే గాక, ఊరి ప్రముఖుల చేత సన్మానింపజేశాం. అమ్మా నాన్నా మా చేష్టలకు మురిసిపోయారు.

నేను మైక్ అందుకున్నాను.

‘‘ఇవాళ మాకు పండుగ దినం. మా అమ్మానాన్నలు మాకోసం ఎంతో కష్టపడ్డారు. ఎన్నో త్యాగాలు చేశారు. నేనూ తమ్ముడూ మంచి ఉద్యోగస్థులమయ్యాం. మేం ఎంతచేసినా మా అమ్మానాన్నల ఋణం తీరనిది, తీర్చలేనిది. నాన్నెప్పుడూ ఒకమాట చెబుతుంటారు. చెట్టునీ, ఆకుల్నీ, కాయల్నీ చూసి మురిసిపోతాం గాని, ఆ పచ్చదనానికి ప్రాణాధారమైన వేరుని ఎవరు పట్టించుకోరని! అందుకే ఇవాళ మా వేళ్ళను సన్మానించుకోగలిగాం. అందుకు చాలాచాలా ఆనందంగా ఉంది. ఇకపోతే మీరంతా అనుకున్నట్టు ఇది షష్టిపూర్తి ఉత్సవమే కాదు. నాన్నతో బాటు ఆయన వృత్తినీ గౌరవిస్తూ, ఆయన వయస్సు దృష్ట్యా వ్యవసాయ విరమణ సన్మానోత్సవంగా ప్రకటిస్తున్నాం!”

నాన్న చెంగున కుర్చీలోంచి లేచారు. “ఏంట్రా రామూ, ఏం మాట్లాడుతున్నావురా?” ఆగ్రహంగా ప్రశ్నించారు.

“మీ బాల్యస్నేహితులు రిటైర్ అయ్యారు. మీరుకూడా అవ్వాలి. ఉద్యోగానికే కాదు... వృత్తికీ పదవీవిరమణ ఉంటుంది. ఉండాలి!”

“చాలు చాల్లే, పెద్ద చెప్పొచ్చావ్! సాగుచేయటం వృత్తి అని నీకు ఎవరు చెప్పార్రా. అది వృత్తి కాదు, మా జీవనవిధానం. ఉద్యోగవ్యాపారాల్లా ఇది బతుకుతెరువు కాదు, ఇదే మా బతుకు! భూమిని విడిచిన మొక్కలు బతకలేవని తెలుసుకోండి. కాలు సాగుతున్నంత కాలం, కాడిమీద చేయి బిగుస్తున్నంత కాలం ఇదిలా కొనసాగాల్సిందే! తాత, నానమ్మల సమాధులు మన పొలంగట్టు మీదే కట్టాను. తద్దినాలు అక్కడే పెట్టి ప్రమిద వెలిగిస్తున్నాం. ఎందుకో తెలుసా... ఉన్నప్పుడైనా,

పోయాకైనా కళ్ళముందు పచ్చని పొలం కనిపిస్తేనే రైతుకి తృప్తి! రైతు కోరుకునేది ధనరాశులు కాదు, మట్టితల్లి ఒడిలో ఒదిగి కలిసి పోవడం. ఇదంతా మీకు చెప్పినా అర్థం కాదులే! ప్రాణం పోయాకంటావా, ఆ సంగతి వేరు. ఇప్పుడు మాత్రం మా వేరుబంధాన్ని వేరు చెయ్యాలనుకోకు! వేళ్ళు ఉన్నంత వరకూ నాగలి తిరుగుతుండాల్సిందే. శక్తి ఉన్నంత వరకూ భూమాతను కొలుస్తూనే ఉంటాను!"

ఎవరో చెవిలో చెప్పినట్టుగా అప్పుడే మా శాలలోని ఆవు 'అంబా' అని అరిచింది.

మెడలోని దండల్ని విసిరికొట్టి, స్టేజి దిగి, విసవిసా పొలాల వైపు... లాగి విడిచిన బాణంలా దూసుకుపోయారు నాన్న!

కొంగు బిగించి అమ్మ, "ఇదో వస్తున్నా తల్లీ!" అంటూ ఉరికింది, శాల వైపు!

"నాన్నెక్కడో పిచ్చివాడు అన్నయ్యా!"

"కాదురా, ఆయనొక ఋషి!"

# దొంగ వర్సెస్ దేవుడు

**విజయార్కె**

✆ 9700289681

కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ
ప్రత్యేక బహుమతి పొందిన కథ
శ్రీ విశ్వావసు నామ వత్సర సంక్రాంతి - 2026

***"సారీ కన్వర్‌లాల్.... ఐ కాంట్.... అవి కవుల కల్పనలు.... నువ్విప్పుడు నిజమైన దొంగవి! నువ్వు చేసిన దొంగతనానికి, నిన్ను కాచిన దొంగలకు శిక్ష పడాలిగా! చేసిన తప్పుకు, మళ్ళీ తప్పు చేయకుండా... ఎక్కడో ఎందుకు... ఇప్పుడే ఇక్కడే... చచ్చాక నరకంలో కాదు.... ఆలోచించుకో...." కృష్ణుడి విగ్రహం మాట్లాడినట్టు అనిపించింది. అవతార పురుషుడి మాటల్లో పరమార్థం బోధపడినట్టు...***

శిశుపాలుడు వంద తప్పులు చేసేవరకు కృష్ణుడు క్షమించాడు. ఆ తర్వాత సుదర్శన చక్రంతో శిరస్సు ఖండించాడు.

వాట్ నెక్స్ట్?

★★★

ఇది కన్వర్‌లాల్‌కు వందవ దొంగతనం!

మొదటిసారి అతను గుడిలో దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇళ్లలో, బంగారం షాపుల్లో, బ్యాంకు ఏటీఎంలలో కూడా చోరీ చేసిన కన్వర్‌లాల్ ఈసారి దేవుడి గుడిలో విలువైన నగలు తస్కరించాలని నిర్ణయించుకున్నాడు. దొంగతనం చేసే ముందు పకడ్బందీగా ప్లాన్ చేస్తాడు. ఒకటికి రెండుసార్లు రెక్కీ నిర్వహించి, దొంగతనం చేస్తాడు. దొంగతనం చేసిన వెంటనే, చోరీ చేసిన వస్తువులను విక్రయించడు. దొంగతనం చేసిన వెంటనే మరుసటి రోజు పేపర్లు చూస్తాడు. ఆ రోజు టీవీలో వచ్చే హెడ్ లైన్స్ చూస్తాడు. పోలీసుల కదలికలు గమనిస్తాడు. దొంగతనం జరగ్గానే, అక్కడి నుంచి ఇంచు కూడా కదలడు. ఎందుకంటే దొంగతనం చేయగానే నిఘా ఉంటుంది. బస్సు స్టాండ్స్, రైల్వే స్టేషన్స్ జల్లెడపడతారు. వీటిని బాగా అధ్యయనం చేస్తాడు.

చిన్నాచితకా దొంగతనాలు వదిలేసి వందవ దొంగతనం గ్రాండ్‌గా గుర్తుండేలా ఉండాలని శ్రీకృష్ణుడి ఆలయాన్ని టార్గెట్ చేసాడు. అతని ఫేట్‌ని లూప్ లైన్‌లోకి తీసుకెళ్తుందని తెలియక! గుడి ఎప్పుడు మూస్తారు? ఎప్పుడు తెరుస్తారు? గుడిలో ఏ మూల నక్కి ఉండాలి? ఏం చోరీ చేయాలి? ఇలాంటివన్నీ మ్యాప్‌లా మెదడులో డ్రా చేసుకున్నాడు. సరిగ్గా అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత కృష్ణుడి గుడిలో, సాక్షాత్తు శ్రీకృష్ణుడి కిరీటాన్ని దొంగిలించాడు. నకిలీ కిరీటం పెట్టి.... మిగతా వాటి జోలికి వెళ్ళలేదు. కిరీటం ఒక్కటే చాలా విలువైనది. కృష్ణుని చేతిలో మురళి.... మిగతా ఆభరణాలు అలాగే ఉంచాడు ఎవరికీ అనుమానం రాకుండా!

ఈసారి ఎక్కువ కాలయాపన లేకుండా, చోరీ చేసిన వెంటనే కిరీటాన్ని అమ్మేశాడు... దేవుడి నగలు కొనే చమన్‌లాల్‌కి! అతని అసలుపేరు అది కాదు. అతని దగ్గర ఎప్పుడూ పదిమందికి పైగా మెరికల్లాంటి బౌన్సర్లు ఉంటారు. అతను దొంగతనాలు చేయడు, చేయించడు. కానీ దొంగిలించిన సొత్తును తక్కువ ధరకు కొంటాడు.

కన్వర్‌లాల్ కిరీటాన్ని చమన్‌లాల్‌కు అమ్మేసి వచ్చిన డబ్బును, అయిదు వందల నోట్ల కట్టలను రెండు జేబుల్లో పెట్టుకుని టీవీ చూస్తున్నాడు. మొదటిసారి కన్వర్‌లాల్ సంతోషంగా ఉన్నాడు. అప్పుడే హాఫ్ పూర్తి చేశాడు. మరో హాఫ్ ఓపెన్ చేసేలోగా, అతని ఫేట్... తాగిన విస్కీ కిక్కు కక్కేలా చేసింది. టీవీలో కృష్ణుడి కిరీటం చోరీ అయిన వార్త రానందుకు సంతోషంగానే వుంది. ఆ సంతోషాన్ని పూర్తిగా ఎంజాయ్ చేయక ముందే అతని మైండ్ బ్లాక్ అయ్యే సంఘటన జరిగింది. కిరీటం అమ్మగా వచ్చిన డబ్బులు బీరువాలో పెట్టబోతూ షాక్ అయ్యాడు. లోపల బీరువాలో కృష్ణుని కిరీటం.... తను గుడిలో చోరీ చేసిన కిరీటం... తను చమన్‌లాల్‌కు అమ్మిన కిరీటం... తనింట్లో తన బీరువాలో... తను తాగిన మత్తులో లేడు కదా! ఫ్రిజ్ లో ఉన్న ఐస్‌క్యూబ్స్ నెత్తి మీద గుమ్మరించుకొని చూసాడు. కిరీటం ధగధగ మెరిసిపోతోంది. వెంటనే చమన్ లాల్‌కు ఫోన్ చేద్దామనుకున్నాడు 'చమన్‌లాల్‌కి ఫోన్ చేసి ఏమడగాలి?' కిరీటం తన దగ్గర ఉందని తెలిస్తే తోలు తీసి, ప్యాంటుకు బెల్ట్ తయారు చేయించుకుంటాడు. పోనీ ఈ కిరీటం వేరే వాళ్లకు అమ్మితే...



ఈ ఆలోచన కన్వర్‌లాల్‌కు విస్కీకన్నా ఎక్కువ కిక్కు ఇచ్చింది. వెంటనే కిరీటాన్ని, ఒక బట్ట సంచీలో పాత కాగితాల మధ్య పెట్టాడు. ఇంటికి తాళం వేసి, కిరీటాన్ని కొనే తాహతు దమ్మున్న దయాళ్ దగ్గరికి వెళ్ళాడు. అప్పుడప్పుడు ఖరీదైన దొంగసొత్తు బంగారం అక్కడే అమ్ముతాడు. దయాళ్ కిరీటాన్ని గీకి గీకి చూసి సంతృప్తిగా నిట్టూర్చి, అయిదు వందల నోట్లకట్టలిచ్చాడు.

కన్వర్‌లాల్‌కు రెక్కలు లేకుండానే గాల్లో ఎగురుతున్న ఫీలింగ్ కలిగింది! నోట్లకట్టలు ప్యారాచూట్‌లా అనిపించాయి. అయినా అతనికి అనుమానం తొలుస్తూనే వుంది.

'ఇదెలా జరిగింది? తాను చమన్‌లాల్‌కు అమ్మిన కిరీటం... తనింట్లోకి ఎలా వచ్చింది? తాగిన మత్తులో చమన్‌లాల్ ఇంటికి అదే. చమన్‌లాల్ బీరువాకి కన్నం వేసి, కిరీటం ఎత్తుకు రాలేదు కదా?'

అలా ఆలోచిస్తూ, రాజస్థాన్ ఎడారిలో రేకుల షెడ్డులో పెట్టినట్టు, తల వేడెక్కడంతో... దగ్గర్లో ఉన్న 'జలపాతం' బార్‌లో పీకలదాకా తడిసి... తాగి ఇంటికి వచ్చాడు.

మంచం మీద అడ్డంగా పడుకున్నా, అడ్డమైన డౌట్స్ పీకాయి. తూలుకుంటూ వెళ్లి దయాళ్ ఇచ్చిన డబ్బులు బీరువాలో పెట్టబోతూ భయంగా చూసాడు. కన్వర్‌లాల్ కళ్ళు మిలమిల మెరిసాయి 'హమ్మయ్య... కిరీటం లేదు' అనుకుంటూ, అడ్డంగా పడుకుండిపోయాడు. పొద్దున్నే బకెట్ నీళ్లు తలమీద డ్యాన్స్ చేసేసరికి, ఉలిక్కిపడి లేచి భార్యవంక కోపంగా చూసాడు.

"మొగుడిని నిద్రలేపే పద్ధతి ఇదేనా?" అని అరిచి, కరిచినంత పనిచేసాడు కన్వర్‌లాల్.

"గంటనుంచి, గంట కొట్టి మరీ లేపుతున్నాను. లేస్తేనా? మర్యాదగా 'ఏవండీ నిద్రలేవండి' అంటే లేస్తారా?" మిసెస్ కన్వర్ లాల్ కూడా సేమ్ టోన్‌లో అరిచేసింది.

"ఇప్పుడేమైంది, మనింట్లో ఎవరైనా దొంగలు పడ్డారా? నన్ను మించిన దొంగెవరు?" చిరాగ్గా అన్నాడు. "దొంగలు పడి నిన్నెత్తుకు పోయినా బాగుండు!" అని గొణుగుతూ, మొగుడి చేయి పట్టుకుని బరబరా ఈడ్చుకు వెళ్లినంత పనిచేసింది. మొగుడిని బట్టల బీరువా దగ్గరికి లాక్కెళ్లి, బీరువా తలుపు తీసి మొగుడి మొహాన్ని బీరువాలోకి తోసింది. ముందు ఊపిరాడక, తర్వాత ఊపిరి పోయినంత పనైంది. లోపల కి....రీ....టం....! భార్య బట్టల బీరువాలో కిరీటం. రాత్రి దయాళ్‌కు అమ్మిన కిరీటం... అంతకు ముందు చమన్‌లాల్‌కు అమ్మిన కిరీటం. కన్వర్‌లాల్‌కు నోటమాట రాలేదు!

"ఇదేంటి... ఇక్కడ?" తనలో తానే గొణుక్కున్నాడు

"అదే నేను అడుగుతున్నాను. ఇదేంటి... ఇక్కడ?" మొగుడి నిర్వాకం తెలిసే అడిగింది, గట్టిగానే!

"ష్ అరవకే! గోడలకు బ్లూ టూత్‌లుంటాయి." అంటూనే, ఆ కిరీటాన్ని చేతిలోకి తీసుకున్నాడు. 'ఇప్పుడీకిరీటాన్ని ఏం చేయాలి? మళ్ళీ అమ్మేస్తే?' ఆశ అంతరిక్షాన్ని టచ్ చేసింది. ఫేట్ పాతాళానికి వెళ్తుందని తెలియక!

"పక్క రాష్ట్రంలో ఇలాంటి ఎత్తుకొచ్చిన వాటిని కొనే డేవిడ్‌కు అమ్మితే... సొమ్ము తక్కువైనా, పక్క రాష్ట్రం నుంచి ఈ రాష్ట్రానికి కిరీటం రాదనే వెర్రి భ్రమలో, ఫ్లైట్‌లో అప్పటికప్పుడే వెళ్లి, రాత్రికల్లా అయిదు వందల నోట్లకట్టలతో ఇంటికి వచ్చి, ఈసారి తాగకుండానే గంటకోసారి అలారం పెట్టుకుని మరీ, తన బీరువా, భార్య బట్టలబీరువా చెక్ చేస్తూనే ఉన్నాడు... నిద్రపోకుండా! ఎక్కడా కిరీటం జాడ లేకపోవడంతో, ఈసారి రెండు ఫుల్లులు ఫుల్లుగా తాగి పడుకున్నాడు.

పొద్దున్నే ఎండ కాస్త మండి మొహంమీద ఫెటీల్మని పడటంతో కళ్లు తెరిచాడు. టైము తొమ్మిది దాటింది. వెంటనే వెళ్లి బీరువా తెరిచి, ఆనక భార్య బట్టల బీరువా తెరిచి, భార్య బట్టలు మొత్తం తీసి కింద పడేసి, బీరువాలోకి తొంగి చూసాడు.

"ఏంటి నా బట్టలన్నీ అమ్మేద్దామనే..." ఇస్త్రీ చేసిన తన బట్టలను చెల్లాచెదురుగా కింద పడేయడం చూసి కోపంగా అడిగింది మిసెస్ కన్వర్‌లాల్.

భార్య సెటైర్లు ఎంజాయ్ చేసే పరిస్థితిలో లేదు.

కిరీటం కనిపించక పోయేసరికి, భార్యను ఎత్తుకుని గిరగిర తిప్పాడు. కళ్లు తిరిగినట్టయి, కోపంగా మొగుడి వంక చూసింది.

అప్పుడే స్కూల్‌బ్యాగ్‌తో స్కూల్‌కు బయలుదేరిన పుత్రరత్నం, "అమ్మోయ్... నా బ్యాగులో బుక్స్ ఎవడో దొబ్బేసారు" అని అరిచాడు వెనక్కి వచ్చి.

"బుక్స్ దొబ్బేయడం ఏమిట్రా! అదీ మీ నాన్న ఉండగానే" అంటూ కొడుకు వీపున వేలాడుతున్న బ్యాగ్‌ను చూసి, "ఏరా జోకులేస్తున్నావా పొద్దున్నే. పొద్దున్నే జబర్దస్త్ చూసావా, సెటైర్లు వేస్తున్నావు?" కసిరింది. వెంటనే ఆ పుత్రరత్నం తన వీపుకు వేలాడుతున్న స్కూల్‌బ్యాగ్ తీసి, బ్యాగ్ ఓపెన్ చేసి చూసి, "చావండి! వీపుకు ఏదో గుచ్చుకుంటుంది" అన్నాడు.

కన్వర్‌లాల్ సెవెంత్ సెన్స్ వార్నింగ్ ఇష్యూ చేసింది. స్కూల్‌బ్యాగ్ ఓపెన్ చేస్తే లోపల ధగధగా మెరుస్తున్నకిరీటం! "దగా" అరిచాడు కన్వర్‌లాల్ గొంతు పెగుల్చుకుని.

"కాదు నాన్నోయ్... ధగ ధగా మెరుస్తుంది" చెప్పాడు. పైగా "భలేవుంది మా ఫ్రెండ్స్‌కి చూపిస్తా" అన్నాడు.

వెంటనే కంగుతిని, ఆ కిరీటాన్ని కొడుకుని లోపలికి లాక్కెళ్లాడు. సరిగ్గా అప్పుడే చమన్‌లాల్ నుంచి ఫోన్ వచ్చింది.

"రేయ్ బద్మాష్ ఉల్లుకా పట్టా... కిరీటం అమ్మినట్టే అమ్మి, మళ్ళీ నా దగ్గర దొంగతనం చేస్తావ్. ఇప్పుడే వస్తున్నా, కాచుకో..." అంటూ వార్నింగ్ ఇచ్చాడు.

కన్వర్‌లాల్ చెప్పేది కూడా వినడం లేదు. నిజం చెప్పినా నమ్మే పరిస్థితిలో లేదు. ఇంటికొచ్చి చూస్తే కిరీటం కనిపిస్తే... చమన్‌లాల్ తన చర్మాన్ని సల్వార్‌గా కుట్టించుకుంటాడు. ఇంతలో దయాల్ నుంచి ఫోన్, సేమ్ వార్నింగ్!

పది నిమిషాలు గడవకముందు పక్కరాష్ట్రం నుంచి డేవిడ్ డెవిల్‌లా తగులుకున్నాడు. 'నిన్ను తందూరి పొయ్యిలో వేస్తాను' అని బెదిరించాడు.

"కన్వర్‌లాల్ మెదడు పాదరసం అయ్యింది. ఇప్పుడు ఒకటేదారి! వెంటనే బ్యాగులో కిరీటం పెట్టుకున్నాడు. చలో శ్రీకృష్ణుని టెంపుల్ అనుకున్నాడు.

మధ్యరాత్రి కాందిశీకుడిలా గుడిలోకి ప్రవేశించాడు. గుడిలో శ్రీకృష్ణుడి శిరస్సు మీద నకిలీ కిరీటంలేదు. ఇప్పుడు ఆలోచించే టైము లేదు. వెంటనే బ్యాగులో ఉన్న కిరీటం శిరస్సు మీద అలంకరించి... ఓ దండం పెట్టి 'హమ్మయ్య' అనుకుని, ఖాళీ బ్యాగ్‌తో పరుగెత్తబోయి. ఆగిపోయాడు. వీపుకు ఏదో గుచ్చుకుంటుంది. బ్యాగ్ తీసి చూస్తే కిరీటం! మళ్ళీ కృష్ణుడు విగ్రహం దగ్గరికి పరుగెత్తాడు. అక్కడ కిరీటం లేదు. బ్యాగులో కిరీటాన్ని కృష్ణుడికి పెట్టాడు. పొర్లు దండాలు పెట్టాడు.

బయట కన్వర్‌లాల్‌ను వెతుక్కుంటూ చమన్‌లాల్, దయాళ్, డేవిడ్ దుష్టత్రయం!

"స్వామి రొంబ అన్యాయం. మీ కిరీటం తెచ్చాను. లెంపలు వేసుకున్నాను. బయట వాళ్ళు తరుముతున్నారు. నువ్వు చిన్నప్పుడు వెన్నదొంగవి, గోపికల చీరలు ఎత్తుకెళ్లిన చిలిపిదొంగవి. ఈ చిన్న దొంగ చేసిన తప్పు మన్నించవయ్యా కృష్ణయ్యా... అన్యం శరణం..." మొత్తుకున్నాడు, వేడుకున్నాడు కన్వర్‌లాల్.

"సారీ కన్వర్‌లాల్... ఐ కాంట్... అవి కవుల కల్పనలు... నువ్విప్పుడు నిజమైన దొంగవి! నువ్వు చేసిన దొంగతనానికి, నిన్నుకాచిన దొంగలకు శిక్షపడాలిగా! చేసిన తప్పుకు, మళ్ళీ తప్పు చేయకుండా... ఎక్కడో ఎందుకు, ఇప్పుడే ఇక్కడే... చచ్చాక నరకంలో కాదు.... ఆలోచించుకో..." కృష్ణుడి విగ్రహం మాట్లాడినట్టు అనిపించింది. అవతార పురుషుడి మాటల్లో పరమార్థం బోధపడినట్టు...

సరిగ్గా అప్పుడే గాలి దుమారం... ఒక పేపర్ ఎగిరొచ్చి, కన్వర్‌లాల్ మొహాన్ని తాకింది.

"ఒక దొంగ దొంగతనం చేసి, ఆనక పశ్చాత్తాపంతో తిరిగి దేవుడి విగ్రహాన్ని దేవుడి గుడిలోనే పెట్టిన వార్త" కన్వర్‌లాల్ ప్యాంటు జేబులో నుంచి స్మార్ట్‌ఫోన్ తీశాడు. అన్ని మీడియా ఛానల్స్‌కు, ఫోన్ చేశాడు.

ఆలయం చుట్టూ మీడియా హడావుడి.

"తాను దొంగతనం చేసానని, పశ్చాత్తాపంతో తిరిగి ఆ కిరీటాన్ని అప్పగిస్తున్నట్లు చెప్పాడు. తాను ఈ కిరీటాన్ని ఎవరెవరికి అమ్మాడో వాళ్ళ పేర్లు చెప్పాడు!

కన్వర్‌లాల్‌ను వెంటాడిన చమన్‌లాల్, దయాళ్, డేవిడ్ దొరికిపోయారు... వాళ్ళ దగ్గర ఉన్న దొంగ సొత్తుతో సహా!

నేరం ఒప్పుకుని, అప్రూవర్‌గా మారిన కన్వర్‌లాల్‌కు స్వల్ప శిక్ష పడింది.

జైలులోకి వెళ్తున్న కన్వర్‌లాల్ మనసు తేలికగా వుంది. బ్యాగ్ కూడా తేలికగా వుంది అతని మనసులా! తనను సెల్‌లోకి పంపిన జైలర్‌ను చూస్తుంటే... ఎక్కడో చూసినట్టు అనిపించింది.

జైలర్... కన్వర్‌లాల్ చూస్తుండగానే అదృశ్యమయ్యాడు

★★★

దేవుళ్ళ విగ్రహాలు ఆభరణాలు దోచుకునే దొంగలకు ఇలాంటి అనుభవమే ఎదురైతే.... ఎంత బాగుండును! తథాస్తు దేవతలు "తథాస్తు" అంటే.... ఇంకెంత బాగుండు!! అంతా కృష్ణ మాయ !

★★★

జైలు నుంచి బయటకొచ్చాక... రాష్ట్రంలో ఎక్కడ ఏ గుడిలో దొంగతనం జరిగినా, ఆ దొంగతనం తీరును విశ్లేషించి పోలీసులకు దొంగలను పట్టించే ఇన్ఫార్మర్‌గా మారాడు కన్వర్‌లాల్.

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# వక్కరోలు

**డా. దారాల విజయకుమారి**

✆ 9177192275

*"యా ఊరు బాబూ నీది?" "పక్కూరే పెద్దమ్మా"*

*"ఈ ఊరికి యాలొస్తివి?" "ఈ ఊర్లో నాటు వైద్యుడు ఉన్నాడని చెప్పిరి, మందు తీసుకొని పోదామని వస్తి పెద్దమ్మా"*

*"ఎద్దులాగున్నావు నీకేం రోగము?" "నాక్కాదు పెద్దమ్మ మాయమ్మకు, ఉబ్బసం వ్యాధితో పగులూ రాత్రి నిద్రే బోదు"*

*"అయితే ఈ మందు పనిచేస్తాదిలే! అట్ల ఎడం పక్కకు తిరిగి నేరుగా పో, అక్కడ్నుంచీ నాలుగో ఇల్లే "*

*"సరే" అని అతను వెళ్ళి పోయాడు.*

*ఎందుకో కాంతమ్మకు అతని వాలకం నచ్చలేదు, అందుకే పొడిపొడిగా మాట్లాడింది.*

*ఆ కొత్తగా వచ్చినోడికి ఒక ముప్పై సంవత్సరాల లోపే ఉంటాయి. అతడిని చూడగానే జులాగానే కనిపిస్తాడు.*

కాంతమ్మకు అరవై ఏళ్ళు దాటి మూడేళ్ళయింది!

ఆరోగ్యసమస్యలేవీ లేవు, తన వయసువాళ్ళు ఒక్కొక్కరే ఆవలి ఒడ్డుకు దాటుకుంటున్నారు. అక్కడక్కడా మిగిలిన వాళ్ళు కూడా మెత్తగా అయిపోయారు. ఏ పండగో, పబ్బమో వచ్చినప్పుడు... ఏ ఇద్దరు కలిసినా కాంతమ్మ గూర్చి మాట్లాడకుండా ఉండరు. వాళ్ళంతా కాంతమ్మను 'చింత పిచ్చ' అంటారు. ఆమె గట్టితనం తెలిసే, ఆ అడ్డపేరు పెట్టారు ఊరివాళ్ళు.

కాంతమ్మ దైనందిన జీవితం చాలా సామాన్యమైంది.

రాత్రి మిగిలిన అన్నంలోకి కాసింత పెరుగేసుకుని, కొన్ని నీళ్ళు పోసుకుని, ఉప్పు కలిపి, ఉల్లిపాయ నంజుకుంటూ తాగేస్తుంది. ఆమెకు ఊహ తెలిసినప్పటినుంచీ అదే ఆమెకు ఇష్టమైన టిఫిన్. కొడుకు కోడలు మనుమలు టిఫిన్ ఏదైనా తినమని బలవంతం చేసినా తినదు. వాళ్ళు అడిగి అడిగి వదిలేశారు. రాత్రే కాస్త అన్నం ఎక్కువ వండి, అత్తకోసం పక్కకు తీసిపెట్టడం కోడలు అలవాటుగా చేసుకుంది. తినుబండారాలు, టీ కాఫీలు అలవాటు చేసుకోలేదు. ఏ దురలవాట్లు లేని కాంతమ్మ ఆరోగ్యం... బాగుండకుండా ఎలా ఉంటుంది!



మదనపల్లి టౌనుకు కొంచెం దూరంగా ఉన్న పల్లెటూరు కుంట్రపాకం అది. కొడుకు పుట్టిన కొన్నాళ్ళకే కాంతమ్మ భర్త కన్నుమూసాడు. ఆ వెంట వెంటనే అత్తమామ దాటుకున్నారు. కాంతమ్మ ఒంటరిగానే కష్టపడి కొడుకును చదివించింది, ఉద్యోగస్తుడిని చేసి పెళ్ళిచేసింది. ఇపుడు ఆమెకు కొడుకు, కోడలు, మనుమరాలు, మనుమడు... ఇదే ఆమె లోకం!

కాంతమ్మ తన రెక్కలకష్టాన్నే నమ్ముకునేది. ఒంటరైన తాను జీవితంలో నిలదొక్కుకోవడానికి, తనకు ఎదురుపడిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగపర్చుకునేది.

తన శక్తినీ, మమతనీ, నైపుణ్యాలను... మనసు కడాయిలో అతిరసాలుగా, అలసంద వడలుగా చేసి, తన వాళ్ళకు ఇష్టంగా వండి వడ్డించేస్తుండేది.

పేగుతెంచుకు పుట్టిన బుల్లి నోరు కోసం, ఆప్యాయతాగింజల్ని శ్రమకోర్చి సమీకరించేది.

తన హృదిసంచిలో తనకోసమే ఒక్క ఆలోచనారూపాయినీ ఉంచుకోకుండా, అయినవారి కోసం అంతా పెద్దబుద్ధితో ఖర్చు పెట్టేసేది. అత్తమామలు, ఆడపడుచులు ఎవరేం మాట్లాడినా సరే... చెల్లాచెదురైన నెమ్మదిని ఓపిగ్గా అతికించుకునేది. బిడ్డ భీతిల్లిన వేళలో ఎదకదుముకునేది!

ఇప్పుడు పరిస్థితులు మారాయి. తల్లికష్టం చూస్తూ పెరిగిన గోవిందు, తల్లిని ఒక్కపని కూడా చేయనివ్వడు. దాంతో ఎక్కడా దొరకని, ఎవరికీ లేని తీరిక కాంతమ్మకు మాత్రమే దొరికింది. వంటపని చేద్దామంటే ”పిల్లలకు కావాల్సినవి సంగీత చేస్తుందిలేమ్మా, నువ్వు రెస్టు తీసుకో” అంటాడు.

ఏవైనా పనులు చేద్దామంటే… లేదా సరిదిద్దాలని చూస్తే “అన్ని పనుల్లో వేలెందుకు పెడతావు. రేపెప్పుడైనా నీకు, నీ కోడలికి తగువులొస్తే తీర్చడం నా వల్ల కాదు. నీకెందుకు, నువ్వు విశ్రాంతి తీసుకోమ్మా” అంటాడు. పోనీ పిల్లలతో ఆడుకొందామంటే, “పిల్లలకు చదివేది, రాసేది చాలా ఉంటుంది, నువ్వు వాళ్ళను ఆడుకోవాలని చెప్పకు, వాళ్ళ చదువు పాడవుతుంది. ఇంకా వాళ్ళకు చదువుపైన శ్రద్ధ తగ్గుతుంది!” అంటాడు.

ఇక ఆ విశ్వమాత కాంతమ్మ ఏం మాట్లాడగలదు! బిడ్డ తంతున్నా ముద్దాడే అమ్మ మనసే తనది కూడా!

ఇప్పుడు కొడుకు పెద్దవాడయ్యాడు. అతనికీ ఒక కుటుంబం వచ్చింది. వాళ్ళ కుటుంబం కోసం కొన్న నియమాలు, పద్ధతులు వాళ్ళకు వాళ్ళే పెట్టుకున్నారు. వాటిని ఎవరూ అతిక్రమించకుండా చూసుకోవాలి, కాంతమ్మతో సహా! ఆ నియమాలకు కట్టుబడటం కాంతమ్మకు కొంచెం కష్టం. అందుకే ఎన్నిసార్లు వారించినా, సాయంత్రం స్కూలు వ్యాన్ లోంచి దిగి వచ్చే పిల్లల కోసం, తనూ ఎదురువెళ్ళి మనుమలను తీసుకొస్తుంది. ఎన్నిసార్లు బుద్ధి చెప్పించుకున్నా, మనుమలతో పదినిమిషాలన్నా మాట్లాడాలని ఆశపడుతుంది.

మనుమలు స్నాక్స్ తినే సమయమే… ఆమె వాళ్ళతో గడిపే సమయం. అది ఆమెకు చాలా విలువైంది!

★★★

చిట్టితల్లి, చరణ్ బాబు చిన్న చిన్న ప్లేట్లు తెచ్చుకుని “నాన్నమ్మా! తింటావా?” అనడిగారు.

“ఏంటివి… అవి?”

“నూడుల్స్ నాన్నమ్మా”

“యావో ఒకటి ఏలిక పాముల్లాగ ఉంటాయి, అవే గదా…”

“పాములు కాదు నాన్నమ్మా ఇవి నూడుల్స్.”

“వీటితో ఏం బలమొస్తుంది? ఇన్ని బుడ్డ సెనిగిలు ఉడకేసి, ఇంత తాళింపేసి పెడితే తినరా… అదీ లేదంటే చెనిగిత్తనాలు, బెల్లం పాకం బట్టి ఉంటలు చేసివ్వళ్ళ. మనుషులకు ఉత్త యాగం! బడికి పొయిన బిడ్డలు, సదువులని, పాఠాలని, అలసిపోయి ఆకలిమీద వస్తారు. ఇంటిముఖం చూస్తానే… ఏం తిందాము, ఏం తాగుదాము అని అనుకుంటారు. వాళ్ళొచ్చే టయానికి ఏదో ఒగటి చేసి రెడీగా పెడితే గదా!”

“ఎవురితో మాట్లాడుతున్నావు నాన్నమ్మ?”

“ఎవురితో మాట్లాడుదు నాయనా… మీ యమ్మ నాతో మాట్లాడితే ముత్యాలు రాలిపోతాయని ముచ్చుగా ఉంటుంది.

ఇంట్లో పెట్టిన గంటేదో పోతుందని బయటికే రాదు. రోజంతా తీరికే లేనట్టుగా... అదేం చేసేస్తుందో, ఏమో... చేసిన పని, చేసినట్టే ఉంటుంది. పని మాత్రం తెమలదు!"

"ముచ్చు అంటే ఏంటి నాన్నమ్మా?" చిట్టి తల్లి అడిగింది.

"అయ్యో నా రాత... మీకు తెలుగు గూడా అర్థం గాకపాయ కదరా... ముచ్చు అంటే 'మాట్లాడకుండా ఉండే వాళ్ళు' అని అర్థం నా తల్లీ!"

"అంటే మా మమ్మీ..." అని ఏదో చెప్పబోతుంటే...

"చిన్నూ లోపలికి రా" లోపలి నుంచి కోడలు సంగీత పిలిచింది.

"పోండి నాయనా పోండి... ఇంగ ఇప్పటి నుంచి రాయను సదవనే సరిపోతుంది. పోండి... మీయమ్మ పిలస్తాంది!" కాంతమ్మ.

మాటలు వినబడ్డాయేమో... "చదువులొద్దంటారా అత్తమ్మా" అడిగింది కొంచెం అసహనంగా.

"సదువులు ఎవురూ వొద్దనరు... ఒగ ఆటలేదు, పాటలేదు. ఆడ బల్లో సదివి, సదివి బుర్ర వేడెక్కి ఇంటికొస్తే, ఆ బిడ్డలను, ఈడ గూడా సదువు సదువు అంటారు. ఈ చిన్న తలకాయిలు అంత బరువును ఎట్ల తట్టుకుంటాయి" పిల్లలపైన ప్రేమతో, ఈసడింపుగా అంది కాంతమ్మ.

లోపలినుంచి అంతా వింటున్న కాంతమ్మ కొడుకు బయటకు వచ్చాడు.

"అమ్మా... నువ్వు ఒక్కతే ఉండలేవని, కేవలం నీ కోసమే ఈ పల్లెలో ఉండిపోయాం. ఇక్కడి నుండి పిల్లలకు స్కూల్ కూడా దూరం, అయినా ఎలాగో చేసుకుంటున్నాం!"

"ఇబ్బుడేమైంది నాయనా?"

"నువ్వు పిల్లల చదువులకు అడ్డు తగులుతున్నావు. నీ గారాబం వల్ల, వాళ్ళు చదువుపైన శ్రద్ధ చూపడం లేదు!"

"నేనేం చేసినాను నాయనా! చిన్న కందమ్మలు వాళ్ళు! ఆ పసి తలకాయలకు కాసింత నెమ్మది ఉండల్ల అని అంటి... అంతే!"

"వాళ్ళ చదువులు పెంపకం గూర్చి సంగీత చూసుకుంటుంది. నువ్వు తల దూర్చకు!"

"సరే లేప్పా సరేలే, వాళ్ళు బడి నుంచి వస్తానే తినేదానికి ఏమన్నా చేసి పెట్టమ్మా అంటిని అంతే"

"ఈ పల్లెలో పుట్టి పెరిగినందుకు మాకంటే ఈ తిండి అలవాటు. ఈ కాలం పిల్లోళ్ళు వాళ్ళు, ఇప్పుడు చదువులు వేరు, అలవాట్లు అన్నీ వేరు. వాళ్ళకు నచ్చినవి సంగీత చేసి పెడుతుందిలే, నీకెందుకవన్నీ!"

"సరే నాయనా అట్లే కానీ" అనేసి బయట కానుగ చెట్టు కింద కొచ్చి, మంచం మీద కూర్చుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు ఉబికినాయో లేదో కానుగచెట్టుకు తెలుసు. ఆమె కూర్చునే నులకమంచానికి కాంతమ్మ గూర్చి ఇంకా చాలా తెలుసు.

★★★

సాయంత్రం ఆరుగంటలైంది. హోమ్‌వర్క్ అయిపోయినట్టుంది, మనుమడు చరణ్, మనుమరాలు చిట్టితల్లి... కాంతమ్మ దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చి, "నాన్నమ్మ నేను వచ్చేసా" అన్నారు ఒకరికొకరు పోటీలు పడుతూ.

"అవేవో పాఠాలు రాసేసినారా తండ్రి, లేదంటే మీ నాయన కోపగించుకుంటాడు!"

"అన్నీ రాసేసినాములే నాన్నమ్మ!"

"ఏం తింటిరి చరణ్ తండ్రి"

"అమ్మ బ్రెడ్ జామ్ సాండ్‌విచ్ ఇచ్చింది, తినేసాము!"

"అంతేలే, ఆ ఎండిపోయిన బ్రెడ్డు ముక్కలు తినాల్సిందే మీరు!"

"నువ్వు ఎందుకని బ్రెడ్ తినవు నాన్నమ్మా?" చిట్టి అనుమానంగా అడిగింది.

"మాకు జొరం వచ్చినబ్బుడు, ఇంగేదన్నా వొళ్ళు బాగలేనబ్బుడు... టౌన్ నుంచీ ఎవురన్నా వొస్తే ఆ నాన్ రొట్టి తెచ్చిస్తా ఉండ్రి!"

"అంటే జ్వరం వస్తేనే బ్రెడ్ తింటారా?"

"అవును చరణ్ తండ్రి"

"మరి మమ్మీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ లోకి, సాయంకాలం స్నాక్ లోకి కూడా ఇస్తుందిగా?"

"నేను మొత్తుకునేది అదే కద నాయనా! ఏ ప్యాలపిండి ఉంటలో, ఇన్ని మురుకులు, కాసిన్ని కజ్జాయిలు, కారం బొరుగులు లేదా కారం చెనిగిత్తనాలో... యావో ఒగటి మీకు చేసి పెట్టమని. నా మాట ఎవురింటారు?"

"ఏవంటే అవి తింటే, కడుపు అప్సెట్ అవుతుందని అలాంటి స్ట్రీట్ ఫుడ్స్ తినకూడదని మమ్మీ చెప్పింది!"

"అలా చెప్పి చెప్పి పెంచుతున్నారు మిమ్మల్ని, ఇంగ నేను చెప్పేది ఏముంది తండ్రీ. అమ్మ ఎట్ల చెప్తే అట్లే వినండి నాయనా!" అని చెప్పి, మనుమలు లోపలికి వెళ్ళగానే, ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుంది కాంతమ్మ.

కాంతమ్మ దర్జాగా బతుకుతోంది అని అందరూ అనుకోవాలనీ... తనకూ కొన్ని అంసతృప్తులు ఉన్నాయని ఎవరూ తెలుసుకోకూడదని కాంతమ్మ చాలా జాగ్రత్త పడుతుంది.

★★★

బీపీ, షుగరులాంటివి లేవు కానీ, నోట్లో పుచ్చిపోయిన పండ్లను తీయించేసి, మళ్ళీ కట్టించాడు కొడుకు గోవిందు. గట్టి వక్కలు లాంటివి నమలరాదని డాక్టర్లు చెప్పేసాక, ఆకు వక్క దంచుకోవడానికి కొడుకును అడిగి, వక్కరోలు తెప్పించుకుంది కాంతమ్మ.

ఇనుపరోలు దాన్ని చైన్‌తో కలుపుతూ, రోకలి ఉండే వక్కరోలు, ముసలివాళ్ళకు వరం లాంటిది. కాంతమ్మ తాను కూర్చునే మంచంపైనే వక్కరోలు, వక్కాకు సంచి పెట్టుకుంటుంది.

పొద్దున సద్ది తాగిన తర్వాత, కానుగచెట్టుకింద నిమ్మళంగా కూర్చుని, నడుములో దోపుకున్న తిత్తిని (సంచి) బయటకు తీస్తుంది. ఆ తిత్తిలో పసుపు, ఎరుపు, పచ్చరంగుల అరలుంటాయి. ఒక అరలో వక్కలు, ఒక అరలో తమలపాకులు, సున్నపు కాయ, కొంచెం చిల్లర, కొన్ని నోట్లు, మరొక అరలో దుగ్గు ఉంటాయి.

మొదట ఒక వక్కను రోలులో వేసి దంచుతుంది, తర్వాత తిత్తిలోంచి మడిచి పెట్టుకున్న తమలపాకుల కట్టను బయటకు తీస్తుంది. అందులోంచి ఒక ఆకు తీసుకుని, మిగిలినవి మడచి చీర కుచ్చిళ్ళపైన పెట్టుకుంటుంది. తీసుకున్న ఆకును చీరకే తుడిచి, తొడిమ గిల్లేస్తుంది. సున్నపుకాయ మూత తీసి, ఆకుకు సున్నం రాసి, మడిచి రోలులో పెట్టి, ఆకు వక్కపొడి కలిపి, మళ్ళీ దంచి... దాన్ని తీసి నోట్లో పెట్టుకొని నములుతుంది. అప్పుడొస్తుంది ఆకు, వక్క, సున్నం కలిసిన వాసన! నేలపైన చినుకులు పడగానే ఒక్కసారిగా లేచిన దుమ్ము, తేమ కలిసిన మట్టివాసన లాగ... ఊపిరితిత్తులు పూర్తిగా విప్పదీసి, పీల్చుకోవాలన్న ప్రయత్నం చేయాలని ఉంటుందే అలా ఉంటుంది ఆ వక్క, ఆకు, సున్నం కలిసిన వాసన!

కాస్సేపు అలా ఇలా నమిలి, తిత్తిలోంచి కొన వేళ్ళతో దుగ్గు తీసి, ఎడమ అరచేతిలో వేసుకుని, కుడి చేతివేళ్ళతో అలా ఇలా అని, నోట్లో వేసుకుని అంతా కలిపి బుగ్గకు పెట్టుకుంటుంది. ఇప్పుడొచ్చే వాసన చాలా ఘాటుగా ఉంటుంది. బహుశా దుగ్గు వలన కావచ్చు!

"ఈ ఆకు, వక్క, దుగ్గు మానవా... క్యాన్సర్ లాంటి పెద్ద పెద్ద రోగాలు వస్తాయంట" అని ఎవరైనా అంటే

"అట్లాంటి పెద్ద పెద్ద జబ్బులు మన లాంటి బీదోళ్ళకు రావులే!" అంటుంది.

ఏదో ఒక వంకతో కాంతమ్మ దగ్గరికి పరిగెత్తుకుని వస్తారు చరణ్ చిట్టితల్లి ఇద్దరూ.

"నీ వక్కరోలు ఇటివ్వు వక్క ఆకు దంచి ఇస్తాను. నాన్నమ్మా" అని అడుగుతారు.

"వద్దులే నాయనా! అమ్మ రాసుకోమని చెప్పిన పాఠాలు రాసేసి, మళ్ళీ రాపోండి తండ్రీ!" అని నచ్చచెప్పి పంపేస్తుంది.

తమలపాకు, వక్క దంచి ఇవ్వాలని ఇద్దరూ పోటీ పడతారు. ఆ సమయంలో వక్కాకు వేసుకోకపోయినా వక్కరోలులో దంచాలని మనుమలు సరదా పడుతున్నారని, వక్క ఆకు ఇస్తుంది. ఇద్దరూ గొడవపడకుండా చరణ్‌ను వక్క దంచమని చెప్పి, చిట్టితల్లిని ఆకు, సున్నం వేసి దంచేలా ఒప్పిస్తుంది. తమలపాకు తొడిమ తుంచగానే చిట్టి దాన్ని నోట్లో వేసుకుంటుంది. ఆ దృశ్యం కొడుకూ కోడలు చూడకుండా జాగ్రత్త పడుతుంది కాంతమ్మ.

వక్క, తమలపాకు దంచి, "నాన్నమ్మా దంచేసాను చూడు" అని అడుగుతారు.

"లేదు చిట్టితల్లి, ఇంగా మెదగలేదు" అని, "ఇంగా కొంచెం దంచాళ్ళ చరణ్ తండ్రీ" అని అనడం రోజూ జరుగుతుంది.

వక్క, ఆకు, సున్నం వేసి దంచేసాక, ఆ మిశ్రమాన్ని తీసి కాంతమ్మ చేతిలోకి పెడతారు. కాంతమ్మ దాన్ని నోట్లో వేసుకుని, నములుతుంటే కళ్ళు పెద్దవిగా చేసుకుని, కాంతమ్మ ఎర్రగా పండిన నాలుక చూపించగానే

సంతోషంగా చూస్తుంటారు. ప్రతిరోజూ అదే దృశ్యం చూసినా, వాళ్ళకు అదే ఆనందం... ఆశ్చర్యం!

"నాన్నమ్మా ఎర్రగా అయిందా? ఏదీ నోరు చూపించు!" అని అడుగుతారు ప్రతిరోజూ.

"మాకూ పెట్టు నాన్నమ్మా" అని అడుగుతారు, కానీ నోరు ఎర్రబడితే కొడుకూ కోడలు అరుస్తారని... "వద్దు నాయనా, వక్కాకు నమిలితే చదువు రాదు నాలాగా!" అని అంటుంది.

అయినా మళ్ళీ మళ్ళీ అడిగి మారాం చేస్తే, ఎప్పుడైనా తన కొనవేలితో కొంచెం తీసి వాళ్ళ బుజ్జి నోట్లో పెడుతుంది.

నోరు ఎర్రబడింది అమ్మకు నాన్నకు చూపించకుండా జాగ్రత్తగా ఉండమని చెబుతుంది. ఇలాంటి దొంగ ఒప్పందాలు, మనుమలుకు కాంతమ్మకు చాలానే ఉన్నాయి. ఆ వక్కరోలు శబ్దం అన్నా, అందులో దంచుకునే వక్కాకు అన్నా కోడలుకు చాలా చిరాకు. "ఆ వక్కరోలును ఎందుకు తెచ్చిచ్చావు ఆమెకు!" అని, చాలా సార్లు భర్తను విసుక్కుంటూనే, మాటలు అంటూనే ఉంటుంది.

★★★

ఆంక్షల తాళ్ళతో కొడుకు, కోడలు తనను కట్టేసాక, కాంతమ్మ బయట కానుగచెట్టు కింద ఒక పాత మంచం వేసుకుని కూర్చుని, పల్లెలో పనులకు వెళ్ళే వాళ్ళను, వచ్చే వాళ్ళను పలకరించి, మాట్లాడటం అలవాటు చేసుకుంది. కాంతమ్మతో మాట్లాడటం కొందరికి నచ్చదు, కానీ చాలామందికి నచ్చుతుంది. కాంతమ్మ అదేదీ పట్టించుకోదు, తాను వాళ్ళను పలకరించకుండా మాత్రం వదలదు. చేను కాటికి పోతూ ఎవరు కనిపించినా, కాంతమ్మ పలకరించాల్సిందే, "రా పాపా... ఇట్లవచ్చి కూచో" అని.

"పోవళ్ళ పెద్దమ్మ" అని అంటే...

"అయ్యో పనులు ఎబ్బుడూ ఉండేవే గదా! కాసింత సేపు ఇట్లన్నా నిమ్మళంగా కూచోకుంటే, ఎందుకు పాపా జీవితము!" అని అంటుంది

"నీకేం పెద్దమ్మ... కాలట్ల కదలనీకుండా చూసుకుంటారు నీ కొడుకు కోడలు, మాకు అట్ల అబ్బుతుందా చెప్పు!" అని అంటారు

"మొన్నటిదాకా సాకి సంతరిచ్చింటేనే గదా ఎవురన్నా చూసేది... ఊరికే ఎవురు చూస్తారమ్మా ఈ కాలము!" అంటుంది

"ఏమన్నా గానీ దేవున్ని బాగా అడిగొచ్చినావు పెద్దమ్మ. మాయమ్మ జూడు కొడుకుల్ని ఎంత మురిపెంగా సాకింది. ఈరోజు ఎవురూ తొంగి జూడరు. ఎట్లున్నావమ్మా అని కూడా అడిగిన పాపాన బోరు!"

"పెండ్లాలు పడనీరేమో కొడుకులు ఇంగ ఏం జేస్తారు"

"పెండ్లాం మాట ఇనల్సిందే, మళ్ళా ఇంత అధ్వాన్నంగానా?"

"ఏమోలే పాపా కూచో, వక్కాకు ఏసుకోని పోదువు" అని సముదాయిస్తుంది

ఆ తర్వాత కమలమ్మ వస్తుంది. బాధలన్నీ చెప్పుకుంటుంది. పాపం కమలమ్మను మొగుడు తాగివచ్చి రోజూ కొడతాడు. 'తాగేదానికి అడ్డుపడిందని ఒక రోజు,' 'అడిగింది చేసిపెట్టలేదని ఒక రోజు' ఆమెను కొట్టని దినం ఉండదు.

'పొద్దున మొగుడు బయటికి ఎళ్ళబారి పోతానే వస్తుంది. పాపం ఈరోజేమో ఇంగా రాలేదు' అని కాంతమ్మ

అనుకుంటూనే ఉంటుంది. కమలమ్మకున్న ఒకే ఒక పెద్ద దిక్కు ఓదార్పు కాంతమ్మే.

మొగుడుకొట్టిన దెబ్బలు, గాయాలు చూపిస్తుంది. రోజూ అవే కష్టాలు చెప్పినా సరే, కమలమ్మ బాధను విని, చూసి ప్రతి రోజూ అదే రకంగా ఓదారుస్తుంది కాంతమ్మ.

"ఆ తరంగా మిడిమాలం పడ్తా ఉంటే యాదో ఒగ రోజు కింద పడకుండా ఉంటాడా?"

"ఎబ్బుడూ కాలం ఇట్లే ఉంటుందా?"

"వానికి అమిసరమొచ్చింది. ఈ రకంగా ఆడతాండాడు"

"ఈరోజున్నోళ్ళు రేపు ల్యావీడు, ఎన్నడు తెల్సుకుంటాడో ఏమో" అని ఏదో ఒకటి చెప్పి, కమలమ్మను ఓదార్చుతుంది.

ఆ దారి వెంట ఎవరు వెళ్ళినా కాంతమ్మ పలకరించాల్సిందే. అది అందరికీ అలవాటు. తమ బాధలు చెప్పుకుని ఉపశమనం పొందుతారు కొందరు. కొందరికి ఆమె సలహాలు పని చేస్తాయి.

దినం మార్చి దినం కొడుకు టౌన్ నుంచీ ఆకులు, వక్కలు తెచ్చిస్తాడు. దాంతో దారినపొయ్యే వాళ్ళను రమ్మని, కూర్చోబెట్టుకొని, ఆకు, వక్క ఇచ్చేదే కాకుండా, ఆకు నమిలినంతసేపు వాళ్ళ బాధలు కూడా వింటుంది, తగిన సలహాలిస్తుంది, దాంతో కాంతమ్మ అందరికీ ఆప్తురాలైపోయింది!

"పురిటినుంచీ కాటికి ఎన్నో ఏండ్ల తరబడి నడుస్తానే ఉండల్ల. ఎబ్బుడో ఒగసారి జీవనం సద్దుమనుగాల్సిందే... ఆకులు నిశ్శబ్దంగా రాలిపోయినట్లు, ప్రాణాలు గూడా అంతే... ఎబ్బుడో ఒకబ్బుడు సద్దు చేయకుండా రాలి పడతాయి!" అని జీవితసత్యం చెబుతుంది.

'పెత్తర్ల అమావాస్యకు బట్టలు పెట్టాలంటే... ఏమేం పెట్టల్ళ, పూజ ఎట్ల చేయల్ళ' అని పల్లెలోని ఆడవాళ్ళంతా కాంతమ్మను సలహాలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకుంటారు.

"ఈ వయసుకూ ఇంత గట్టిదనం ఉంది... వయసులో ఉన్నప్పుడు ఏం తింటాంటివి పెద్దమ్మ!" అని అడిగితే, "ఉడగబెట్టిన ఉలవలు, బెల్లం, ఏంచిన చెనిగ్గింజలు దంచుకోని తింటాఉంటి. ఇంకా సద్ద కుడుములు, ప్యాలపిండి ఉంటలు తింటాంటి" అని చెబుతుంది.

"కూరలు సట్టిలో చేస్తాంటి, వడ్లు దంచి, రాగులు ఇసిరి సంగటి గెలుకుతాంటి... పెద్ద పెద్ద ముద్దలు మీ పెద్దనాయన రెండు ముద్దలు తినేస్తాండ్య" అని జ్ఞాపకాలు కలబోసుకుంటూ ఉంటుంది.

★★★

ఊర్లోకి ఎవరొచ్చినా కాంతమ్మకు తెలిసిపోతుంది. కొత్తవాళ్ళు ఎవరొచ్చినా వివరాలు అడగందే వదలదు.

సాయంత్రం నాలుగు కావస్తూంటే ఒక కొత్తమొఖం కనిపించింది కాంతమ్మకు. అతన్ని దగ్గరకు రమ్మని పిలిచి ఎగాదిగా చూసింది.

"యా ఊరు బాబూ నీది?"

"పక్కూరే పెద్దమ్మా"

"ఈ ఊరికి యాలొస్తివి?"

"ఈ ఊర్లో నాటువైద్యుడు ఉన్నాడని చెప్పిరి, మందు తీసుకొని పోదామని వస్తి పెద్దమ్మా!"

"ఎద్దులాగున్నావు నీకేం రోగము?"

"నాక్కాదు పెద్దమ్మ మాయమ్మకు, ఉబ్బసం వ్యాధితో పగులూ, రాత్రి నిద్రే బోదు"

"అయితే ఈ మందు పనిచేస్తాదిలే! అట్ల ఎడం పక్కకు తిరిగి నేరుగా పో, అక్కడ్నుంచీ నాలుగో ఇల్లే."

"సరే" అని అతను వెళ్ళిపోయాడు.

ఎందుకో కాంతమ్మకు అతని వాలకం నచ్చలేదు, అందుకే పొడిపొడిగా మాట్లాడింది.

ఆ కొత్తగా వచ్చినోడికి ఒక ముప్పై సంవత్సరాల లోపే ఉంటాయి. అతడిని చూడగానే జులాగానే కనిపిస్తాడు.

ఆ తర్వాత మళ్ళీ రెండురోజులు అదే సమయానికి కనిపించాడు, కాంతమ్మకు వాడి వరసే నచ్చలేదు.

"పొద్దస్తమానం మా ఊరికి వస్తాండావు ఏమయ్యా... మీ ఊర్లో లేరా వైద్దుగుడు? టౌనుకు పోవల్సింటివి, అయినా తిరప్తిలో లేని వైద్యిమా?" అని ఈ సారి కొంచెం గట్టిగానే అదిలించింది.

వాడూ గట్టిగానే ఎదురు మాట్లాడాడు "ఊరేమన్నా నీ సొంతమా... రావొద్దనేదానికి! వొచ్చేది వొచ్చేదే ఏంజస్తావు" అని అనేసి ఊర్లోకి వెళ్ళిపోయాడు

★★★

ఆరోజు పిల్లలకు బడిలేదు, బజార్లోకి వెళ్ళి వస్తామని కాంతమ్మ కొడుకూ, కోడలు, మనుమడు వెళ్ళారు. చిట్టితల్లి కాంతమ్మ దగ్గరే ఆడుకుంటానని ఉండిపోయింది. బొమ్మలన్నీ తెచ్చుకుని ఆడుకుంటూ ఉంది చిట్టితల్లి, మధ్యాహ్నం మూడవుతోంటే

మంచం పైన పడుకున్న కాంతమ్మ కొంచెం తూగింది. ఏదో శబ్దం అయితే లేచి కూర్చుంది. చూస్తే... చిట్టితల్లి లేదు.

"అమ్మా చిట్టితల్లీ!" అని పిలిచినా సమాధానం లేదు. గబగబా మంచం దిగి ఇంట్లోకి వెళ్ళింది అక్కడా లేదని వెతుకుతూ ఇంటిపక్కకు వెళ్ళింది. కాస్సేపటికి ఏడేళ్ళ చిట్టితల్లి అరిచిన అరుపులకు, చుట్టుపక్కల అందరూ పరిగెత్తి వచ్చేసారు.

కాంతమ్మ పడిపోయి ఉంది.

"తల మీద రాయి పడినట్టుంది పాపం, తగిలిన దెబ్బకు ప్రాణం పోయినట్టుంది!"

చనిపోక ముందు చాలా సేపు పోరాడినట్లు, పెనుగులాడినట్లు గుర్తులు కనబడుతున్నాయి.

ఆ కొత్తగా వచ్చిన జులాయివాడు ఆ పక్కనే పడిపోయి ఉన్నాడు. తలనుంచి రక్తం కారుతోంది, వాడి పక్కనే వక్కరోలు పడి ఉంది.

"ఊరికి పెద్ద దిక్కు కాంతమ్మ పెద్దమ్మ, ఇంగెవురున్నారు అంతమాత్రమోళ్ళు..."

"ఇంటి మనుషులను ఊరి మనుషులును ఇన్నాళ్లు కాపాడుకుండ్య."

"పోతాపోతా ఆ మనుమరాలు ప్రాణమూ, మానమూ కాపాడే పొయ్యింది."

"పుణ్యాత్మురాలు తిరుగుతా తిరుగుతానే పోయింది"

"ఏమన్నా గానీ... గోవిందుకు, ఈ ఊరికీ కొండంత అండ ఈ తల్లి దూరమైపాయ!"

ఉన్నపళంగా బజారునుంచి వచ్చి అచేతనంగా పడివున్న తల్లిని చూస్తూ, కిందనే కూలబడి ఏడుస్తున్నాడు గోవిందు. ఆ పక్కనే భయంతో వొణికిపోతున్న చిట్టితల్లిని, చరణ్‌బాబును పొదుపుకుని నిశ్శబ్దంగా రోదిస్తోంది కోడలు సంగీత!

ఇకనుంచి చెయ్యి అడ్డం పెట్టుకున్న కళ్ళతో... ఊరి మొగదాల్లో నిలబడి మనుమల కోసం ఎవరు దారి కాస్తారు?

వారి కబుర్లకు శ్రోతై... వాళ్ళ ఆటకు బొమ్మై... వాళ్ళకు తానే కాకమ్మ కథై... కొసరికొసరి తినిపించాలని... దాచి దాచి పెట్టాలని... కొరకలేని చెరుకుగడని గుండ్రని ముక్కలు చేసి వాళ్ళ ఒడిలోకి వేసి తినమని చెప్పాలని...

వాళ్ళ పునికి పైన తన చేతులతో తలంటిన, ఆ వండినాముదపు చల్లదనం... వాళ్ళ తలంతా ప్రసరించాలని ఆరాటపడే వాళ్ళు... ధనుర్మాస ఈదురు గాలుల్లో, తనే కంబళిగా మారి తన రెక్కల వెచ్చదనంలో వాళ్ళను దాచేసుకోవాలని తపన పడే వాళ్ళు ఇంకెవరున్నారు? – అని కాంతమ్మను తలచుకొని కొడుకూ, కోడలుతో పాటూ ఊరు ఊరంతా రోదించింది!




# అత్తరుపరిమళం

**పి.ఎస్. నారాయణ**

✆ 9959808862

***"హమ్మయ్య! ఇంకా ముట్టించలేదు గదా!" అంటూ చితి దగ్గరకు రొప్పుతూ వచ్చి నమస్కరిస్తూ, "గుడిసెల్లో పెరుగుతున్న నన్ను చేరదీసి, చదువుబిక్ష పెట్టి, నాలుగు పడకగదుల ఇంట్లో అన్ని సుఖాలు అనుభవించేలా ఇంతటివాడిని చేసారు. ఎంత మొత్తుకున్నా పైసా తీసుకోలేదు. ఇక ఇప్పుడైనా కాదనరనే ధైర్యంతో, మీకెంతో ఇష్టమైన సెంటు కొనుక్కొచ్చాను!" అంటూ చేతిలోని సీసా మూత తీసి చితిమీద చల్లాడు.***

***సూర్యం అతడి మాటలు వింటూనే తల్లడిల్లిపోయాడు.***

సెంటు మాస్టారు ఆరోజు సాయంత్రం ఆరు గంటలప్పుడు ఆఖరిశ్వాస విడిచారు ఆసుపత్రిలో! దహనం చేసేది మరునాడే కనుక శవాన్ని అక్కడ మార్చురీలో ఉంచారు.


ఆయన అసలు పేరు రామ్మూర్తి. స్కూల్ టీచర్‌గా చేసిన ఆయనకు విద్యార్థులు పెట్టుకున్న ముద్దు పేరు 'సెంటు మాస్టారు'. అదే అందరి నోళ్లలో స్థిరపడిపోయింది.

తొంభై సంవత్సరాలు దాటిన ఆయన పోయినా అంతగా బాధపడుతున్న వాళ్ళెవరూ లేరాయింట! ఆయన భార్య గదిలో ఓ మూలగా పాతచీర పరుచుకు పడుకుని కుమిలికుమిలి ఏడుస్తోంది, ఆయన సాహచర్యంలో గడిపిన డెబ్భై సంవత్సరాల జీవితాన్ని మననం చేసుకుంటూ!

ఒక కొడుకు, కూతురు. ఇద్దరికి తన సంపాదనలోనే చేతనైనంత ఘనంగా వివాహం చేసాడు. అదే ఊళ్ళో మరో టీచరును అల్లుడిగా తెచ్చుకున్నాడు. చిన్నవాడైనా కొడుకు ఎమ్మే చేసి, కాలేజీలో లెక్చరర్‌గా చేరాడు. ఈ మధ్యనే అతడూ ఉద్యోగంనుంచి విశ్రాంతి తీసుకున్నాడు.

ఉద్యోగంలో ఉండగానే నివాసానికి నీడ ఏర్పరుచుకున్నాడు. తాతలనుండి వచ్చిన మూడెకరాల మాగాణిలో సంవత్సరానికి సరిపడా వడ్లు వస్తాయి.

సెంటుమూర్తి పోయాడన్న వార్త ఎందరో స్నేహితులను బాధాతప్తులను చేసింది. చాలా మంచిమనిషిగా పేరొందిన ఆయనకు, చుట్టుపక్కల అందరూ కావాల్సిన వాళ్ళే. అందరూ ఆత్మీయులే. తోటి ఉపాధ్యాయులే కాదు. ఆయన దగ్గర




చదువుకున్న చాలామంది విద్యార్థులు ఇప్పటికీ వచ్చి యోగక్షేమాలు కనుక్కుని వెళుతుంటారు. ఆయన సర్వీసులో కొన్ని వందల మందికి చదువు చెప్పాడు. అంతకు మించి చదువులో వెనుకబడిన విద్యార్థులకు, సాయంత్రం పూట ఉచితంగా ఇంట్లో ప్రత్యేకంగా చెప్పేవాడు.

ఆయన పోవడంతో ఆ ఇల్లే మూగబోయి నట్లయింది. మాస్టారు పోయారన్న బాధతోనే అన్నట్లుగా ఆకాశం సాయంత్రం నుండి చిరుజల్లులు కురిపిస్తోంది.

తెల్లవారుజామున ఐదు గంటలకు లేచిన సూర్యం వెళ్ళి, తల్లిపక్కన కూర్చున్నాడు. ఓ పక్కగా అతడి అక్కయ్య సుశీల, తల్లికి తోడుగా పడుకుని ఉన్నది.

“లే అమ్మా! ముఖం కడుక్కుంటే కాఫీ తాగుదువు గానీ... ఇక అందరూ రావడం మొదలు పెడతారు. తెల్లవారగానే ఆసుపత్రికి వెళ్లి అంబులెన్సులో నాన్నను తీసుకు వస్తాను!”

కొడుకు మాటలకు, ఆమె ఒక్కసారిగా ఘొల్లుమన్నది. వేసుకున్న వేలుముడి ఊడిపోగా, చెమటకు తడిసిన ముఖాన్ని తెల్లటి జుట్టు కప్పివేస్తోంది. పచ్చటిముఖమ్మీద సూర్యుడిలా వెలుగుతుండే కుంకుమ బొట్టు... తడికి చిందరవందర అయింది. దుఃఖంతో పీక్కుపోయిన ఆ ముఖం చూస్తుంటే అతని కళ్ళు చెమరుస్తున్నాయి.

"బాధపడకమ్మా! అదృష్టవంతుడు... మంచంలో పడి రెండువారాలుగా నరకయాతన అనుభవిస్తున్న ఆయనకు ఇప్పటికయినా ముక్తి లభించిందని సంతోషించు!" అనునయించాడు తల్లిని.

తల్లి మాట్లాడలేదు. ఏడుపు ఆపలేదు. వారి అనుబంధం ఒక్క నాటిది కాదు క్షణాలలో మరిచిపోవడానికి! ప్రతిజీవి పోక తప్పదు. పూర్తి జీవితాన్ని ఆస్వాదించిన ఆయన కోసం దిగులు పడాల్సిన అవసరం లేదు కానీ, జీవిత భాగస్వామిని కోల్పోయిన తల్లిని చూడాలంటేనే బాధగా ఉంది. కాలమే ఆమె బాధను తీర్చాలి.

సూర్యోదయమౌతున్న సమయంలో... బావగారిని, ఇద్దరు బంధువులను తీసుకొని ఆసుపత్రికి వెళ్ళాడు, తండ్రి విగత శరీరాన్ని తీసుకు వచ్చేందుకు సూర్యం.

★★★

రామ్మూర్తి ఆ ఊళ్ళోనే పుట్టాడు. ఆ ఊళ్ళోనే పెరిగాడు. బిఇడి చదివి హైస్కూల్లో లెక్కల మాస్టారుగా జేరాడు. ఖాళీ సమయంలో అన్ని సబ్జెక్టులు పఠనం చేయడంతో ఎంతో విజ్ఞానాన్ని సంపాదించగలిగాడు. స్కూల్లో ఏ టీచర్ సెలవులో వెళ్లినా ఈయన్నే ఆ క్లాసుకు పంపేవాడు హెడ్మాస్టర్.

ఆయనకు పాతికసంవత్సరాల వరకూ ఎన్నిచోట్ల ప్రయత్నించినా ఉద్యోగం దొరకలేదు. ప్రభుత్వోద్యోగానికి వయసు మీరిపోతున్నదని భయపడుతున్న సమయంలో హైస్కూల్లో టీచర్‌గా ఇంటర్వ్యూ వచ్చింది. వెళుతూ దారిలో ఆత్మీయ మిత్రుడి ఇంటికి వెళితే, శుభాకాంక్షలు చెబుతూ చొక్కామీద కొద్దిగా సెంటు రాసాడతడు.

"ఇదెందుకురా ఇప్పుడు?" అన్నాడు రామ్మూర్తి.

"నేను ఏ ముఖ్యమైన పనిమీద వెళుతున్నా ఇది రాసుకునే వెళతానని, విజయం సాధిస్తానని తెలుసుగా!' అన్నాడు నవ్వుతూ అతడు.

అతని ఆ మాటే నిజమయింది. ఆ ఉద్యోగం రావటంతో ఇక ఆ మిత్రుడి నమ్మకాన్ని, తన నమ్మకంగా చేసుకుని, అపజయం అనే మాటను మర్చిపోయాడు.

అదే అతడి జీవితంలో ఓ ముఖ్యపాత్రయి, మొట్టమొదటిసారిగా విద్యార్థుల దృష్టిలో పడి, తర్వాత అందరిలోనూ ఆయనను 'సెంటు మాస్టారు'గా మార్చివేసింది. చివరకు మంచాన పడినా, ఆరోగ్యం బాగుపడాలన్నట్లుగా... రోజూ ఒంటిన ఉన్న దుస్తుల మీద కొద్దిగా రాసుకుంటుండేవాడు.

పదిహేను రోజుల క్రితం సీసాలో సెంటు అయిపోవచ్చేలా కనబడటంతో, కొడుకుని కొనుక్కురమ్మనమంటే సూర్యం చికాకుపడ్డాడు. "ఇప్పటికే మందులకు వేలల్లో ఖర్చు పెడుతున్నాం, మంచాన పడ్డా ఇంకా దాన్ని వదిలి పెట్టకపోతే ఎలా? ఎప్పుడో ఏదో కాకతాళీయంగా జరిగిందని దాన్నే పట్టుకు వ్రేళ్ళాడతావెందుకు!" అన్నాడు విసురుగా.

"పోనీయలేరా... పెద్దాయన అడుగుతున్నప్పుడు తెచ్చి పెడితే ఏమైంది?" అన్నది తల్లి నవ్వుతూ.

“నీకూ ఆయన చాదస్తం బాగా వంటబట్టింది! ఆయన ప్రతి మాటకు వత్తాసు పలకడం తప్ప, ఇంకేం తెలియదు. తొంభై దాటింది, మంచం మీదనుంచి లేవలేదు. కాసేపు స్మారకంలో ఉంటాడు, కాసేపు అదీ లేదు... ఇంకా దాన్ని పూసుకు పడుకోవాలా?” అంటూ బయిటకు వెళ్ళాడు గాని, తేలేదు.

ఆ రోజు సాయంత్రమే ఆ సెంటు అలవాటు చేసిన మిత్రుడు, వాకర్ సాయంతో రామ్మూర్తిని చూడటానికి వచ్చాడు.

మాటల మధ్యలో, మంచంమీద దిండు పక్కగా ఉన్న ఖాళీసీసాను చూస్తూనే, “ఇంకొకటి తెప్పించుకోకపోయినావా?” అన్నాడు.

“ఎందుకురా నా చివరిక్షణాలకు అందులో ఉన్న రెండుబొట్లు చాలవా?” అన్నాడు పేలవపు నవ్వుతో.

ఆ మాటకు అతడు బాగా చీవాట్లుపెట్టాడు.

మళ్ళీ తర్వాత ఆయన కొడుకును అడగలేదు. తల్లి గుర్తుచేయలేదు. ఆ పైన ఎక్కువకాలం స్మృతిలోనే లేడు.

★★★

ఆసుపత్రికి వెళుతున్న సూర్యంతో, తల్లి అన్నది. “వీలుంటే సెంటు సీసా తీసుకురారా!”

“ఇంత పొద్దున్నే కొట్లెక్కడ తెరుస్తారు?” విసుగుకుంటూ వెళ్ళిపోయాడు.

రామ్మూర్తి విగతశరీరాన్ని ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకువచ్చేటప్పటికీ తొమ్మిది దాటింది.

అప్పటికే చాలామంది వచ్చారు. ఆయన్ను చివరిసారిగా చూసేటందుకు! అపరకర్మ చేసే పురోహితుడు వచ్చాడు. కావలసిన సామాగ్రి వచ్చింది. పాడె తయారు చేస్తున్నారు.

అంబులెన్స్ వాకిట్లో ఆగటంతోనే, వరండాలో కూర్చుని ఉన్న ఆయన భార్య ఘొల్లుమన్నది. పక్కనే ఉన్న కూతురు, ఆమె భుజం మీద చేయివేసి, ‘ఊరుకో... ఊరుకో’ అన్నట్లుగా తడుతున్నది.

రామ్మూర్తి పార్థివశరీరాన్ని తీసుకువచ్చి వరండాలో పడుకోబెట్టారు.

సూర్యం దొడ్లో బావి దగ్గరకు వెళ్ళాడు స్నానం చేసేటందుకు.

అగ్నిని వెలిగించి, శవానికి స్నానం చేయించారు. పాడెమీద పడుకోబెట్టి విబూది పెట్టారు. వచ్చినవాళ్లలో చాలామంది దండలు వేసి, పూలు జల్లి, ఆయన మీద తమకున్న గౌరవాన్ని వెలిబుచ్చుకుంటున్నారు.

శవాన్ని స్వర్గధామానికి తీసుకువెళ్లే వాహనం వచ్చి ఇంటికి కాస్తంత దూరంలో ఆగింది.

ఆయన భార్య ఏడుపే... ఉండి ఉండి తీతువు పిట్ట అరుపులా వినబడుతోంది. అక్కడ కార్యక్రమాలన్నీ పూర్తి అవ్వటంతో, శవవాహకులు శవాన్ని పైకి ఎత్తుతుంటే ఆమె ఇక ఆపుకోలేనట్లుగా ఘొల్లుమన్నది. తోటి ఆడవాళ్లు ఎంతగా పట్టుకున్నా, ఆమెను అదుపు చేయలేక పోతున్నారు.

సూర్యం అటిక పట్టుకు ముందు నడుస్తుండగా, శవం గేటు దాటింది. అందరూ బయటకు వచ్చారు. వాహనాన్ని కాస్త వెనక్కి తీసుకుని వస్తుండగా ఆయన శిష్యులు వచ్చి, “మాస్టార్ని వాహనంలో తీసుకు వెళ్లటమేమిటండి... ఇంతమందిమి మేము ఉండగా స్మశానం దాకా మోయలేమా?” అంటూ అడ్డుపడ్డారు.

“ఇక్కడికి చాలా దూరం ఉన్నది కదా... మోయటం కష్టం!” సూర్యం అన్నాడు.

“ఎంత దూరమైనా మా భుజాలమీదే తీసుకువెళ్తాం!” స్పష్టంగా చెప్పారు.

★★★

వారి ఇంటికి కిలోమీటరు దూరంలో పచ్చటిచెట్ల నడుమ వనంలా ఉన్న స్వర్గధామానికి, శిష్యులు చేతులు మార్చుకుంటూ, నారాయణుని స్మరిస్తూ మాస్టారి శవాన్ని తీసుకు వచ్చారు. దింపుడు కళ్లం దగ్గర దింపితే, ముందే స్కూటర్ మీద వచ్చి ఉన్న పురోహితుడు, సూర్యానికి దర్భ ఇచ్చి, “నాన్నగారి చెవిలో 'నారాయణ నారాయణ' అని మూడుసార్లు అనండి!” అని చెప్పాడు.

సూర్యం తండ్రి చెవిలో ఆ మాట చెప్పగానే, మరల ఆయన శిష్యులే ఆ శరీరాన్ని పాడెమీద ఎక్కించి తయారుగా ఉన్న చితి దగ్గరకు తీసుకు వెళ్లి, దానిమీద పడుకోబెట్టారు.

కాటికాపరి వంటిన ఉన్న గుడ్డలు తీసివేసాడు. మొలత్రాడు తెంపివేసాడు. విప్పిన ధోవతి పక్కన పడేయబోతుండగా, దాని అంచుకి ఏదో కట్టి ఉన్నట్లు కనబడింది. ఏమిటా అన్నట్లుగా విప్పి చూస్తే చిన్న సీసా.

“సారూ! ధోవతికి ఏదో సీసా కట్టి ఉన్నది!” అన్నాడు కాటికాపరి సూర్యానికి చూపిస్తూ.

అది సెంటు సీసా!

దాన్ని చూస్తూనే, ‘స్మశానానికి కూడా జాగ్రత్తగా తనతోపాటు తెచ్చుకున్నాడన్నమాట’ అని అసహనంగా అనుకుంటూ, “అవతల చెత్తలో పారెయ్” అన్నాడు విసురుగా.

ఎవరో నీళ్లకుండ తెచ్చి భుజాన పెట్టారు.

“మూడుసార్లు చితి చుట్టూ తిరగండి!” అన్నాడు పురోహితుడు సూర్యం వెనుక నిలబడి.

సూర్యం చిన్నగా భుజాన ఉన్న ఆ ఘటాన్ని పట్టుకుని అడుగులు వేస్తున్నాడు. చుట్టూ తిరగడం పూర్తవ్వగానే, ప్రతిసారీ కొడవలితో ఆ కుండకు చిన్న చిల్లి పెడుతుంటే, నీరు ధారగా క్రిందకు కారసాగింది.

తర్వాత సూర్యం చితి చివర నిలబడగా పురోహితుడు, “మీరు చితికి నిప్పంటించి భుజాన ఉన్న కుండను జారవిడిచి, వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు వెళ్ళిపొండి!” చివర కాలుతూ కణకణ లాడుతున్న కర్రను చేతికి ఇచ్చి పక్కకు తప్పుకున్నాడు.

సూర్యం తండ్రి రూపాన్ని తలచుకుంటూ, కొరివిని అందుకుని, బాధతో చితికి అంటించాడు. కానీ అందరూ ఆశ్చర్యపోయేలా చితికి నిప్పు అంటుకోక పోగా... కాలుతున్న కొరివి ఆరిపోయి పొగరాసాగింది.

"తడిసిన కర్రా ఏమిటి... కాస్త కిరసనాయిలు ఎక్కువ పోసి వెలిగించు!" అన్నాడు పురోహితుడు కాటికాపరితో.

"పొడిదే సార్... కిరసనాయిలు కూడా ఎక్కువే పోశాను!" అంటూనే మళ్ళీ పోసి వెలిగించాడు.

సూర్యం దాన్ని చితికి అంటిస్తే ఈసారీ అంటుకోక పోగా, కొరివీ ఆరిపోయింది.

"ఏమైంది... ఇలా అవ్వటం నేనెక్కడా చూడలేదు. చితిలో అది పెట్టేచోట కాస్త కర్పూరమన్నా పడేయ్, లేదా బాగా కిరసనాయిల్ అన్నా పోయి!" అన్నాడు అరుస్తున్నట్లుగా కాటికాపరితో.

"చాలా పోసాను సారూ...' అని నసుగుతూ రెండుచోట్లా కిరసనాయిలు పోసి, కొరివిని ముట్టించి ఇచ్చాడు సూర్యానికి అతడు.

కానీ మళ్ళీ ముందు అయినట్లే అవ్వటంతో, పురోహితుడు సూర్యం దగ్గరకి వచ్చి, "మీ నాన్నగారికి తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా? ఉంటే తీరుస్తానని దణ్ణం పెట్టుకో!" అని చిన్నగా చెప్పాడు.

"ఆయనకేం తీరని కోరికలు ఉంటయ్యండి.. ఇంట్లో అందరమెంతో ఆప్యాయంగా, గౌరవంగా చూసుకున్నాం!" అంటూ ఆలోచనలో పడ్డాడు సూర్యం.

అప్పుడు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది.. ఆయన కొద్ది రోజుల క్రితం స్మారకంలో ఉండగా సెంటుసీసా తెమ్మంటే, తాను చిరాకుపడటం... ఆపైన ఇప్పటికిప్పుడు ఆయన ధోవతికి కట్టుకు తెచ్చుకున్న పాతసీసాను కూడా తాను పారవేయించటం...

అవాక్కయ్యాడు. ఇంత చిన్నదానికే తనను కించపరుస్తాడా... చితి వెలగకుండా చేస్తాడా... ఎంతో మంచి మనిషిగా పేరు తెచ్చుకున్న ఆయన ఇలా ప్రవర్తిస్తాడా అందునా చచ్చి...

కాటికాపరి వైపుకు తిరిగి "ఆయన ధోవతికి చిన్నసీసా ఉన్నదంటివి కదా దాన్ని ఇటు ఇవ్వు!" అన్నాడు ఆలస్యం చేయకుండా. అదే కారణమైతే ఈసారి చితి అంటుకోవాలి.. లేదా ఇంకా వేరే ఏమైనా కోరికలు ఉంటే అమ్మే చెప్పగలగాలి!

"మీరు పారేయమన్నారు కదా అని, మా పిల్లాడికిచ్చి చెత్తకుప్పలో పడేయమన్నాను. చిన్నసీసా కదా దాంట్లో నుంచి వెతికి తీయాలంటే కష్టమవుతుంది సార్!" దూరంగా నిలువెత్తు చెత్తకుప్పను చూపిస్తూ అన్నాడు అతడు.

సరిగ్గా అప్పుడే అక్కడకు ఓ స్కూటరు వచ్చి ఆగింది. దాని మీద నుండి ఓ లావుపాటి మనిషి దిగాడు.

"హమ్మయ్య! ఇంకా ముట్టించలేదు గదా!" అంటూ చితి దగ్గరకు రొప్పుతూ వచ్చి నమస్కరిస్తూ, "గుడిసెల్లో పెరుగుతున్న నన్ను చేరదీసి, చదువుబిక్ష పెట్టి, నాలుగు పడకగదుల ఇంట్లో అన్ని సుఖాలు అనుభవించేలా ఇంతటివాడిని చేశారు. ఎంత మొత్తుకున్నా పైసా తీసుకోలేదు. ఇక ఇప్పుడైనా కాదనరనే ధైర్యంతో, మీకెంతో ఇష్టమైన సెంటు కొనుక్కొచ్చాను!" అంటూ చేతిలోని సీసా మూత తీసి చితిమీద చల్లాడు.

సూర్యం అతడి మాటలు వింటూనే తల్లడిల్లిపోయాడు.

ఈసారైనా చితికి నిప్పు అంటుకుంటుందేమో అనే ఆశతో, వెలిగించి ఇచ్చిన కొరివిని చితిలో పెడుతుండగానే ఒక్కసారిగా భగభగ మంటూ పేర్చిన కట్టెల నుండి మంటలు మాస్టారుని తన ఒడిలోకి తీసుకుంటున్నట్లుగా పైకి లేచినాయి.

కుంచించుకు పోయాడు సూర్యం. కన్నకొడుకైన తనే, తండ్రి మనసును గ్రహించలేక పోయాడు. అమ్మ చెప్పినా నిర్లక్ష్యం చేశాడు. కానీ ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థి... ఆయన మనసును గ్రహించినట్లుగా, సరిగ్గా సమయానికి వచ్చి, మరణించిన ఆయనలో తృప్తిని నింపి, స్వర్గద్వారాలు తెరిపించాడు

అక్కడున్న అందరూ విచిత్రంగా మండుతున్న చితి వంక చూస్తుంటే, సూర్యం తడిసిన కళ్ళతో తండ్రి శిష్యుడిని చూస్తూ నమస్కరిస్తున్నాడు. నాసిక పక్కగా జలజలా కారుతున్న అశ్రువులు.. సెంటు పరిమళంతో మనస్సును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు అనిపించగా వేదనతో కుంచించుకుపోయాడు.

# పొగడ్తల పులి

సాయి కమల్
✆ 93914 47562

బాల కథ

***"ఎంత డబ్బు ఖర్చయినా ఫరవాలేదు. వెంటనే మీ వైద్యం మొదలు పెట్టండి" అంటూ కోశాధికారి ఎలుగుబంటికి సైగ చేసి, నక్కకు డబ్బు ఏర్పాట్లు చేయమంది.***
***డబ్బు మొత్తం మూట కట్టుకుని, ఎవరికి తెలియకుండా దూరంగా ఒక మర్రిచెట్టు తొర్రలో దాచి, తిరిగి తన నివాసానికి వచ్చింది. ఏదో పసరుమందు తయారుచేసి పులికి తీసుకెళ్ళింది.***

ఒక పులికి పొగడ్తలంటే చాలా ఇష్టం. తన గురించి ఎవరన్నా మంచిగా పొగిడితే ఎంతో సంతోషించేది. ఆ వెంటనే ఆలోచించకుండా చేతికందిన కానుకలు వారికిచ్చేది. నక్కకు ఈ విషయం తెలిసింది. వెంటనే పులి దగ్గరకు వచ్చింది. దాని దగ్గర ఆశ్రమం సులభంగానే లభించింది.

"రాజా! నేను పక్క అడవిలో ఉండే వైద్యుడ్ని! మా రాజుగారు మీలాగా మంచివారు కాదు. మీ అంతటి అందగాడు కాదు. మీ అంతటి శక్తివంతుడు కాదు. అతడు పేరుకు మాత్రమే రాజు! మీ రాజ్యంలో నాకింత చోటు కల్పిస్తే, ఇక్కడే నలుగురికీ వైద్యం చేసుకుంటూ కాలం గడుపుదాం అనుకుంటున్నాను!" అంది నక్క

ఆ మాటకు పులి సంతోషించింది. "నా రాజ్యంలో చోటని వచ్చావు. కానీ నీకు నా ఆస్థానంలోనే రాజవైద్యుడిగా స్థానం ఇస్తున్నాను. ఈ రోజు నుండి నువ్వు మా రాజవైద్యుడివి. ఇక్కడే మీకు అన్ని వసతులు కల్పిస్తున్నాము!" అంది పులి.

జిత్తులమారి నక్కతో, పులికి త్వరగానే స్నేహం కుదిరింది.

ప్రతీరోజు నక్క ఏదోరకంగా నలుగురి ముందు పొగిడేది. ఆనందం పట్టలేక... పులి ఏదో ఒక కానుక నక్కకు ఇస్తుండేది.

ఇదంతా గమనిస్తున్న మంత్రి ఏనుగుకు, పులి పద్ధతి నచ్చలేదు. ఆ మాటే పులితో చెప్పింది. ఏనుగు మాటలు పులి పట్టించుకోలేదు.

ఒక రోజు పులికి విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. వెంటనే రాజవైద్యుడు నక్కకు కబురు పంపింది. నక్క హుటాహుటిన రాజుగారిని చేరుకుని చెయ్యి పట్టి నాడి పరీక్షించింది.

"రాజా! తమకు కడుపులో గడ్డ అయింది. దాన్ని కరిగించాలంటే చాలా డబ్బు ఖర్చవుతుంది" అంది నక్క.

"ఎంతడబ్బు ఖర్చయినా ఫరవాలేదు. వెంటనే మీ వైద్యం మొదలుపెట్టండి" అంటూ కోశాధికారి ఎలుగుబంటికి సైగ చేసి, నక్కకు డబ్బు ఏర్పాట్లు చేయమంది.

డబ్బు మొత్తం మూట కట్టుకుని, ఎవరికి తెలియకుండా దూరంగా ఒక మర్రిచెట్టు తొర్రలో దాచి, తిరిగి తన నివాసానికి వచ్చింది. ఏదో పసరుమందు తయారుచేసి పులికి తీసుకెళ్ళింది.



ఆ మందు పులి తాగింది. వెంటనే తన కడుపునొప్పి తగ్గింది.

"రాజా! మీకోసం నదికి అవతలి ఒడ్డున ఉండే నాకు తెలిసిన సాధువుకు డబ్బిచ్చి, మూలికలు కొని ఈ మందు తయారుచేశాను" అంది నక్క,

పులి సంతోషించి, తన మెడలోని బంగారు హారాన్ని కానుకగా ఇచ్చింది.

ఏనుగు అదేరోజు రాత్రి పులిరాజుని, ఎలుగుబంటిని తీసుకొని మర్రిచెట్టు వద్దకు చేరుకున్నది. మర్రిచెట్టు తొర్రలో నగలు, వైద్యం కోసం ఇచ్చిన డబ్బుమూటను చూపించింది.

దూరంగా ఏదో అలికిడి అవుతున్న శబ్దం విని పులిరాజుని, ఎలుగుబంటిని దాక్కోమని సైగ చేసింది ఏనుగు. అక్కడికి చేరుకున్న నక్క... నగలు, డబ్బు మూటలను చూసుకుంది. “పిచ్చిమారాజు! పొగిడితే చాలు... ఒంటిమీది వస్త్రాలు కూడా తొలిచి ఇచ్చేస్తాడు” పైకే పెద్దగా అనుకుంటూ, వెకిలిగా నవ్వుకుంది నక్క.

అది చూసి, ఒక్కసారి నక్క ఎదురుగా వచ్చి, కోపంగా “ఒసేయ్! నీ జిత్తులు గూర్చి మంత్రి ఏనుగు హెచ్చరించినా వినలేదు. నన్ను మన్నించండి మంత్రి !” అంది పులి.

నక్క భయంతో వణికింది.

“నిజానికి నాకు ఏ కడుపునొప్పి లేదు. నీ నిజస్వరూపం తెలుసుకోడానికి, ఇలా నాటకం ఆడాము. జిత్తులమారి నక్కా! నీమాయ తెలిసింది. నీకు మా రాజ్యంలో స్థానం లేదు. తక్షణమే రాజ్యం వదిలి వెళ్ళిపో...” అని తరిమేసింది పులి.

ఇక ఎప్పుడూ పొగడ్తలకు లొంగిపోకుండా తనవారినే నమ్ముతూ మంచి రాజుగా పేరు తెచ్చుకుంది పులి!!

బాల కథ

# సోమశేఖరుని సాయం

వాధూలస

✆ 97015 22234

***"మీరిలా ముక్కూ మొఖం తెలియని ప్రతివాడికీ సాయం చేయటం నాకిష్టం లేదు" అంది భార్య. "చూడు... అనసూయా! గుమ్మడికాయ తొడిమ ఊడి చెడిపోనంత వరకే తాజాగా ఉంటుంది. అది తిన్నవారికి ఆరోగ్యాన్నిచ్చి మేలు చేస్తుంది. అలాగే ఆరోగ్యంగా ఉన్నంత వరకే... మనం సాటివారికి సాయం చేయగలం. ఇక గుమ్మడికాయలోని గింజలు తిరిగి మొలకెత్తినట్లు, ఆ తర్వాత మనం చేసిన మంచిపనులే నిలిచిపోతాయి!" అన్నాడు సోమశేఖరం.***

గానుగాపురంలో సోమశేఖరం అనే ధనవంతుడు ఉండేవాడు. ఆ ఊరిలో ఎవరికి డబ్బు అవసరమైనా సోమశేఖరం ముందుగా గుర్తొచ్చేవాడు. తాను కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత పేదవారికీ, సామాజిక కార్యక్రమాలకీ ఖర్చు చేసేవాడు.

కానీ, ఇలా సంపాదించిన డబ్బు ఇతరులకు సాయం చేయటం భార్య అనసూయకు యిష్టముండేది కాదు.

సోమశేఖరం ప్రతిరోజూ ఉదయాన్నే నిద్రలేచి, నడుచుకుంటూ ఊరు చుట్టి వచ్చేవాడు. నడక వలన శారీరక, మానసిక ఉల్లాసం, ఆరోగ్యం పొందటమే కాకుండా ఊరిలోని విషయాలు కూడా స్వయంగా తెలుసుకునేవాడు.

రంగడు ఆ ఊరిలో ఒక అనాథ యువకుడు. అతను ఊరి చివరి గుడిసెలో ఉండేవాడు. రంగడి గుడిసె మీద గుమ్మడితీగకు కాయలుండేవి. సోమశేఖరం ప్రతిరోజు గుమ్మడి పూలు, కాయలు గమనించేవాడు.

ఒకరోజు ఉదయం రంగడు "అయ్యా ! నేను ఎవరూ లేని అనాథను. ఇంతకాలం ఎవరు ఏ పని చెప్పినా చేసి, వారు పెట్టింది తిన్నాను. మీరు కొంతడబ్బు సాయం చేస్తే, మన ఊరిలో టీ కొట్టు పెట్టుకుంటాను!" అన్నాడు.

సోమశేఖరం ఒక్క నిమిషం రంగడిని పైనుంచి కిందకి చూసి "సరే! సాయంత్రం ఇంటికొచ్చి కనపడు!" అన్నాడు.

సాయంత్రం నెత్తిన గుమ్మడికాయ పెట్టుకుని సోమశేఖరం ఇంటికి వెళ్లాడు రంగడు.

సోమశేఖరం కొంత ధనాన్ని రంగడికి అందిస్తూ "కష్టపడి పని చేసేవారంటే నాకిష్టం. చిన్న వ్యాపారం చేసుకుని నీ కాళ్ల మీద, నీవు నిలబడతానంటున్నావు. అందుకే నీకు ఈ డబ్బు ఇస్తున్నాను!" అన్నాడు సోమశేఖరం.



రంగడు సంతోషంగా డబ్బు తీసుకుని "అయ్యా! రెండు మాసాల్లో మీ డబ్బు తిరిగి చెల్లిస్తాను" అంటూ, తాను తెచ్చిన గుమ్మడికాయను కానుకగా యిచ్చి వెళ్లాడు. పక్కనే ఉన్న భార్యను పిలిచి గుమ్మడికాయ ఇంట్లో పెట్టమన్నాడు.

"మీరిలా ముక్కూ మొఖం తెలియని ప్రతివాడికీ సాయం చేయటం నాకిష్టం లేదు" అంది భార్య. "చూడు.. అనసూయా! గుమ్మడికాయ తొడిమ ఊడి చెడిపోనంత వరకే తాజాగా ఉంటుంది. అది తిన్నవారికి ఆరోగ్యాన్నిచ్చి మేలు చేస్తుంది. అలాగే ఆరోగ్యంగా ఉన్నంత వరకే... మనం సాటివారికి సాయం చేయగలం. ఇక గుమ్మడికాయలోని గింజలు తిరిగి మొలకెత్తినట్లు, ఆ తర్వాత మనం చేసిన మంచిపనులే నిలిచిపోతాయి!" అన్నాడు సోమశేఖరం.

డబ్బు మన దగ్గర ఉన్నప్పుడు మాత్రమే పేదలకు సాయం చేయగలం. లేనప్పుడు ఎలాగూ చేయలేము. మనం చేసిన సాయం, నలుగురికీ స్ఫూర్తినిస్తుందని గ్రహించింది అనసూయ.

భర్తచేసే సాయంలోని పరమార్థం గ్రహించిన అనసూయ అనందంగా గుమ్మడికాయను ఇంట్లోకి తీసుకెళ్లింది. మరెప్పుడూ సోమశేఖరం ఇతరురకు సాయం చేస్తుంటే అడ్డు చెప్పలేదు.

# పాత్రలకి ప్రాణంవస్తే?

శ్రీ ద్విభాష్యం సూరీడు
✆ 8885168516

**విశిష్ట అతిథి కథ**

***"వద్దు వాసంతి! వద్దు! నన్నేమీచేయకు! అవతల పాపం, రాధ! నా కోసం నిరీక్షిస్తూ ఉంటుంది! నే కుర్చీలో కనిపించకపోతే దడుసుకుంటుంది. నన్ను వెళ్ళనియ్యి! సుఖంగా గడపొచ్చని, ఇద్దరమూ మొట్టమొదటిసారిగా ఇక్కడికి హనీమూన్‌కి వచ్చాము! నీకింత అన్యాయం జరుగుతుందని ఆనాడు నేననుకోలేదు! రాష్ట్రపతి యిచ్చిన బంగారు పతకం నాకు వద్దు. దాన్ని చూసి యిక మీదట నేనేమీ గర్వపడను. నన్ను వెళ్ళనియ్ వాసంతీ!"***

"అలా చూడు రాధా! అక్కడో సెలయేరు కనిపిస్తోంది కదూ? దానిపక్క ఓ పెద్ద బండ ఉంది చూడు! సమంగా దాని మీద కూర్చునే రాసాను నా మొట్టమొదటి కథ!" అంటూ రాధకు ఆ ప్రదేశాన్ని పరిచయం చేసాను, వేగంగా పోతున్న మా కారులో నుంచి!

"చుట్టూరా ఇంత మంచి ప్రకృతి సౌందర్యం ఉండబట్టే, ఆ కథ అంత బాగా వచ్చింది. ఇంతకీ, ఆ కథ రాయడంలో మీ గొప్పతనం ఏమీ లేదన్నమాట!" అంటూ నా భుజాన్ని పట్టుకోబోయి, ఎదురుగానున్న అద్దంలో నుంచి డ్రైవర్ చూసేస్తాడన్న భయంతో ఆగిపోయింది రాధ!


సమయం చిక్కిందని సంతోషిస్తూ, "అవునవును! ఏ గొప్పతనమూ నాలో లేదనే కాబోలు.. వరించి మరీ పెళ్ళాడేవు నన్ను!" అనేసాను రాధ చెయ్యి గట్టిగా నొక్కుతూ.

"డ్రైవర్ వింటాడు! ఏంటంత చొరవా మీరూనూ?" అనే అర్థం స్ఫురించేలా, నాలుక కరుచుకుని ముక్కు మీద వేలేసుకుంటూ కళ్ళతో కోప్పడింది రాధ!

అటువైపు తిరిగి ఆకాశంలో కనిపించే మేఘాలను పరిశీలిస్తోంది. చుట్టూరా కనుపించే ప్రకృతి శోభను ఆస్వాదించడంలో కొద్ది క్షణాలు నిమగ్నులమయ్యాము.

మా కారు 'కొడైకెనాల్ ' సమీపిస్తోంది. ఎటువైపు చూచినా ఏదో ఒక అందమైన దృశ్యమే! నే చూసిన ఒక వింత అందాన్ని రాధకు చూపిద్దామని ఆమెను పిలిస్తే, ఆమె కనుగొన్న మరో దృశ్యాన్ని చూడమంటూ ఆమె నన్ను పిలిచేది. కన్నులకు విశ్రాంతి లేకుండా ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూస్తున్నాము.

నేనా ప్రాంతాల్లో ఉద్యోగం చేసే రోజులన్నీ జ్ఞాపకం వచ్చాయి. ఆ రోజుల్లో అక్కడున్న ముఖ్యమైన ప్రదేశాలన్నింటినీ నేను చూసేసాను. ఒక్కొక్క స్థలం, నాలో ఒక్కొక్క నూతన చైతన్యాన్ని కలిగించేది. ఆ ఉత్సాహంలో ఏవేవో కథలు రాసేవాడివి. ఉద్యోగరీత్యా ఆ ప్రదేశాన్ని వదిలి దూరంగా వెళ్ళవలసి వచ్చినప్పుడు చాలా బాధ పడ్డాను. ఆ ప్రాంతాలన్నీ మళ్ళా కళ్ళబడుతూంటే, ఆ కథలూ, ఆ కథల్లోని పాత్రలూ కళ్ళకు కట్టినట్లగుపిస్తున్నాయి. అన్ని కథలు రాయడానికీ, అన్ని బహుమతులు పొందగలగడానికి నా గొప్పతనం కంటే.. రాధ చెప్పినట్టు.. ఇచ్చటి ప్రకృతిమాత యిచ్చిన దోహదమే కారణమేమోననిపించింది!



కిటికీకానుకుని, ఆలోచనల్లో తేలుతూ అలా బయటకు చూస్తున్నాను, హాయిగా సాగిపోయే మా కారులో నుంచి వింత ఆకారంలో నున్న పెద్ద మామిడి చెట్టొకటి అర ఫర్లాంగు దూరంలో కనిపించింది. ఆ చెట్టు క్రింద కూర్చొగానే, నే రాసిన కథ ఒకటి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఒక్క క్షణం పాటు నన్ను నేను మరిచాను. ఏదో నూతనానుభవం! అది ఎలాంటిదో చెప్పలేను. ఆ కథలోని నాయిక, సరోజ (ఆమె రూపం బహుశా నాకొక్కడికే తెలుసు) వయ్యారంగా రెండడుగులేసి, ఆ చెట్టు క్రింద నుండి మా వైపు వస్తున్నట్లయింది. తేరిపారి అటు వైపు చూసాను. సరోజ అక్కడ ఆగి, చిరునవ్వు నవ్వుతూ వంగి నాకు నమస్కరించింది. ఆనాడు ఆమెను నే వర్ణించిన దాని కంటె, అందంగా మెరుగు పెట్టిన బంగారంలా

తళతళలాడుతూ కనిపించిన ఆ రూపాన్ని వింతగా చూసి చిన్నగా నవ్వాను. చెట్టు నుండి మా కారు దూరంగా వచ్చేయడం సహించలేక, అప్రయత్నంగా, కిటికీలో నుండి బుర్ర దూర్చి వెనక్కు తిరిగి చూసాను.

"స్వామి.. ఏమా వింత? మీ మందహాసంబున కేమి కారణంబు?' అంటూ హేళనగా అడిగేసింది రాధ, నా భుజం పట్టుకొని, బుర్రని కారులోకి తీస్తూ! ఒక్కసారిగా షాక్ తిన్నట్లయింది నాకు. కారులో వెళ్తున్నట్టు గాని, ప్రక్కన రాధ ఉన్నట్టు గాని ఒక్క క్షణం క్రితం నాకు తెలీదు!

రాధని విదుల్చుకుని మళ్ళీ ఆ చెట్టు వైపు చూసాను. సరోజ కనిపించలేదు. మనసదోలాగయింది. ఆ అనుభవం ఏదో చాలా కొత్తగా కనిపించింది. నే జూసిన సరోజ కేవలం ఊహాగానాల్లో కనిపించే వ్యక్తుల్లా కాకుండా, చాలా సహజంగా, చాలా నిజంగా, నా ఎదురుగా ఉన్నట్లే కనిపించింది. 'సరోజ' బహుశా ఇక్కడ నివసిస్తూందేమో అనుకున్నాను చాలా యథాలాపంగా!

'అదెలా సాధ్యం?' అని నా మనసడుగనూ లేదు, దానికి సమాధానమివ్వడానికి నే యాతన పడనూ లేదు!

రాధ నా సమాధానం కోసం ఎదురు చూస్తోంది. ఏంజెప్పాలో తెలీలేదు. ఎంత మరచిపోదామనుకున్నా ఆ సంఘటన జ్ఞాపకం వస్తోంది. నే సృష్టించిన పాత్ర నిజంగానే ఓ రూపం దాల్చి, ఇక్కడ నివసిస్తుందేమో అనే ఓ కొత్త ఆలోచన తట్టింది. గుండెలు గతుక్కుమన్నాయి. మరీ దూరంగా పోయిన ఆ మామిడిచెట్టు వైపు మరోసారి చూసాను. నాలో ఏదో కలవరం బయల్దేరింది.

నా ముఖకవళికల్లో మార్పు గ్రహించిన రాధ, "ఇంతవరకూ బాగానే ఉన్నారు, ఇంతట్లో ఏమయింది? ఏదైనా చూసి భయపడ్డారా?" అనేసింది.

అద్దంలో కనిపించిన నా ముఖం చూసుకుని నేనే ఆశ్చర్యపోయాను! ఒక్క క్షణంలో ఏమిటీ మార్పు? చెప్పలేని నీరసం ఏదో నన్నావరించింది. కారొకసారి ఆపమన్నాను. 'ఎందుకూ?' అని నా చెయ్యి పట్టుకున్న రాధను కూడా నాతో పాటు క్రిందకు దింపాను. ఆ మామిడిచెట్టు వైపు మరోసారి చూసాను. ఏమీ కనిపించలేదు. కారెక్కి, డ్రైవర్‌ని వచ్చిన దారమ్మటే, మళ్ళీ కొంత దూరం వెళ్ళమని అడిగాను. కారు ఆ మామిడిచెట్టు వైపు వెళ్తోంది. పరీక్షగా అటు వైపు చూసాను.

"చెట్టు కింద ఎవరైనా ఉన్నట్టు నీకు తెలుస్తోందా రాధా?" అనడిగాను, కారాపుచేయిస్తూ!

"లేదే! ఏమి తెలియడం లేదే" అంది రాధ వింతగా!

నాకు కూడా ఏమీ కనిపించలేదు. నాలో పట్టుకున్న అనుమానం కాస్తా వదిలిపోయింది. మనసు ధైర్యపడింది.

"సారీ రాధా! అక్కడెవరో ఉన్నట్టయింది.. ఇందాకా మనం ఈ దారిన వెళ్ళినప్పుడు. ఎవరో కాదు సరోజ కనిపించినట్లయింది. అందుకే వెనక్కు తీసుకొచ్చాను!" అంటూ రాధను కార్లో కూర్చోబెట్టాను.

సరోజ ఎవరో రాధకు మొదట్లో అర్థం కాక తికమకపడింది. నాకు కలిగిన ఆ వింత అనుభూతి విని పకపకా నవ్వేసింది. "నే పక్కనుండగా రోజాల మీదికీ, సరోజాల మీదకి ఎందుకండీ మీ మనసు!" అనేసింది తేలిగ్గా! "పోనీ, మీకలా అనిపిస్తే

మాత్రం ఆ ఆలోచనకంత ప్రాధాన్యత ఇచ్చి, కారు వెనక్కు తీసుకురావడం భలే బావుంది. అయినా ఒక కథలో పాత్ర నివసించడమేమిటండీ, మీ పిచ్చిగానీ?" రాధ పకపకా నవ్వుతోంది.

సిగ్గుపడి పోయాను. నే చేసిన పని నాకే చిరాగ్గా తోచింది, 'ఒకవేళ సరోజ జ్ఞాపకం వస్తే వచ్చింది. ఆమె నిజంగా అక్కడ ఉంటుందని భ్రమపడి, కారును వెనక్కు తీసికెళ్ళమనడం – ఛ – చాలా సిల్లీగా ఉంది!' అని నాలో నేనే తిట్టుకున్నాను.

ఆ ఆలోచనలు మరచిపోడానికి ఎంతోసేపు పట్టలేదు! నా మనసు కొంచెం పాడయిందని తేలిగ్గా పసిగట్టిన రాధ.. నన్ను ఉత్సాహ పరచడానికి కొంత శ్రమ తీసుకుంది. కొద్ది క్షణాల్లోనే ఆ వింత సంఘటనని మరచిపోయి. ప్రకృతిసౌందర్యాన్ని వింతవింత దృశ్యాల్ని చూడడంలోనూ, ఆనందించడంలోనూ, నిమగ్నులమయ్యాము. వంకరటింకర రోడ్లన్నీ దాటుకుని. మధ్యాహ్నం ఒంటిగంటయ్యేసరికల్లా కొడైకెనాల్‌లో మా లాడ్జికి చేరుకున్నాం.

వరుసగా ఆరుగంటలు ప్రయాణం చేసి రావడంతో ఒళ్ళంతా బడలికగా ఉంది. భోంచేసి పడుకున్నాము.

★★★

సాయంత్రం నాలుగంటలు కాకుండానే రాధకి మెలకువ వచ్చేసి, నన్ను కూడా లేపేసేసింది. నాకింకా నిద్రమత్తు వదల్లేదు. బద్ధకంగా లేచి పడక్కుర్చీలో కూర్చున్నాను.

"అలా ఊరు చూడ్డానికి వెళ్దామన్నారుగా? అప్పుడే నాలుగయింది. మరి తయారవండి!" అంటూ రాధ నాకు బాగా మెలకువ తెప్పించడానికి ప్రయత్నించింది.

"నీ ముస్తాబింకా అవ్వలేదుగా! అప్పుడే నన్నెందుకు లేపేసావు?" అంటూ కుర్చీలో తాపీగా పడుక్కున్నాను.

"ఈ పేంటు బాగానే ఉందిలెండి. ఈ స్లాకు వేసుకోండి.. దాని మీదకి బాగా మేచవుతుంది. నా టాయిలెట్ ఎంత, జస్ట్ టెన్ మినిట్స్!" అంటూ, ఓ స్లాక్‌షర్ట్ నా ఒళ్ళో పడేసి, 'టాయిలెట్'లోకి దారితీసింది రాధ.

నా రాధ టాయిలెట్ – స్నానంతో మొదలవుతుంది. ఆమె ముస్తాబయి రాడానికి అధమం ఓ అరగంటయినా పడుతుంది. 'థేంక్ గాడ్! నిద్రపోడానికింకా ఓ అరగంట టైముంది!' అనుకుంటూ తాపీగా పడుకున్నాను.

బాల్కనీలో నుంచి చల్లని గాలి వీస్తోంది. ప్రాణానికెంతో హాయిగా ఉంది. ఇంక నిద్ర వచ్చేటట్టులేదు. అయినా, అలాగే సుఖంగా పడుక్కోవాలనిపించింది. చల్లని ఆ పిల్లవాయువులు నన్ను తగల్దంతో, నా వళ్ళు నేను మరిచిపోయిన ఆ క్షణంలో...

తలుపు తెరచుకొని ఎవరో లోపలికి వచ్చారు. ఆ అలికిడి విని ఎవరోనని అటువైపు చూసాను. ఎవరో కాదు... రాధిక!

"అరే, ఎన్నాళ్ళకు మళ్ళీ నిన్ను చూడగలిగేను రాధికా!" అనుకుంటూ వింతగా ఆమె వైపు చూసాను.

మౌనంగా గుమ్మం దగ్గర నిలబడ్డ రాధిక చిన్నగా నవ్వింది. చక్కని పట్టుచీరలో పెళ్ళికూతురు ముస్తాబుతోనున్న రాధిక, "ఇలా రండి, ఓ చిన్నమాట!' అనిపించేటట్లు సంజ్ఞ చేస్తూ, మాట్లాడకుండానే నన్నాహ్వానించింది, 'రాధ చూస్తే బావుండదని అనుకుంటూ ఓ మాటు బాత్‌రూమ్ వైపు చూసి, రాధ ఇంకా రాదని ధైర్యం తెచ్చుకుని, ఒళ్ళో ఉన్న స్లాక్‌షర్ట్ అప్రయత్నంగానే

తొడిగేసుకుని, మెల్లిగా లేచి గుమ్మం దగ్గరకెళ్ళాను. ఏమీ మాట్లాడకుండానే రాధిక నన్ను నడిపిస్తోంది. ఏదో మంత్రించబడ్డవాణ్ణిలా, ఎందుకో ఎక్కడికో కూడా అడక్కుండానే ఆమె వెంట నడిచేస్తున్నాను. ఎదురుగానున్న ఒక చక్కని పూలతోటలోకి తీసికెళ్ళింది రాధిక. ఆ పూలతోటతో నాకు పరిచయమున్నట్లు జ్ఞాపకం వచ్చింది. నా జ్ఞాపకం ప్రకారం అటువారగా ఒక సిమ్మెంటు సోఫాలాంటిది ఉండాలి? అది అక్కడుంది. రాధిక నన్నక్కడికి తీసికెళ్ళింది. సోఫాలో కూర్చోమని చూపించింది. అయోమయంగా కూర్చుని రెప్పవాల్చకుండా ఆమె వైపు చూస్తున్నాను. ఆమెనెలా పలకరించాలో అర్థం కాలేదు.

తన చక్కని కంఠం విప్పింది రాధిక, "ఇలా చూడండి మోహన్! నన్ను చూస్తే మీకు కొంత జాలేయడం లేదూ? అందంగా ఇన్ని కోరికలతో నన్ను సృష్టించారు. ఓ చక్కని అబ్బాయిని చూపించి ప్రేమించమన్నారు. తీరా నేనతన్ని ప్రేమించి, పెళ్ళాడుదామనుకున్న సందర్భంలో, బాల్యావస్థలోనే భర్తను పోగొట్టుకున్న నిర్భాగ్యురాలిని నేనని, అందరికీ చెప్పి, నన్నూ మిమ్మల్ని అందరూ మెచ్చుకుంటారు అని, నే ప్రేమించినవాణ్ణి నాకు కాకుండా చేసేసారు. ఈ పెళ్ళి దుస్తుల్లోనే, ఇలాగే నన్ను జీవితాంతం ఉండిపొమ్మని నాకు శిక్ష విధించారు. నాకు మరో పెళ్ళి కావడం మీకిష్టం లేకపోతే, కనీసం ఆనాడే నన్ను కూడా చంపేయాల్సింది. ఈ పూలతోటలోనే నన్ను సృష్టించి, ఇక్కడే నాకిన్ని కోరికలు కల్పించి, ఇక్కడే నాకీ గతి కల్పించారు! నా పాతివ్రత్యానికి ఏ భంగమూ రాకుండా ఉండాలని మీ ఆశ అయితే, సునాయాసంగా ఏ విషమో పెట్టి, నన్నారోజునే మీరు చంపవలసింది. అందాన్నీ, వయసునీ, అన్నింటినీ ఇచ్చి, ఇలాగే ఉండిపొమ్మని కఠినశిక్ష విధించారు! నా పరిస్థితి చూస్తే, మీకు ఏడుపు రావడం లేదూ?" అంది రాధిక! ఆమె కనుకొలకుల నుండి రెండుమూడు కన్నీటి బిందువులు రాలాయి.

రాధిక చెప్పింది అక్షరాల నిజం! ఆమెను చూస్తే నాకే ఏడుపొచ్చింది. ఆనాడామెను అలా చేసాను గనకే, నేనొక ప్రఖ్యాత రచయితనని ప్రజలందరూ తెలుసుకున్నారు. అందరూ నాకు భరతం పట్టారు!

ఆమెకెలా సమాధానమివ్వాలో అర్థంకాలేదు. తడిసిపోయిన కళ్ళను మాత్రం తుడుచుకుంటూ అయోమయంగా ఆమె వైపు చూస్తున్నాను.

"జరిగిందేదో జరిగింది. నాకు మీరు ప్రసాదించిన పవిత్రతను నేనలాగే కాపాడుకోడం కోసం నాకో ఉపకారం చెయ్యండి. ఈ పిస్టల్‌తో నన్ను పేల్చి చంపేయండి. చిన్ననాటి నా భర్త ఎలాగుండేవారో చెప్పండి. ఆయన్ను తల్చుకుంటూ ఈ దేహాన్ని విడుస్తాను" అంటూ నా చేతిలో ఓ పిస్టల్ ఉంచింది రాధ.

నా చేతులు గజగజలాడాయి. "వద్దు! నేనీ పని చేయలేను. అయినా నువ్వు చస్తే ఎలా? నీలాటి వాళ్ళు ఈపాడు సంఘానికి ఉత్తమమైన పాఠాలు నేర్పాలనే నిన్నలా ఉంచేసాను. అయినా, ఇప్పుడు నాకీ గొడవంతా అనవసరం! నే వెళ్తాను, రాధ నాకోసం వెయిట్ చేస్తూంటుంది!" అంటూ ఆ పిస్టల్ అక్కడే పారేసి, గబగబా పూలతోట దాటుకుని మా లాడ్జి వైపు వచ్చేస్తున్నాను. వెనుక నుంచి ఏదో ఘోరమైన శబ్దం వినిపించింది. చూడడానికి భయమేసింది. గబగబా నడుచుకుంటూ అక్కడ నుంచి దూరంగా వచ్చేసాను.

మా లాడ్జి వైపు మళ్ళబోయే నన్ను.. మరోవైపు కొంచెం దూరంగా కనిపించిన ఒక స్త్రీ ఆకర్షించింది. ఆమెకు నలభై యేళ్లుండవచ్చు. వయసుకు తగని వయ్యారం ఒలకబోస్తూ, నన్ను చూసి, మందహాసంతో పమిట సర్దుకుంది. ఆశ్చర్యంగా

అటువైపు చూసాను. అప్రయత్నంగా నా కాళ్ళు అటువైపు నడిచాయి. చిరునవ్వుతో ఆమె నన్నాహ్వానించింది. అది తనుండే ఇల్లు లాగుంది, లోపలకు రమ్మని దారి చూపించింది. వెళ్లకూడదనుకుంటూనే.. లోపలికి అడుగు పెట్టాను.

ఆమె నాకెంతో గౌరవం చేసింది. "నీ దయవల్లనే కోరుకున్న వరుడికిచ్చి పెళ్ళి చేసావు. ఇప్పుడు మాకిద్దరు పిల్లలు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో అర్థంకాకుండా ఉంది. ఆయనలా బయటికి వెళ్ళారు. వీళ్ళే మా పిల్లలిద్దరూ!" అంటూ దబ్బపండులా మెరిసిపోతున్న తన పిల్లలిద్దర్నీ నా దగ్గరికి పంపించింది.

తృప్తిగా వాళ్ళను దగ్గరకు తీసుకున్నాను. ఒకసారి ఆమె వైపు చూసాను. మొట్టమొదటిసారిగా ఆమెను నే చూసినప్పుడు ఎంత వయ్యారం ఉందో.. అంత వయ్యారం ఆమెలో కనిపించింది. వయసుతో ఆమెకు సంబంధం లేదు. ఆమె కళాజీవి! కళలో పుట్టి, కళలో పెరిగింది. తన కళారూపాన్ని ఆస్వాదించే ఒక చక్కని నాయకుణ్ని ఏరుకుని పెళ్ళి చెయ్యమంది. అతను కూడా ఆమె కోరికకేమీ అడ్డుచెప్పకపోయేసరికి, ఆ ఇద్దరికీ పెళ్ళి చేసాను. అప్పుడే ఓ పదేళ్ళ కితం. అప్పుడు నాకు సమంగా ఇరవై ఏళ్లుండవచ్చు. ఈ కళాజీవులిద్దరిని సృష్టించి వారి కథ సుఖాంతం చేసాను. ట్రాజెడీ అంటేనే ఆ రోజుల్లో నాకు భయం. పైగా ఏ కథనైనా దుఃఖాంతం చెయ్యాలంటే చాలా బాధపడేవాణ్ని. పరమ సంతోషంతో ఆమె తన జీవితాన్ని గురించి చెప్పుకుపోతుంటే, వాళ్ళంత అదృష్టవంతులు ప్రపంచంలో మరెవ్వరూ లేనట్టనిపించింది!

అవతల రాధ మాట జ్ఞాపకం వచ్చి, కుర్చీలోంచి లేచి, "మరి నే వస్తాను!" అంటూ ఆమె నుండి సెలవు తీసుకున్నాను.

"వెళ్ళిరండి, మా ఇంటికి వచ్చినందుకు అనేక ధన్యవాదాలు!" అనేలా ఆమె నవ్వుతూ తన పిల్లలిద్దర్ని దగ్గరకు తీసుకుంది.

గడియారం చూసుకున్నాను. అప్పుడే రాధ స్నానం చేయడానికెళ్ళి పది నిముషాలు అయింది. మరో పది, పదిహేన్నిముషాల్లో టాయిలెట్ అయి వచ్చేస్తుంది. చప్పున నే లాడ్జి చేరుకోవాలి అనుకుంటూ, అటు వైపు నడుస్తున్నాను.

వీనులకు విందుగొలిపే వీణానాదం. ఎక్కడ నుంచో వచ్చి నా చెవుల్లో పడింది! తేరిపార అటూ ఇటూ కలయజూసాను. ఎదురుగానున్న పార్కులో, కొంచెం దూరంగా, ఆ ఎర్రరంగు పూలమొక్కల మధ్య 'కృష్ణారావు'! చక్కని గ్లాస్కో దుస్తుల్లో మిలమిలా మెరిసిపోతున్న కృష్ణారావు వీణ వాయించడం కనిపించి ఆశ్చర్యపోయాను! అతని కెదురుగా ఓ అయిదు గజాల దూరంలో అతని 'భామ' కన్నులకు మిరుమిట్లు గొలిపేలా చక్కగా నృత్యం చేస్తోంది! ఆమె వంటినిండా ఉన్న తళుకు, ఆమె ప్రతి కదలికనూ, ఆమెకొక కొత్త అందాన్నిస్తోంది. అనుకోకుండానే అటువైపు నడచాను. అతని వీణపాట, ఆమె నృత్యమూ, పరాకాష్ట నందుకున్న ఆ సమయంలో, మరీ దగ్గరగా వెళ్ళి చూడడం బావుండదని, ఓ ఇరవై గజాల దూరం నుంచి ఓ చెట్టు చాటుగా నిలబడి ఆనందంగా ఆ దృశ్యం చూస్తున్నాను. రెండు మూడు నిముషాలు కాకుండానే అతని పాట, ఆ 'భామ' నృత్యం కూడా ఆగిపోయాయి.

ఘల్లుఘల్లున గజ్జెల చప్పుడు చేసుకుంటూ, ఆమె నావైపు వస్తోంది. కృష్ణారావు ఆమెను అనుసరిస్తున్నాడు వీణ అక్కడే వదిలేసి! 'కొంపదీసి వాళ్ళు నన్నుచూడలేదుకదా!' అని భయపడుతూ, చెట్టు చాటుగా నక్కినక్కి నిలబడ్డాను. వాళ్ళిద్దరూ తిన్నగా నాదగ్గరకే వచ్చారు.

"ఫరవాలేదు. మీరు మమ్మల్ని చూసినందుకు మేమేమీ అనుకోలేదు. మిమ్మల్ని చూసిపోదామనే వచ్చాము. కులాసాగా ఉన్నారా? మీకిప్పుడు పెళ్ళయిందా? పిల్లలేవన్నానా?" మందస్మిత వదనంతో ఆ 'భామ' నాపై ప్రశ్నల వర్షం కురిపించింది.

చక్కని దుస్తుల్లో చక్కని విలాస పురుషుడిలా మెరిసిపోతున్న కృష్ణారావు చమత్కారంగా నవ్వుతూ, నా సమాధానం కోసం ఎదురుచూసాడు!

బదులు పలకకుండా ఉంటే బాగుండదనుకుని, "ఓ! బాగానే ఉన్నాను. 'రాధ' అనే ఓ చక్కని అమ్మాయిని ప్రేమించి పెళ్ళాడేను. లేదు.. ముందు రాధే నన్ను ప్రేమించిందనుకోండి. ఈ మధ్యనే మా పెళ్ళయింది. ఇప్పుడిద్దరం కలిసే వచ్చాం! ఎదురుగా కనిపిస్తోంది చూడండి.. ఓ పెద్ద మేడ, అదే మా లాడ్జి! రూమ్ నెంబర్ నాలుగులో ఉంటున్నాం. సాయంత్రం ఏడుగంటలకల్లా తిరిగి రూముకు వచ్చేస్తాం. తర్వాత ఏ నిమిషంలో మీరొచ్చినా, నా రాధని కలుసుకోవచ్చు. తప్పకుండా రండి. మీ కోసం మేమిద్దరం వెయిట్ చేస్తాం! మీకింకా, పిల్లా పీచూ ఏమీ బయల్దేరలేదా?" అనేసాను గబగబా !

సిగ్గుగా వాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూచుకున్నారు. వాళ్ళకు పిల్లాపీచు బయల్దేరకూడదని, జీవితాంతం వాళ్ళలాగే నిత్యనూతన వధూవరులుగా, నృత్యగానాల్లో తేలుతూ ఉండాలని ఆనాడు వాళ్ళను సృష్టించిననాడు నే కోరుకున్న కోరిక జ్ఞాపకం వచ్చి, నే వేసిన ప్రశ్నకి నన్ను నేనే మందలించుకున్నాను. వాళ్ళలాగే ఉన్నందుకు తృప్తిగా, ఆనందంగా వాళ్ళ వైపు చూసాను!

"తప్పక వస్తాము! సాయంత్రం ఈ ఏడున్నరకల్లా మీ లాడ్జికి వస్తాము. మరి సెలవా?' అంటూ వాళ్ళిద్దరూ సెలవు పుచ్చుకుని మళ్ళీ అటువైపు వెళ్ళిపోయారు. అతను ఒడిలోకి వీణ తీసుకున్నాడు. ఆమె కాలిగజ్జెలు సవరించుకుంటోంది! 'పరిపూర్ణ కళాజీవులు, అదృష్టవంతులు!' అనుకుంటూ, రాధ మాట జ్ఞాపకం వచ్చి వెంటనే మా లాడ్జి వైపు బయల్దేరాను.

చేతి గడియారం వైపు చూసుకున్నాను.. రాధ టాయిలెట్ చాలా వరకూ పూర్తయి ఉంటుంది. మరో అయిదు నిముషాల్లో పడకగదిలోకి వచ్చి, నాకోసం వెతుకుతుంది. ఆ లోపున నే వెళ్ళి, ఏవి ఎరగనివాడిలా, ఆ కుర్చీలో పడుక్కోవాలి! అనుకుంటూ వేగం హెచ్చించి మా లాడ్జివైపు నడుస్తున్నాను.

నా వెనక్కాలే ఎవరో వస్తున్నట్లయింది. వెనక్కు తిరిగి చూసాను. ఎవరూ కనిపించలేదు. ఎవరూ లేరని తెలుసుకుని మళ్ళీ నడుస్తున్నాను. ఎవరో నన్ననుసరిస్తున్నట్లు మళ్ళీ అనిపించి, చిరాగ్గా వెనుదిరిగి చూసాను. మళ్ళీ ఎవరూ కనిపించకపోయేసరికి నా అనుమానానికి నాలో నేనే కోప్పడి ముందుకు నడిచాను. ఈమాటు నిజంగానే ఎవరో నన్ను తరుముతున్నట్లయింది. అలాగే నిలబడి గట్టిగా వెనక్కి చూసాను. మసకగా, 'వాసంతి' రూపం నన్ను వెంటాడుతున్నట్లు తెలిసింది. గుండెలు గతుక్కుమన్నాయి! ఆమె రూపం నన్ను సమీపిస్తోంది. అయినా, ఆమె నా కళ్ళకి సమంగా కనిపించడం లేదు. సమంగా చూద్దామని నే చేసే ప్రయత్నంలో నా కళ్ళు నొప్పి పెడుతున్నాయి.

"హలో! మిస్టర్ మోహన్, నేనెవర్నో జ్ఞాపకం ఉందా?" అంది ఆమె కంఠం.

"జ్ఞాపకం లేకేమి! వాసంతివి! సమంగా నా కళ్ళకి కనిపించవేం? ఎందుకిలా తరుముకొస్తావు?" అన్నాను.

"దుర్మార్గుడా!" అంది ఆ రూపం కొంచెం కోపంగా. మరింత కోపంగా ఆమె వైపు చూసాను. ఆమె అంతతో ఆగలేదు. "సమంగా నేనెలా కనిపిస్తాననుకున్నావు? ఎన్నో తీరని కోరికలున్న యౌవనంలో, నీ కథాగమనం కోసమని.. నలుగురూ

నిన్ను మెచ్చుకుంటారని, నిష్కారణంగా నన్ను చంపేసావు. దెయ్యాన్నయి ఇలా మసులుతున్నాను. నాకింత అన్యాయం చెయ్యడం వల్ల నీకేమిటొచ్చింది?" అని నిలదీసి అడిగింది.

చప్పున లాడ్జికి వెళ్ళి పోదామంటే ఏమిటీ అడ్డంకులన్నీనని నా వొళ్ళు మండింది. 'మరే సమయమూ లేనట్టు ఈవిడ కూడ నాకిప్పుడే కనిపించాలా!' అనుకుంటూ, చాలా అలక్ష్యంగా ఆమెకు సమాధానమిచ్చాను. "ఏమిటొచ్చిందని ఇంకా మెల్లిగా అడుగుతావేం? నిన్ను చంపడంతోనే ఆ కథ యొక్క పవిత్రత అంతా నిలబడిందని ప్రజలందరూ నన్ను వేనోళ్ళ పొగిడేరు! సినిమా వాళ్ళు ఆ కథకి ఒక చక్కని రూపకల్పన చేసి లక్షలు సంపాదించుకున్నారు!! అంత మంచి కథ రాసినందుకు నాకు రాష్ట్రపతి బహుమానం కూడా ఇచ్చారు! ఇంతకంటే ఏం కావాలి?"

"అవున్లే! అంతే! నువ్వెంతో మంచివాడివనుకున్నాను మోహన్! అందరి రచయితల్లాంటి వాడివి కాదని, నాకు నీ దగ్గర చక్కని ఆదరణ లభిస్తుందని వెతుక్కుంటూ నీ కల్పనా ప్రపంచంలోకి వచ్చి నీకు దర్శనమిచ్చి, నిన్నాకర్షించాను. మొదట్లో నీవు నాకు చూపించిన మర్యాద, గౌరవం చూసి ఎంతో సంతోషించాను. సమంగా జ్ఞాపకం తెచ్చుకో! నన్ను చంపుదామనే ఉద్దేశం నీకు మొదట్లో ఏమాత్రమూ లేదు. నీవు రాస్తున్న నా కథని నీ స్నేహితుడికి చూపించావు. ఆ పాడు స్నేహితుడు నీకీ బుద్ధి కలిగించాడు. కామెడీ కంటె ట్రాజెడీకి వెయిటెక్కువుంటుందని, నన్ను చంపేస్తే నీకు పెద్ద భవిష్యత్తుంటుందని నిన్ను రెచ్చగొట్టాడు. వాడి మాటలకు లొంగి, ఎంతో భయపడుతూనే నీవీ పాపపు పనికి దారి తీసావు, చిన్నవయసులోనే నన్ను చంపేసావు! దెయ్యాన్నై ఇలా నేనింకా ఎంతకాలం ఉండాలి? మోహన్! ఇప్పుడు నువ్వు నా చేతుల్లో ఇరుక్కున్నావు. ఎలా వెళ్తావో నేనూ చూస్తాను. ఒక్క అడుగు ముందుకేసావో నీ భరతం పడ్తాను!" అంటూ జడిపించింది వాసంతి! నా ఒళ్ళంతా చెమటలు పోసాయి.

చేసేదిలేక, బ్రతిమాలుకోడం మొదలెట్టాను. "వద్దు వాసంతి! వద్దు! నన్నేమీచేయకు! అవతల పాపం, రాధ! నా కోసం నిరీక్షిస్తూ ఉంటుంది! నే కుర్చీలో కనిపించకపోతే దడుసుకుంటుంది. నన్ను వెళ్ళనియ్యి! సుఖంగా గడపొచ్చని, ఇద్దరమూ మొట్టమొదటిసారిగా ఇక్కడికి హనీమూన్‌కి వచ్చాము! నీకింత అన్యాయం జరుగుతుందని ఆనాడు నేననుకోలేదు! రాష్ట్రపతి యిచ్చిన బంగారు పతకం నాకు వద్దు. దాన్ని చూసి యిక మీదట నేనేమీ గర్వపడను. నన్ను వెళ్ళనియ్ వాసంతీ!" నా కళ్ళ నుండి నీళ్ళు కారుతున్నాయి.

వాసంతి నన్ను వెళ్ళనివ్వలేదు!

దగ్గరగా వచ్చేస్తోంది.

గట్టిగా నన్ను కావలించుకుంది!

హడలిపోయాను!

'రాధా' అంటూ బిగ్గరగా పిలుద్దామనుకున్నాను. నోటినుండి మాటరాలేదు! శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. 'రాధా! రాధా! రాధా!' అనడానికి. నా రాధ, నా పాలిటి రాధ నిజంగానే వచ్చి, ఆ వాసంతి కౌగిలి నుండి నన్ను రక్షించింది!!

భుజం మీద గట్టిగా తట్టి, "ఏమిటది మాటేమైనా పడిపోయిందా? ఏదీ మళ్ళీ పిలవండి 'రాధా' అని!' అంది పడకకుర్చీ పక్కన కూర్చుంటూ.

పడకకుర్చీలోకి నేనెలా వచ్చానో, ఎప్పుడొచ్చానో అర్థం కాలేదు. ఒళ్ళో రాధ పడేసిన స్లాకు షర్టు అక్కడే ఉంది. ఒంటినిండా చెమటలు! బుర్ర ఒక్కసారి విదిలించాను! జరిగిందంతా ఓ కలలాంటిదని తెలుసుకుని ధైర్యపడ్డాను. ఇది నిర్ధారణ చేసుకోడానికి 'రాధా' అని పిలిచాను. చాలా తేలిగ్గానే పిలవగలిగాను. నాకేం జరిగిందో అర్థంకాక, ఆయోమయంగా నావైపు చూసింది రాధ! రాధ నిజంగానే తన ముస్తాబు పూర్తి చేసుకుంది.

"నిద్రమత్తు ఇంకా వదల్లేనట్లుంది. వదల్చమంటారా?" అంటూ రెండు చేతులూ పట్టుకుని కుర్చీలోంచి నన్ను లేవదీసింది రాధ.

నే సృష్టించిన కళాజీవుల్ని నేనెలా చూడగలిగానో విన్న రాధ, మొదట్లో తేలిగ్గా నవ్వేసినా, నా వ్రాతలకూ నాకూ ఉన్న సంబంధం చూసి జాలిపడింది.

"అందుకే మీరు సృష్టించిన ప్రతి పాత్రలోనూ జీవం ఉట్టిపడుతుంది!' అంది నా రాధ.

"కృష్ణారావునూ, భామనూ నిజంగానే మీరు చూసారాండీ? వాళ్ళిద్దరు మనకులాగానే ఉన్నారా? లేకపోతే వేరుగా ఉన్నారా?" అని కూడా అడిగేసింది. నా కథలంటే రాధకెంతో యిష్టం.

తప్పక వస్తామన్న కృష్ణారావూ, భామల కోసం ఆ రాత్రి ఏడున్నరకి నేనెదురు చూడకపోలేదు! వారు రాకపోయేసరికి, ఆ మధ్యాహ్నం ఆ అరగంటలోనూ జరిగినది నిజంగా కలేనని నిర్ధారణ చేసుకున్నాను!

*(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 17.11.1967 నుంచి పునర్ముద్రణ)*

# పతితుని హృదయం

కీ.శే. వట్టికోట ఆళ్వారుస్వామి

**కథా మార్గదర్శి కథ**

*ఏదో ఖానూను ప్రకారమని అన్నావే, చదువుకున్న పెద్దలు, మావంటి వాండ్లను జైల్లో పెట్టి బాగు చేయదలచుకున్న పెద్దలు, మనిషిని చంపేదానికి ఖానూను వ్రాస్తే, వాండ్ల నుండి మావంటి వాండ్లు ఏం నేర్చుకోవాలె? ఒకడు మనిషిని చంపడమే తప్పు అంటున్న ఖానూను.. ఇంకొకడిని ఉరి తీసి చంపమని ఎట్లా అంటుంది తిరుపతయ్య సార్?"*

"అంతా వచ్చారా? ఏం మగ్గాల చప్పుడు కావడం లేదే?" అంటూ అధికారధ్వనిలో దఫేదారు తిరుపతయ్య నేతశాలలో ప్రవేశించి, లోపలనున్న ఖైదీలను లెక్కించసాగాడు.

అక్కడక్కడా ఇద్దరు ముగ్గురు కూడి, ఆనాడు ఉదయం ఉరితీయబడ్డ వ్యక్తి గురించి మాట్లాడుకుంటున్న ఖైదీలు.. తిరుపతయ్య రాగానే తమ స్థానాలలోకి వెళ్ళి కూర్చున్నారు.

"గండయ్య రానట్టుందే?" ప్రశ్నించాడు తిరుపతయ్య.

"రాలేదు సార్" ఒక ఖైదీ జవాబిచ్చాడు.


"ఎంత చెప్పినా వాడికి బుద్ధి రాదు. ఎప్పుడూ ఎక్కడో తిరుగుతుంటాడు. ఎక్కువ శిక్షవాడని నేను కొంచెం చనువుగా మెదులుతుంటే, అధికారులతో నాకు మాట తెచ్చేలాగున్నాడు" అంటూ నేతశాల వదిలి "మగ్గాలు ఆడనివ్వండి" అని ఆజ్ఞాపించి గండయ్య కొరకు బయలుదేరాడు తిరుపతయ్య.

తిరుపతయ్య అటు పోగానే ఖైదీలు మళ్ళీ మాటల్లో పడ్డారు.

"చూచావురా, తిరుపతయ్య మొహంలో ఇంతన్నా విచారముందో?"

"విచారమెందుకురా.. వాడెవడు? వీడెవడు?"

"పాపము ఉరితీసిన సంగతి అతని వాండ్లకు తెలుపుతారో లేదో!"



"తెలుసుకొని మాత్రం ఎవరేం చేస్తారు? వచ్చిన దగ్గరకు చేరుకున్నాడు."

"అదికాదు గాని, ఓ మనిషిని ఇంకో మనిషి చేతులు కట్టి, ఉరిపెట్టి వేలాడదీస్తే, చచ్చిందాకా గుడ్లు మిటకరిస్తూ చూడ్డానికి అక్కడ నిలుచున్న వాండ్లకెట్లా మనసొప్పిందో? నాకైతే అతని పీనిగెను చూడటానికి కూడ మనసొప్పలేదురా!"

"ఏమి వగలమారి మొగోడివిరా? రేపు నీకు జవాను కులువిచ్చి ఉరి తీయమంటే, తీయక ఏం చేస్తావు! ఖానూను ప్రకారం ఎవరైనా చేయాల్సి వస్తుందోయ్. ఖానూనంటే ఏం పిల్లకాయలాటనుకున్నావా?"

ఈవిధంగా ఖైదీలు చర్చించుకుంటుండగా తిరుపతయ్య, గండయ్యను వెంటబెట్టుకొని నేతశాలకు వచ్చి, మగ్గాల పని ఆగి ఉండుట చూచి, "మీకేమైంది ఈ రోజు? పని బొత్తిగా చేయడం లేదు. చెప్తున్నాను.. బాగా వినండి. మీ అందరిని దొర దగ్గరకు తీసుకెళ్లి నిలబెడ్త!" హెచ్చరించాడు తిరుపతయ్య.

తిరుపతయ్య వెనక నిలబడి, విచారంతో తల నేలకు వేసి వున్న గండయ్య "దొర దగ్గరకెందుకు? ఉరి దగ్గరకు తీసుకెళ్లరాదు?" అంటూ కండ్లనీరు తుడుచుకున్నాడు.

గండయ్య కంటినీరు చూడగానే తిరుపతయ్య చలించిపోయాడు. "ఈవేళ గండయ్య నాటకమాడుతున్నాడే! ఆడదానిలాగా ఏడ్వడం మొదలుబెట్టాడు. ఒక్కసారైనా వాడి మొకం చూచావో లేదో, వాడు చస్తే, చుట్టం చచ్చినట్టు ఏడుస్తావెందుకు?" తిరుపతయ్య టోపీ కింద పెట్టి, బీడీ కాలుస్తూ అడిగాడు.

"మా ఖైదీలకు చుట్టాలం.. మేము కాకపోతే నీవౌతావా తిరుపతయ్యా? పిల్లలు గలవాడివి.. సంసారం చేస్తున్నావు కూడా! పాతిక ఏండ్ల వయసు కుర్రోడ్ని, పెండ్లికొడుకోలె పట్టుకెళ్లి, స్తంభాని కేలాడదీయడానికి నీకు చేతులెట్లా వచ్చాయి? నీకు కోపమొస్తే మానెగాని, నీవు మనిషివి కావయ్యా!" అని గండయ్య గంభీరంగా అన్నాడు.

"పిచ్చోడా, నేను కాకపోతే ఇంకోడు తయారౌతాడు ఈ పనికి! ఉరితీయడానికి మనుషులు లేక ఉరితీయడం ఆగిపోతుందనుకున్నావా?" తిరుపతయ్య నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు ముసిముసిగా నవ్వుతూ.

"నీ సంగతే కాదు నేను అనేది, ఉరి తీసే వాండ్లగురించే అడుగుతున్నాననుకో. ఎవడు తీసాడో ఈ పద్ధతి గాని, ఉరి తీసిందాని కంటే 50 ఏండ్లో, 60 ఏండ్లో జైల్లో ఉంచిండే మంచిది." గండయ్య అన్నాడు.

"లేకుంటే నీ పద్ధతి, అంటే నీ గ్యాంగు పద్ధతితో చేస్తే ఇంకా బాగుంటుందిరా." అంటూ హేళనగా నవ్వాడు తిరుపతయ్య.

"తిరుపతయ్య సార్, మాకంటే నీవు మెరుగని సంతోషిస్తున్నావ్. నువ్వేమైనా అనుకో, మనసు మండి అనేస్తున్నాను. మేము తప్పు చేస్తే జైలు శిక్ష వేసినవాండ్లు, ఒక మనిషిని ఉరి తీసినవాడికి కూడా కఠిన శిక్ష వేస్తే బాగుంటుంది." గండయ్య కోపంతో అన్నాడు.

"నేను ఖానూను ప్రకారం ప్రభుత్వ ఆజ్ఞతో ఉరితీశాను తెలుసా? నన్నెవరు శిక్షిస్తారు? సరే కాని, మాటలు చాలా అయినవి. ఇకపోయి మగ్గం మీద కూర్చో, పో! దొరవచ్చే వేళైంది!" అంటూ తిరుపతయ్య డ్రెస్ సదురుకుంటూ గేటు వద్ద నిలుచున్నాడు.

"నేను ఇవాళ దొరని కూడా అడుగుతా.. ఏమైనగాని, ఇంత అన్యాయంగా ఉరితీయడం బాగలేదని.." అని గండయ్య కూడా తిరుపతయ్య పక్కన నిల్చున్నాడు.

తిరుపతయ్య కోపం నటిస్తూ, "ఒరే నీకు సిగ్గెందుకు లేదు? నువ్వూ మీ గ్యాంగువాళ్లూ కలిసి, ఎంతమంది ప్రాణాలు తీసారురా? ఎంతమంది పెళ్లిళ్లను ఎత్తగొట్టారురా? ఎన్ని కొంపల్ను నాశనం చేశారురా? అటువంటి నీవు ఎవర్నో ఉరి తీసినందుకు ఏడుస్తున్నావు! ఏమేమో వాదిస్తున్నావు! పైగా దొరను అడుగుతాడట.. దొరను! ఎప్పుడైతివి పత్తిత్తువు ?" అని గట్టిగా మందలించాడు తిరుపతయ్య.

గండయ్య కడుపులోని దుఃఖము ఇప్పుడు రౌద్రరూపము దాల్చింది. తానొక ఖైదీననీ, అధికార సిబ్బందిలోని ఒక వ్యక్తితో మాట్లాడుతున్నాననే సంగతే మరచిపోయాడు.

ఉగ్రుడై, "మాటిమాటికీ మాతో పోల్చుకోడానికి నీకు నోరెట్లా వస్తుంది? తప్ప త్రాగి, ఉడికీ ఉడకని మాసం తిని, బజారుముండలతో కాలం గడిపే మేము, ఒళ్ళు మరచి ప్రాణాలు తీశాం. దార్లుకొట్టి, పెండ్లిపిల్లలపై పడి, నగలు అపహరించాం. ఇండ్లలో జొరబడి దోచుకున్నాం. మత్తు దిగింతరవాత, ఒక్కొక్కప్పుడు మా చేష్టలకు మేమే పశ్చాత్తాప పడతాం. మేము చదువు రాని మొద్దులం. మాలో చదివినోడు గాని, మంచి చెడ్డ తెలిసినోడు గాని ఒకడుండడు. చిన్నప్పటి నుండి దొంగల సావాసంలో పెరిగాం. వాండ్లలో తిరిగాం. అవే బుద్ధులు.. అదే బతుకు!"

"ఇప్పటికైనా మమ్ముల ఈ పని నుండి మాన్పించి, మంచి విద్యావంతులుగా, బుద్ధిమంతులుగా తయారు చేయడానికెవరైనా ముందుకు వస్తే, మా గ్యాంగు మాటేమో గాని నా వరకూ నేను సిద్ధంగా ఉన్నాను. మరి నీ సంగతేమంటావు? ఏదో ఖానూను ప్రకారమని అన్నావే, చదువుకున్న పెద్దలు, మావంటి వాండ్లను జైల్లో పెట్టి బాగు చేయదలచుకున్న పెద్దలు, మనిషిని చంపేదానికి ఖానూను వ్రాస్తే, వాండ్ల నుండి మావంటి వాండ్లు ఏం నేర్చుకోవాలె? ఒకడు మనిషిని చంపడమే తప్పు అంటున్న ఖానూను.. ఇంకొకడిని ఉరి తీసి చంపమని ఎట్లా అంటుంది తిరుపతయ్య సార్?" గండయ్య గుడ్లెర్రజేసి గట్టిగా అడిగాడు.

తిరుపతయ్య వింతగా గండయ్య వేపు చూస్తూ "ఒరే, నీకు పిచ్చి లేసేటట్టున్నదిరా! పో, లోపలికి పో! దొర వస్తున్నాడు" అంటూ తిరుపతయ్య క్రమశిక్షణతో నించున్నాడు.

గండయ్యకూడా దూరంగా నిలుచొని జేలరు వేపు చూస్తున్నాడు.

జేలరు, జేలరు వెంట జమేదారూ గేటు లోపలకు ప్రవేశించగానే, జమేదారు రౌద్రముతో గండయ్య నుద్దేశించి "ఏమిరా నీవు ఈరోజు గంజి తీసుకోలేదేం?"

గండయ్య జేలరుకు దండం పెట్టి, "అయ్యా ఉరి తీసినప్పటి నుండి నాకు కడుపులో ఎట్లాగో ఉంది. నాకెటూ తోచడం లేదు. మీరు చదువుకున్నోరు గూడా ఇటువంటి పనులు చేస్తే, ఇక మా సంగతి ఎవరు అడుగాలె?" అని గండయ్య ప్రశ్నించాడు.

జమేదారు అధికారధ్వనిలో "నీవు గంజి త్రాగుతావా లేదా?" అని గర్జించుతూ ఓరకంటితో జేలరు వేపు చూసాడు.

జేలరు అయోమయస్థితిలో కపట బింకముతో తలనాడించాడు.

"తాగను సార్" గండయ్య నిర్భయంగా జవాబిచ్చాడు.

"ఒంటిగదిలో మూసేసి తరవాత నా దగ్గరకు తీసుకొని రాండి. వాడికి మంచిగా బుద్ధి చెప్తే రోగం కుదురుతుంది. గంజి తాగుతాడు. చదువుకున్నోళ్ళ సంగతి తెలుస్తుంది!" అంటూ వెళ్లిపోయాడు జేలరు.

*(రచయితగారు 1952 లో ముద్రించిన "జైలు లోపల" కథల సంపుటిలో నుంచి పునర్ముద్రణ)*

నమస్కారం.

కథామంజరి.. తెలుగుకథ విస్తృతే ధ్యేయంగా
ఐదు సంవత్సరాలుగా పనిచేస్తోంది.

ఇది లాభాపేక్ష లేని సంస్థ.
అందుకే ఇక్కడ చందా తప్పనిసరి కాదు.
తెలుగు కథ చదవండి, చదివించండి.

ఉచిత సంచిక కొరకు నమోదు చేసుకోవడానికి
ఇక్కడ నొక్కండి.

**https://zcmp.in/K93t**

బంగారు పళ్ళానికైనా గోడ ఆసరా కావాలంటారు.
అటువంటి ఆసరాని మీ నుండి ఆశిస్తున్నాం.

ఇక్కడ మీరు గమనించాల్సిన విషయం ఏమిటంటే!
ప్రస్తుతం వార్షిక చందా రూ.200/- ఐనప్పటికీ
చందాదారునికి, కానివారికి కూడా
అదే సంచిక, అదే తేదీన అందచేయబడుతుంది.

మాకు చేయూత నిద్దామని మీరు భావిస్తే,
ఇదిగో ఈ క్రింద లింకు నొక్కండి.

**https://imjo.in/ebrJuh.**